www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 5-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 217 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: చవితి రా. 12.17 తదుపరి పంచమి; నక్షత్రం: జ్యేష్ఠ ఉ. 9.45 తదుపరి మూల; వర్జ్యం: రా.6.10-7.51; దుర్ముహూర్తం: ఉ.8.34-9.20, రా.9.48-10.37; అమృతఘడియలు: తె.4.16-5.57; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.18; సూర్యాస్తమయం: 5.38 | వరంగల్

Warangal |Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బీసీ ప్రత్యేక కమిషన్ చైర్మన్‌గా బూసాని



రిటైర్డ్ ఐఏఎస్ వెంకటేశ్వరరావు నియామకం

'స్థానికం'లో రిజర్వేషన్లపై కమిషన్ ఏర్పాటు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నెలలో నివేదిక అందించాలని సూచన

13

సీతారామ టెండర్ల రద్దు?

ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం యోచన!

పాలన, ఆర్థికపరమైన అనుమతుల్లేకుండానే టెండర్లు

రూ.1842కోట్లతో ఆహ్వానించిన కొత్తగూడెం సీఈ

వాటిలో రూ.768 కోట్ల పనులకే పాలన అనుమతి

మంత్రుల కళ్లకూ సీఈ గంతలు.. ఈఎన్‌సీపై విమర్శలు

నీటి పారుదల మంత్రి ఎదుటే ఏకవచన ప్రయోగం!

సంజాయిషీ ఇవ్వాలని ఈఎన్‌సీకి, సీఈకి నోటీసులు



హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటర్లకు సంబంధించి.. పాలనాపరమైన, ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే పిలిచిన టెండర్లకు కమిషనరేట్ ఆఫ్ టెండర్స్ (సీవోటీ) కమిటీ ఆమోదముద్ర లభించే అవకాశం లేదా? అధికారులు వీటి రద్దుకే మొగ్గుచూపుతున్నారా? అంటే.. ప్రభుత్వం ఆ దిశగానే ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నిబంధనల ప్రకారం.. రూ.10 కోట్లు, ఆపై విలువ చేసే పనుల టెండర్ల ఖరారుకు అన్ని ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల ఈఎన్‌సీలు/చీఫ్ ఇంజనీర్లతో కూడిన సీవోటీ కమిటీ ఆమోదం తప్పనిసరి. ఆయా పనులకు సాంకేతిక, పాలనాపరమైన, ఆర్థికపరమైన అనుమతులు ఉంటేనే సీవోటీ ఆమోదం తెలుపుతుంది. కానీ.. ఈ నిబంధనలకు విరుద్ధంగా సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా.. రూ.1074 కోట్ల అంచనా వ్యయంతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు టెండర్లు పిలవడం నీటిపారుదల శాఖలో కలకలం రేపింది. సెప్టెంబరు 28- అక్టోబరు 5 మధ్యకాలంలో ఏడు వేర్వేరు

మిగతా 3వ పేజీలో...



జూబ్లీహిల్స్‌లోని నివాసంలో తనను కలిసిన విద్యార్థులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు తదితరులు

8న మూసీ బాట

పుట్టినరోజున నది పరీవాహక గ్రామాల్లో సీఎం రేవంత్ పాదయాత్ర

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహుడి దర్శనం

తర్వాత యాదాద్రి జిల్లా మూసీ కాలుష్య బాధిత రైతులతో మాటా-ముచ్చట

నాగారం నుంచి ఇంద్రపాలనగరం దాకా ముఖ్యమంత్రి పాదయాత్ర చేసే అవకాశం

సంగెం నుంచి బొల్లంపల్లి వరకూ పరిశీలన

మూసీ పునరుజ్జీవం ఆవశ్యకతపై వివరణ

ప్రాజెక్టుకు ప్రజల మద్దతు కూడగట్టే యత్నం

యాదాద్రి/హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మూసీ నది పునరుజ్జీవం విషయంలో ముందుకే వెళతామంటూ ఇటీవల స్పష్టం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ దిశగా ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతున్నారు. మూసీ నది కాలుష్యం కారణంగా భువనగిరి జిల్లాలోని పరీవాహక గ్రామాల ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రజల దృష్టికి తీసుకురానున్నారు. ఈ మేరకు బాధిత ప్రజలతో స్వయంగా మాట్లాడేందుకు ఆ ప్రాంతంలో పర్యటించనున్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేపట్టే యోచనలో ఉన్నారు. ఇందుకు తన పుట్టినరోజునే ముహూర్తంగా సీఎం ఎంచుకున్నారు. ఈ నెల 8న తన పుట్టినరోజును పురస్కరించుకుని

మిగతా 13వ పేజీలో...

నేడు రాహుల్‌గాంధీ రాక.. బోయిన్‌పల్లిలో కులగణనపై సదస్సుకు హాజరు 13

రాజకీయ పార్టీల రెచ్చగొట్టే

ప్రకటనలు నమ్మొద్దు

విద్యార్థులు, నిరుద్యోగులూ.. పోటీ పరీక్షలకు సిద్ధం కండి

విద్యతో ప్రయోజకులవుతారు

సమాజ సేవతో హీరోలవుతారు

కస్తూర్బా విద్యార్థులతో సీఎం

ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు!

ఉమ్మడి జిల్లాల వారీగా ఐఏఎస్‌లకు బాధ్యత 13

నేటి నుంచి టెట్ దరఖాస్తులు

నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కారు

జనవరి 1 నుంచి పరీక్షల నిర్వహణ

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)-2024కు సంబంధించిన నోటిఫికేషన్ సోమవారం వెలువడింది. మంగళవారం (5వ తేదీ) నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. జనవరి 1వ తేదీ నుంచి టెట్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఏడాదికి రెండుసార్లు టెట్‌ను నిర్వహిస్తామని ప్రభుత్వం ఇంతకు ముందు ప్రకటించింది. ఈ ఏడాదిలో ఇప్పటికే ఒకసారి టెట్‌ను నిర్వహించగా.. రెండో టెట్‌కు సంబంధించి తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు. దీని ప్రకారం టెట్ రాయాలనుకునే అభ్యర్థులు ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు

మిగతా 14వ పేజీలో...



ఉత్తరాఖండ్‌లో ఘోరం

200 మీటర్ల లోయలో పడిన బస్సు

36 మంది దుర్మరణం.. నలుగురు విషమం

24 మందికి గాయాలు.. హెలికాప్టర్‌లో ఆస్పత్రికి

అధిక భారం వల్లే ప్రమాదం: పోలీసులు

2

కెనడాలో హిందూ ఆలయంపై దాడి

భక్తులపైన కూడా.. ఖలిస్థానీల ఆగడం

కాన్సులర్ క్యాంపు వద్దా విధ్వంసం

ఒక్కరినీ అరెస్టు చేయని పోలీసులు

ఘటనను ఖండించిన మోదీ, జస్టిన్ ట్రూడో

2



హోరాహోరీ..!

స్వింగ్ రాష్ట్రాల్లో ట్రంప్‌నకు స్వల్ప మొగ్గు.. కమల వెనుకబాటు

గెలుపునకు 7 రాష్ట్రాలే కీలకం

సర్వేలు మాజీ అధ్యక్షుడి వైపే

ఉత్కంఠగా అమెరికా ఎన్నికలు

నేడు అగ్రరాజ్యంలో పోలింగ్

11వ తేదీలోగా ఫలితాలు

రూ.6 లక్షల కోట్లు ఉఫ్

భారీగా పతనమైన మార్కెట్


11

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో క్షణక్షణం ఉత్కంఠ నెలకొంటోంది..! 'నువ్వా-నేనా' అన్నట్లుగా రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ అభ్యర్థి కమలాహ్యారిస్ మధ్య పోరు హోరాహోరీ కొనసాగుతోంది. చివరి రెండ్రోజుల్లో స్వింగ్ రాష్ట్రాలపై ఇరువురు అభ్యర్థులు దృష్టి సారించగా.. ఓటర్లు స్వల్పంగా ట్రంప్ వైపు మొగ్గుచూపుతున్నట్లు సర్వేలు పేర్కొంటున్నాయి. తాజా సర్వేలతోపాటు, నేట్ సిల్వర్ వంటి ఎన్నికల వ్యూహకర్తలు ట్రంప్‌కే స్వింగ్ అని చెబుతుండగా.. ఆయన ఆధిక్యం 1-4% వరకే ఉందని, కమల తిరిగి పుంజుకోవచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు సోమవారం ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపించాయి. ముంబైలోని దలాల్ స్ట్రీట్ కూడా బేర్‌మనడంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాలను చవిచూశాయి.



న్యూయార్క్, నవంబరు 4: ఎన్నికల్లో పార్టీల అనుకూల-ప్రతికూల-తటస్థ అంశాలకు అనుగుణంగా అమెరికాలోని రాష్ట్రాలను మూడుగా విభజించారు. అవి.. రెడ్, బ్లూ, స్వింగ్ రాష్ట్రాలు. 1980 నుంచి రిపబ్లికన్లు విజయం సాధిస్తూవస్తున్న రాష్ట్రాలను రెడ్ స్టేట్స్ అంటారు. 1992 నుంచి డెమొక్రాట్లకు కంచుకోటలుగా ఉన్న రాష్ట్రాలను బ్లూ స్టేట్స్ అని పిలుస్తారు. అయితే.. ఓటర్లు ఏ పార్టీకి మద్దతిస్తారనే అంచనాకు అందని అరిజోనా, జార్జియా, మిషిగాన్, నెవడా, నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, విస్కాన్సిన్ రాష్ట్రాలను స్వింగ్ స్టేట్స్‌గా చెబుతారు. స్వింగ్ రాష్ట్రాల్లో మెజారిటీ సాధించే పార్టీకే అధికార పీఠం దక్కుతుంది. రెడ్ స్టేట్స్‌లో కమలకు 226 స్థానాలు దక్కుతాయని, బ్లూ స్టేట్స్‌లో 219 స్థానాలు ట్రంప్ ఖాతాలోకి చేరుతాయని అంచనా. అయితే.. మ్యాజిక్ ఫిగర్ 270 సీట్లను సాధించేందుకు స్వింగ్ రాష్ట్రాల్లో కమల 44, ట్రంప్ 51 సీట్ల దూరంలో ఉన్నారు. దాంతో.. ట్రంప్, కమల ఈ ఏడు

మిగతా 2వ పేజీలో...



విచ్చలవిడిగా గర్భవిచ్ఛిత్తి!

- గ్రామీణ మహిళల్లో అవగాహన లేమి
- సొమ్ము చేసుకుంటున్న ఆర్‌ఎంపీలు
- ములుగు, సిద్దిపేట ఘటనలతో కలకలం
- మార్కెట్లో అందుబాటులో అబార్షన్ పిల్స్
- వైద్యుల సిఫారసు లేకున్నా విక్రయాలు
- అమ్మకాలపై సర్కారు పర్యవేక్షణ ఏదీ?

వరంగల్/వరంగల్ మెడికల్, హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవాంఛిత గర్భాన్ని తొలగించుకోవడానికి సురక్షితమైన పద్ధతులున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిపుణులైన వైద్యులూ అందుబాటులో ఉన్నారు! గ్రామాల్లో సబ్ సెంటర్ల స్థాయిలో కూడా ఎంబీబీఎస్, బీఎంఎస్ వైద్యులను ప్రభుత్వం నియమించింది. కానీ.. చాలా మంది గ్రామీణ మహిళల అమాయకత్వాన్ని కొందరు ఆర్‌ఎంపీలు అవకాశంగా తీసుకుని విచ్చలవిడిగా, సురక్షితం కాని విధానాల్లో అబార్షన్లు చేసి వారి ప్రాణాలతో ఆటలాడుకుంటున్నారు! ఇటీవల ములుగు జిల్లాలో

మిగతా 14వ పేజీలో...



త్వరలో రైల్వే సూపర్ యాప్

ఇక సేవలన్నీ ఒకే చోట అందుబాటులో..

2

పత్తి రైతుకు ఎంత కష్టం!

అకాలవర్షాలతో పడిపోయిన దిగుబడులు

దొరకని మద్దతు ధర.. సీసీఐ కొర్రీల ఫలితమే

తేమ, నాణ్యత పేరుతో తక్కువ ధరకు కొనుగోళ్లు

నిబంధనలు చూపి కౌలు రైతులకు మొండిచేయి

మిల్లులకు కాసులు కురిపిస్తున్న సీసీఐ వైఖరి



వరంగల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సాగులో భారీగా పెరిగిన పెట్టుబడి వ్యయం.. ఆపై అకాల వర్షాల కారణంగా పెద్ద మొత్తంలో పడిపోయిన దిగుబడులతో దిగాలుగా ఉన్న పత్తిరైతు వచ్చిన పంటనైనా అమ్ముకుందామంటే మద్దతు ధర కరువవుతోంది. సీసీఐ పలు నిబంధనల పేరుతో కొర్రీలు పెడుతుండటంతో ఆశించిన ధర లభించడం లేదు. కౌలు రైతుల పరిస్థితి అయితే మరీ దారుణం. కౌలురైతుల నుంచి పత్తిని సీసీఐ కొనుగోలు చేయకపోవడంతో ఆ రైతులు తలపట్టుకుంటున్నారు. సీసీఐ వైఖరితో పత్తి రైతులు తమ దిగుబడులను జిన్నింగ్ మిల్లులు, ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ వానాకాలంలో 43,76,043 ఎకరాల్లో పత్తి సాగైంది. 25.33లక్షల మెట్రిక్ టన్నుల మేర దిగుబడి వస్తుందని మార్కెట్ శాఖ అంచనావేసింది. మే నెలలో ఆశించిన స్థాయిలో చినుకులు పడకపోవడంతో విత్తిన గింజలు మొలకెత్తలేదు. ఫలితంగా జూన్ చివర్లో రైతులు మరోసారి పత్తి

మిగతా 3వ పేజీలో...



హామీల అమలెప్పుడు?

6 గ్యారెంటీలు, డిక్లరేషన్లు ఏమయ్యాయి

రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు దివాలా

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

14



ఏడాదిలో వందేళ్ల విధ్వంసం!

రాహుల్.. నిరుద్యోగుల వద్దకు వెళ్లగలరా?

కాంగ్రెస్ వైఫల్యాలు చిత్రపటంపై చిట్టా

దోచుకుంటున్న సీఎం, మంత్రులు: కేటీఆర్



మాజీ సర్పంచ్‌ల అరెస్టుకు నిరసనగా తిరుమలగిరి ఠాణాలో బైఠాయించిన హరీశ్, మధుసూదనాచారి

బిల్లుల కోసం..

రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు దిగిన మాజీ సర్పంచులు

సీఎం ఇంటికివెళ్లి వినతిపత్రం ఇవ్వాలని ముందస్తు నిర్ణయం

ఎక్కడికక్కడ అరెస్టులు.. ఖండించిన మాజీ ప్రజాప్రతినిధులు

ఇది దుర్మార్గం.. వారేమన్నా దొంగలా, టెర్రరిస్టులా: హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు విడుదలచేయాలని మాజీ సర్పంచ్‌లు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లిని దర్శించుకున్న అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికివెళ్లి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించుకొని.. హైదరాబాద్ చేరుకున్న పలువురు మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టుచేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. సర్పంచ్‌ల సంఘం ముఖ్యనాయకులను వారి స్వగ్రామాల్లో ఉదయం నుంచే గృహనిర్బంధంలో

మిగతా 12వ పేజీలో...

కేసీఆర్, హరీశ్ ఇళ్ల ముందు ధర్నా చేయండి

12

సర్పంచ్‌ల ఆత్మహత్యలకు వారే కారణం

హరీశ్ హయాంలోనే పెండింగ్: సీతక్క

సర్పంచ్‌లూ.. విపక్షాల ఉచ్చులో పడొద్దు

మార్చిలోగా బకాయిలు క్లియర్: పొన్నం

కమలపై యూదుల్లో ఆగ్రహం

- పిట్స్‌బర్గ్‌లో ఆమె ప్రచార బృందంలో ఇజ్రాయెల్ వ్యతిరేకుల ప్రసంగాలు
- ముస్లిం, అరబ్ ఓట్ల కోసం యత్నం
- ఆమెకు ఓటేయబోమంటున్న యూదులు



పిట్స్‌బర్గ్, నవంబరు 4: ఒక వర్గం ఓట్లను ఆకర్షించడానికి రాజకీయం చేస్తే.. అది అడ్డం తిరిగి మరో వర్గం మొత్తానికే దూరమై, మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది! అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఇది మరోమారు రుజువు కాబోతోందా? అంటే.. అవుననే సమాధానమే వినిపిస్తోంది! ముస్లింలు, అరబ్బుల ఓట్ల కోసం.. ఇజ్రాయెల్ వ్యతిరేక యాక్టివిస్టులతో కలిసి పెన్సిల్వేనియాలో కమలా హ్యారిస్ చేస్తున్న ప్రచారం యూదుల్లో కోపానికి కారణమవుతోంది. దీనివల్ల ఆమె ఆ రాష్ట్రానికి ఉన్న 19 ఎలక్టోరల్ ఓట్లనూ కోల్పోయే పరిస్థితి ఉన్నట్టు సమాచారం. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఇటీవల పెన్సిల్వేనియా రాష్ట్రంలోని పిట్స్‌బర్గ్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆమెతో పాటు ఉండి, ప్రసంగాలు చేసినవారిలో.. పిట్స్‌బర్గ్ మేయర్ ఎడ్ గెయినీ, ఎలిఘెనీ కౌంటీ ఎగ్జిక్యూటివ్ సారా ఇనమొరాటో ఉన్నారు. వారిద్దరూ ఇజ్రాయెల్ వ్యతిరేకులే. 2023 అక్టోబరు 7న హమాస్ టెర్రరిస్టులు ఇజ్రాయెల్‌పై జరిపిన దాడి గుర్తుందా? ఆ దాడికి జవాబుదారీ ఇజ్రాయెలేనన్నది వారి వాదన. ఈమేరకు.. స్థానిక డెమొక్రాటిక్ పార్టీ ప్రజాప్రతినిధి సమ్మర్ లీతో కలిసి వారొక ప్రకటన కూడా విడుదల చేశారు. అసలే వారి ప్రకటనతో రగిలిపోతున్న యూదుల కోపం.. వారిని వెంటబెట్టుకుని ప్రచారానికి వచ్చిన కమలపైకి మళ్లింది. అధికారిక గణాంకాల ప్రకారం.. పెన్సిల్వేనియా రాష్ట్రంలో 4 లక్షల మందికి పైగా యూదులున్నారు. అక్కడ గెలవాలంటే వారి ఓట్లు చాలా కీలకం. తాజా పరిణామాల నేపథ్యంలో వారంతా ట్రంప్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకున్నట్టు స్థానిక వార్తాసంస్థల కథనాల సమాచారం. యూదు ఓటర్లే కాదు.. డెమొక్రాటిక్ పార్టీలో ఉన్న పలువురు యూదు ప్రతినిధులు కూడా పార్టీ తమను మోసం చేసినట్టు భావిస్తున్నారు. నిజానికి.. 1924 నుంచి అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మెజారిటీ యూదు ఓటర్ల మద్దతు డెమొక్రాటిక్ పార్టీకే. ఇప్పుడు కమల తీరుతో ఆ ఆనవాయితీ తప్పే ప్రమాదం కనిపిస్తోంది. ఈ ప్రభావం ఒక్క పెన్సిల్వేనియా రాష్ట్రానికే పరిమితమవుతుందా? లేక అన్ని రాష్ట్రాల్లోనూ యూదు ఓటర్ల కోపం ట్రంప్‌కు వరంగా మారుతుందా? అంటే.. వేచి చూడాల్సిందే!!

రికార్డు స్థాయి గాలి కాలుష్యంతో లాహోర్ నగరం ఉక్కిరిబిక్కిరి

- భారత్ నుంచి వీస్తున్న గాలులతోనే కాలుష్య కారకాలు వచ్చాయన్న పాక్.. లాహోర్‌లో స్కూళ్లకు వారం సెలవులు

న్యూఢిల్లీ, నవంబరు 4: పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం అత్యంత తీవ్రమైన వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతోంది. స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యూ ఎయిర్ సంస్థ ప్రకటించిన గాలి నాణ్యత సూచీ(ఏక్యూఐ) లాహోర్‌లో రికార్డు స్థాయిలో 1900గా నమోదైంది. దీంతో, లాహోర్ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత కలుషిత నగరంగా నిలిచింది. గాలి నాణ్యత సూచీ 200వరకు ఉంటేనే అనారోగ్యకరమైన వాతావరణ పరిస్థితిగా భావిస్తారు. అలాంటిది 1900గా నమోదైందంటే లాహోర్‌లో వాతావరణ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే, లాహోర్‌లో ఈ పరిస్థితికి భారత్ నుంచి పాకిస్థాన్ వైపునకు బలమైన గాలులు వీయడమేనని పాక్ పర్యావరణశాఖ కార్యదర్శి జహంగీర్ అన్నారు. బలమైన గాలులతో పాటు కాలుష్య కారకాలు పాకిస్థాన్‌కు వస్తున్నాయన్నారు. దీనికి భారత్‌దే బాధ్యత అని తాము అనడం లేదని, ఇది భౌగోళిక పరంగా జరిగే సహజ ప్రక్రియ అని చెప్పారు. కాలుష్య తీవ్రత నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం లాహోర్‌లో ప్రాథమిక పాఠశాలలకు వారం రోజులు సెలవులు ప్రకటించింది. ఆటోలు, నిర్మాణాలపై కొద్ది రోజులు నిషేధం విధించింది. ఆస్పత్రుల్లో స్మాగ్ కౌంటర్లను ఏర్పాటు చేసింది. ప్రైవేటు సంస్థలు తమ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ వెసులుబాటు కల్పించాలని ఆదేశించింది. ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని, తలుపులు, కిటికీలు మూసి పెట్టుకోవాలని, అనవసర ప్రయాణాలు పెట్టుకోవద్దని సూచించింది. కాగా, ఢిల్లీలో సోమవారం గాలి నాణ్యత 276గా ఉంది.

హోరాహోరీ..!



(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల్లో కాళ్లకు బలపం కట్టుకున్నట్లు తిరుగుతూ.. ప్రచారాన్ని వేగవంతం చేశారు. గత నెలాఖరు వరకు కమలకు అనుకూలంగా ఉన్న స్వింగ్ రాష్ట్రాలు ఇప్పుడు ట్రంప్ వైపు మళ్లాయని తాజా సర్వేలు చెబుతున్నాయి. అయితే.. ట్రంప్ సాధించేది స్వల్ప ఆధిక్యమేనని స్పష్టం చేస్తున్నాయి. గత నెలాఖరులో స్వింగ్ రాష్ట్రాల్లో కమలకు 44%, ట్రంప్‌నకు 43% ఓట్లు దక్కుతాయని సర్వేలు వెలువడగా.. ఇప్పుడు ట్రంప్‌తో పోలిస్తే.. కమల 1.8% వెనకబడ్డట్లు చెబుతున్నాయి. అట్లాస్-ఇంటెల్ ఈ నెల 1, 2 తేదీల్లో నిర్వహించిన సర్వే గణాంకాలు సోమవారం విడుదలయ్యాయి. ఈ సర్వే ప్రకారం.. స్వింగ్ రాష్ట్రాల్లో 48% మంది ఓటర్లు ట్రంప్ వైపు మొగ్గు చూపుతున్నారు. కమలకు 46.2% ఓట్లు దక్కే అవకాశాలున్నాయి. మరో సర్వేలో ట్రంప్-కమల మధ్య హోరాహోరీ పోరు జరుగుతున్నా.. రిపబ్లికన్లదే పైచేయిగా వెల్లడైంది. నెవెడాలో ట్రంప్ 51.4%, కమల 45% ఓట్లను సాధిస్తారని ఆ సర్వే తేల్చింది. ట్రంప్ నార్త్ కరోలినాలో 50.4%, నెవడాలో 51.4% ఓట్లతో ముందంజలో ఉంటారని తెలిపింది. అదే సమయంలో.. పెన్సిల్వేనియాలో కమల స్వల్పంగా వెనకంజలో ఉన్నట్లు వివరించింది. డెమొక్రాట్లకు 1948 నుంచి పెన్సిల్వేనియా అత్యంత కీలకమైన రాష్ట్రంగా ఉంది. ఆ ప్రాంతంలో పాగా వేయకుండా.. ఆ పార్టీ వైట్‌హౌస్‌లోకి అడుగు పెట్టిన దాఖలాలు లేవు. దీంతో డెమొక్రాట్లకు పెన్సిల్వేనియా ఓ సెంటిమెంట్‌గా కొనసాగుతోంది. 'ఫైవ్‌థర్టీఎయిట్' సర్వే కూడా స్వింగ్ రాష్ట్రాల్లో ఓటర్లు ట్రంప్ వైపే ఉన్నట్లు స్పష్టం చేసింది. అయితే.. ట్రంప్-కమల మధ్య తేడా చాలా స్వల్పమని పేర్కొంది. మరోవైపు ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త నేట్ సిల్వర్ 'హోరా-హోరీ' పోరు జరుగుతుందని చెబుతూనే.. ట్రంప్‌నకు విజయావకాశాలున్నట్లు వెల్లడించారు. ట్రంప్ 51.5%, కమల 48.1% ఓట్లను సాధిస్తారని ఆయన అంచనా వేశారు. నార్త్ కరోలినా, పెన్సిల్వేనియా, నెవడా, జార్జియా, అరిజోనాల్లో ట్రంప్ స్వల్ప ఆధిక్యంలో ఉన్నారని, మిషిగాన్, విస్కాన్సిన్‌లో హ్యారిస్ ఆధిక్యాన్ని చూపుతున్నట్లు వివరించారు. అయితే.. ఏబీసీ న్యూస్, న్యూయార్క్ టైమ్స్-సైనా కాలేజ్ సర్వేలు మాత్రం కమలకు జైకొట్టాయి. పెన్సిల్వేనియాలో కమల వెనకబడ్డారని న్యూయార్క్ టైమ్స్ స్పష్టం చేసింది. కాగా.. ట్రంప్ కంచుకోటగా పేరున్న ఐయోవాలో కమలాహ్యారిస్ దూసుకుపోతున్నారని సెల్జెర్ అండ్ కో, డెస్-మోయిన్స్ మీడియా కామ్ సర్వేలు స్పష్టం చేశాయి. ఇక్కడ కమలకు 47%.. ట్రంప్‌నకు 44% ఓట్లు దక్కుతాయని ఈ సర్వేలు వెల్లడించాయి.

మ్యాజిక్ ఫిగర్ దక్కకుంటే..?

538 స్థానాలకు గాను.. మ్యాజిక్ ఫిగర్– 270 సీట్లు సాధించిన వారే అమెరికా అధ్యక్ష పదవిని చేజిక్కించుకుంటారు. అయితే.. ఇరువురు అభ్యర్థుల్లో ఎవరికీ మ్యాజిక్ ఫిగర్ దక్కకుంటే..? అమెరికా ఎన్నికల్లో ఇలా జరగడం చాలా అరుదు. 1824లో ఇలాంటి పరిస్థితి నెలకొంది. దిగువ సభ(హౌస్ ఆఫ్ రిప్రెజెంటేటివ్స్) అధ్యక్షుడిని ఎన్నుకుంటుంది. ఎగువ సభ(సెనేట్)కు ఈ ఎన్నికతో సంబంధం ఉండదు. అయితే.. ఉపాధ్యక్షుడు/ఉపాధ్యక్షురాలిని సెనేట్ ఎన్నుకుంటుంది. దిగువ సభలో అధ్యక్ష ఎన్నికకు 26 రాష్ట్రాల ప్రతినిధుల మద్దతు ఉండాలి. 1924లో సంఖ్యాపరంగా ఆండ్రూ జాక్సన్‌కు అధిక స్థానాలు దక్కినా.. ఆయన ప్రత్యర్థి జాన్ క్విన్సీ ఆడమ్స్‌ను దిగువ సభ ఎన్నుకుంది.





హోరాహోరీ ఇలా..

రాష్ట్రం	ట్రంప్	కమల
అరిజోనా	49.1%	46.5%
విస్కాన్సిన్	48.2%	47.4%
జార్జియా	48.2%	47.1%
మిషిగాన్	47.9%	47.1%
నెవడా	47.9%	47.3%
పెన్సిల్వేనియా	47.9%	47.7%
నార్త్‌కరోలినా	48.4%	47.2%

ట్రంప్.. బెటర్ చాయిస్: నిక్కీ హేలి

భారతీయ అమెరికన్, ఐక్య రాజ్య సమితి(ఐరాస)లో అమెరికా మాజీ ప్రతినిధి నిక్కీ హేలి ట్రంప్ బెటర్ చాయిస్ అంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్‌లో ఆదివారం ఓ వ్యాసం రాశారు. "నేను ట్రంప్‌తో ఎన్నడూ 100% ఏకీభవించలేదు. అయితే.. కొన్నిసార్లు ఆయన విధానాలతో ఏకీభవించాను. కానీ, కమలాహ్యారిస్‌తో నేను 100% విభేదిస్తాను" అని అందులో పేర్కొన్నారు. ట్రంప్ వల్ల అమెరికాకు మేలు జరుగుతుందని, తటస్థ ఓటర్లు ఈ విషయాన్ని గుర్తించి, ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు. కాగా, కమలకు మద్దతుగా వస్తున్న ఓ యాడ్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఇది మహిళా ఓటర్లు స్వతంత్రంగా ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో చిత్రీకరించినా.. ట్రంప్ మద్దతుదారులు దీనిపై విమర్శలు చేస్తున్నారు.


ఫలితాలు ఎప్పుడు?

మంగళవారం(5వ తేదీ) ఎన్నికలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియగానే.. కౌంటింగ్ ప్రారంభమవుతుంది. భారత్ మాదిరిగా అమెరికాలో దేశమంతటికీ ఒకే ఎన్నికల సంఘం ఉండదు. అమెరికాలో.. సమాఖ్య వ్యవస్థలో భాగంగా ప్రతి రాష్ట్రానికి ఎన్నికల ఏజెన్సీలుంటాయి. ఆ ఏజెన్సీలే రాష్ట్రాల వారీగా ఎన్నికలను నిర్వహిస్తాయి. అయితే.. కొన్ని సందర్భాల్లో మినహాయిస్తే.. చాలా వరకు ఫలితాలు ఎన్నికల రోజు అర్ధరాత్రిలోగా.. లేదంటే తర్వాతి రోజు మధ్యాహ్నం వరకు వస్తాయి. ఈ సారి మాత్రం ఈ నెల 11వ తేదీ వరకు పూర్తిస్థాయి ఫలితాలు వస్తాయని అంచనా. కొత్త అధ్యక్షుడు వచ్చే ఏడాది జనవరి 20న ప్రమాణ స్వీకారం చేస్తారు.

బ్యాలెట్‌లో బెంగాలీ

న్యూయార్క్ నగరంలో బ్యాలెట్‌పై ఇంగ్లిష్‌తోపాటు.. చైనీస్, స్పానిష్, కొరియన్, బెంగాలీ భాషలకు చోటు కల్పించారు. ఈ విషయాన్ని న్యూయార్క్ రాష్ట్ర ఎన్నికల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మైఖేల్ రియాన్ వెల్లడించారు. గతంలో ఓ కోర్టు కేసు సందర్భంగా వచ్చిన తీర్పునకు అనుగుణంగా.. ఈ సారి బ్యాలెట్‌పై బెంగాలీకు చోటు దక్కింది. ఈ తరహా వెసులుబాటు న్యూయార్క్ నగరానికి మాత్రమే పరిమితం.

లోకం తీరు



ఐఎస్ఏ అధ్యక్ష స్థానంలో మళ్లీ భారత్

రెండేళ్ల పదవీ కాలానికి ఎన్నిక

న్యూఢిల్లీ, నవంబరు 4: అంతర్జాతీయ సౌర విద్యుత్తు కూటమి (ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్-ఐఎస్ఏ) ప్రెసిడెంట్‌గా భారత్ మళ్లీ ఎన్నికయింది. 2026 వరకు రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనుంది. ఉపాధ్యక్ష పదవికి ఫ్రాన్స్ ఎన్నికయింది. సోమవారం ఇక్కడ జరిగిన ఐఎస్ఏ ఏడో జనరల్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఈ విషయాన్ని ప్రకటించారు. సౌర విద్యుత్తు రంగానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషి కారణంగానే ఈ గుర్తింపు సాధ్యమయిందని తెలిపారు. స్టాండింగ్ కమిటీకి చెందిన ఎనిమిది వైస్‌ప్రెసిడెంట్ స్థానాలు కూడా భర్తీ అయ్యాయి. ఆఫ్రికా ప్రాంతం నుంచి వైస్ ప్రెసిడెంట్లుగా ఘనా, సీషెల్స్ ఎన్నిక కాగా, వాటికి సహకరించే వైస్ చైర్స్ దేశాలుగా దక్షిణ సూడాన్, కామరూన్ దేశాలు ఎన్నికయ్యాయి. ఆసియా-పసిఫిక్ ప్రాంతం నుంచి ఆస్ట్రేలియా, శ్రీలంక వైస్ ప్రెసిడెంట్లుగా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, పపువా న్యూ గినియా వైస్ చైర్స్‌గా ఎన్నికయ్యాయి. యూరోప్ ప్రాంతం నుంచి గ్రీస్, నార్వే వైస్‌ప్రెసిడెంట్లుగా, జర్మనీ, ఇటలీలు వైస్ చైర్స్‌గా; దక్షిణ అమెరికా, కరేబియన్ ప్రాంతం నుంచి గ్రెనెడా, సురినామ్ వైస్ ప్రెసిడెంట్లుగా, జమైకా, హైతీలు వైస్ చైర్స్‌గా ఎన్నికయ్యాయి. ఐఎస్ఏ డైరెక్టర్ జనరల్‌గా ఆశీష్ కన్నా ఎన్నికయ్యారు. ప్రస్తుత డైరెక్టర్ జనరల్ అజయ్ మాథుర్ వచ్చే ఫిబ్రవరిలో పదవీ విరమణ చేసిన అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

కెనడాలో ఆలయంపై దాడి

మరోసారి రెచ్చిపోయిన ఖలిస్థానీలు.. కాన్సులర్ క్యాంపు వద్దా విధ్వంసం

- ఒక్కరినీ అరెస్టు చేయని పోలీసులు
- తీవ్రంగా నిరసన తెలిపిన భారత్
- ఇది పిరికిపందల చర్య: మోదీ

ఒట్టావా/న్యూఢిల్లీ, నవంబరు 4: కెనడాలో ఖలిస్థానీలు మరోసారి హిందువుల ఆలయంపై దాడికి తెగబడ్డారు. టొరొంటోకు సమీపంలోని బ్రాంప్టన్ నగరంలో ఉన్న హిందూ సభ మందిరం వద్ద ఆదివారం విధ్వంసం సృష్టించారు. ఆలయానికి వచ్చిన భక్తులపై దాడి చేశారు. భారతీయుల కోసం కాన్సులర్ సేవలు అందించేందుకు ఆలయ ఆవరణలో స్థానికుల సహకారంతో భారత హైకమిషనర్ కార్యాలయం నిర్వహిస్తున్న కాన్సులర్ క్యాంప్‌పైనా ఖలిస్థానీలు దాడి చేశారు. అయితే, ఆ క్యాంపు వద్ద నియమించిన పోలీసులు ఇప్పటి వరకూ నిందితులెవరినీ గుర్తించలేదు. ఒక్కరిని కూడా అరెస్టు చేయలేదు. ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిందితులు ఖలిస్థానీ జెండాలతో అక్కడికి రావడం, భారత జెండాలు పట్టుకున్నవారితో ఘర్షణకు దిగడం ఆ వీడియోల్లో స్పష్టంగా కనిపించింది. ముష్టిఘాతాలు కురిపించడం, కొందరి చేతుల్లో కర్రలున్న దృశ్యాలు కూడా వీడియోల్లో కనిపించాయి. దీనిపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలనే డిమాండ్‌లు వెల్లువెత్తుతున్నాయి. ఘటనపై తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తూ ఒట్టావాలోని భారత హై కమిషనర్ కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కాన్సులర్ క్యాంప్‌నకు హాజరైన దరఖాస్తుదారుల భద్రతపైనా తాము ఆందోళన చెందామని ఆ ప్రకటనలో పేర్కొంది. భారత వ్యతిరేక శక్తులు విధ్వంసం సృష్టించినప్పటికీ ఆ క్యాంపులో వెయ్యి మందికి లైఫ్ సర్టిఫికెట్లు జారీ చేశామని తెలిపింది. దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. ఇది కెనడాలోని భారత దౌత్యవేత్తలను భయపెట్టడానికి పిరికిపందలు చేసిన ప్రయత్నమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీవ్రంగా ఖండించారు. 'భారత సంకల్పాన్ని ఇలాంటి హింసాత్మక చర్యలు బలహీనపరచలేవు. కెనడా ప్రభుత్వం న్యాయం చేస్తుందని, చట్ట పాలనను అమలు చేస్తుందని మేం ఆశిస్తున్నాం' అని 'ఎక్స్'లో మోదీ పోస్టు చేశారు. అది తీవ్రవాదులు, వేర్పాటువాదులు చేసిన దాడిగా భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ అభివర్ణించారు. 'ఇలాంటి ఘటనలు జరగకుండా అన్ని ప్రార్థనాలయాలకూ రక్షణ కల్పించాలని కెనడా ప్రభుత్వానికి మేం పిలుపునిస్తున్నాం. హింసకు పాల్పడినవారిని ప్రాసిక్యూట్ చేస్తారని కూడా మేం ఆశిస్తున్నాం. కెనడాలోని భారతీయుల భద్రత విషయంలో మేం తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం' అని జైస్వాల్ పేర్కొన్నారు. ఘటనను కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, ప్రతిపక్ష నేత పియెరీ పొలివ్రే కూడా ఖండించారు. ఈ దాడి ఆమోదయోగ్యం కాదని 'ఎక్స్'లో ట్రూడో పేర్కొన్నారు. కాగా, కెనడాలో ఖలిస్థానీ తీవ్రవాదుల ముప్పు పెరుగుతోందని ట్రూడోకు చెందిన లిబరల్ పార్టీ ఎంపీ చంద్ర ఆర్య 'ఎక్స్'లో పేర్కొన్నారు. కెనడాలోని రాజకీయ, చట్ట వ్యవస్థలను కూడా ఖలిస్థానీ తీవ్రవాదులు ప్రభావితం చేస్తున్నారని నిందించారు. 'ఈరోజు ఖలిస్థానీ తీవ్రవాదులు రెడ్‌లైన్‌ను కూడా దాటేశారు' అని ఆక్షేపించారు. ఘటనను అంటారియో సిక్స్ అండ్ గురుద్వారా కౌన్సిల్ కూడా ఖండించింది. ఘటనపై విచారణ జరపాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది.



కాన్సులర్ క్యాంపు వద్ద ఖలిస్థానీల దాడి

భక్తులపై పోలీసుల దాడి వీడియో వైరల్..

కెనడాలో హిందూ భక్తులపై కెనడా పోలీసులు దాడి చేసిన వీడియోను కెనడా జర్నలిస్టు ఒకరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆలయానికి వెళ్తున్న హిందువులపై పోలీసులు దాడి చేయడం ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. భక్తుల్లో చాలామంది చేతుల్లో భారత జెండా ఉంది. దీపావళి రోజు ఆలయాలకు వెళ్తున్న భక్తులను ఖలిస్థానీలు వేధించడాన్ని నిరసిస్తూ హిందువులు ప్రదర్శన నిర్వహిస్తుండగా పోలీసులు దాడికి పాల్పడ్డారు. ఒక నిరసనకారుడిని ఒక పోలీసు అనేకసార్లు కొట్టిన దృశ్యాలు కూడా వీడియోలో ఉన్నాయి. 'అతను లాఠీతో కొడుతున్నాడు' అంటూ వీడియోను చిత్రీకరించిన మహిళ మాట్లాడటం, 'అతన్ని బయటికి తీసుకెళ్లండి' అని నిరసనకారులు చేసిన నినాదాలు వీడియోలో వినిపిస్తున్నాయి.

బంగ్లా చొరబాటుదారులకు జేఎంఎం, కాంగ్రెస్ మద్దతు

ఓట్ల కోసం ఝార్ఖండ్ వ్యాప్తంగా వారికి నివాసం కల్పిస్తున్నారు

- ఇలాగైతే ఆదివాసీలు తగ్గిపోతారు
- ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ ఫైర్



గర్వా, నవంబరు 4: ఝార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వం రాష్ట్రమంతటా బంగ్లాదేశ్ చొరబాటుదారులకు నివాసం కల్పిస్తోందని ప్రధాని మోదీ ఆరోపించారు. వారికి పాలక కూటమి జేఎంఎం-కాంగ్రెస్-ఆర్జేడీ పార్టీలు అండగా ఉన్నాయన్నారు. బుజ్జగింపు రాజకీయాలే వాటి ప్రధాన ఎజెండా మారిందని ధ్వజమెత్తారు, ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన గర్వా, చాయిబాసాల్లో జరిగిన ర్యాలీల్లో ప్రసంగించారు. 'బుజ్జగింపులు పతాకస్థాయికి చేరాయి. ఈ మూడు పార్టీలూ సామాజిక సామరస్యాన్ని నాశనం చేస్తున్నాయి. చొరబాటుదార్ల ఓట్ల కోసం వారికి రాష్ట్రవ్యాప్తంగా నివాసం కల్పిస్తున్నారు. పాఠశాలల్లో సరస్వతీ వందనాన్నే అనుమతించడం లేదంటే ఎంత ప్రమాదకర పరిస్థితో ఊహించండి. పండుగల సందర్భంగా రాళ్ల దాడులు చేస్తున్నారు. ఇది చూపి అమ్మవారి వేడుకలు ఆపేస్తున్నారు. కర్ఫ్యూ విధిస్తున్నారు. చొరబాట్ల వ్యవహారం కోర్టుకెళ్తే.. అధికార యంత్రాంగం అదేమీ లేదని చెబుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలోకి కూడా వారు చొరబడ్డారు. ప్రజల రోటీ, బేటీ, మాటీలను తీసుకెళ్లిపోతున్నారు. ఈ మూడు పార్టీల చెడు విధానాల వల్ల ఆదివాసీ జనాభా తగ్గిపోతుంది. నకిలీ సర్టిఫికెట్లతో చొరబాటుదారులకు అవకాశాలిస్తూ గిరిజనుల గుర్తింపు, గౌరవం, ఉనికినే హేమంత్ సర్కారు ప్రశ్నార్థకం చేసింది. చొరబాటుదార్లు మీ బిడ్డలను తీసుకెళ్లిపోతున్నారు. భూములు కబ్జా చేస్తున్నారు. మీ ఆహారాన్ని తస్కరిస్తున్నారు. జార్ఖండ్ జనసంఖ్యలో మార్పులకు పెద్దఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి. బీజేపీకి అధికారమిస్తే.. చొరబాటుదార్లు కబ్జాచేసిన భూమిని తిరిగి తీసుకునేందుకు కఠిన చట్టం తెస్తాం' అని ప్రకటించారు. గిరిజనుల రిజర్వేషన్‌ను కాంగ్రెస్ గుంజుకుంటుందని హెచ్చరించారు. దానిని తన ఓటుబ్యాంకైన ముస్లింలకు ఇస్తుందని చెప్పారు. గిరిజనులను గౌరవించే పార్టీ బీజేపీయేనని.. పలు రాష్ట్రాల్లో సీఎంలు, గవర్నర్లుగా నియమించిందని గుర్తుచేశారు. పార్టీ అధ్యక్ష పదవి గానీ, రాష్ట్రపతి పదవి గానీ కాంగ్రెస్ ఎప్పుడూ గిరిజనులకు ఇవ్వలేదని.. రాష్ట్రపతిగా తొలి గిరిజన మహిళ ఎన్నికనూ వ్యతిరేకించిందని చెప్పారు. ఆదివాసీల ముద్దుబిడ్డయిన మాజీ సీఎం చంపై సోరెన్‌ను అవమానించారని.. తనకు బెయిల్ రాగానే హేమంత్ ఆయన్ను ముఖ్యమంత్రిగా తొలగించి తాను గద్దెనెక్కారని, హేమంత్‌కు తన కుటుంబం కంటే ఎవరూ ఎక్కువ కాదన్నారు.

14 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల తేదీ మార్పు

ఉత్తరప్రదేశ్(9), పంజాబ్(4), కేరళ(1) రాష్ట్రాల్లోని 14 అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల పోలింగ్ తేదీ మారింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ మేరకు ఆయా స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరగాల్సి ఉండగా.. వివిధ పండుగల నేపథ్యంలో 20వ తేదీకి మార్పు చేసినట్లు ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. అఖండ్ పథ్, కల్పతి రస్తోల్, కార్తీక పూర్ణిమ పండుగల నేపథ్యంలో పోలింగ్ తేదీని మార్చాలంటూ కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఆర్ఎల్డీ సహా పలు పార్టీలు అంతకుముందు ఈసీని కోరాయి.

ఫిర్యాదుల నేపథ్యంలో మహారాష్ట్ర డీజీపీ బదిలీ

ఎన్నికల సంఘం ఆదేశాలు.. పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ప్రతిపక్షాల ఆరోపణ

ముంబై, నవంబరు 4: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మహారాష్ట్ర డీజీపీ రష్మీ శుక్లాను బదిలీ చేస్తూ ఎన్నికల సంఘం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఆమె స్థానంలో మరొకరిని నియమించేందుకు ముగ్గురు అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను మంగళవారంలోగా పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుజాత సౌనిక్‌కు సూచించింది. అధికార మహాయుతి కూటమికి అనుకూలంగా రష్మీ వ్యవహరిస్తున్నారని విపక్షాలు ఆరోపించిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకొంది. ఆమె ప్రత్యక్షంగానే బీజేపీ పక్షాన పనిచేస్తున్నారని, విపక్ష నేతల ఫోన్లు ట్యాప్ చేసి ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు సమాచారం అందిస్తున్నారని శివసేన (ఠాక్రే) నేత సంజయ్ రౌత్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఝార్ఖండ్ డీజీపీని బదిలీ చేసినట్టుగానే ఆమెను కూడా మార్చాలని డిమాండు చేశారు. 1988 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి అయిన రష్మీ శుక్లా మహారాష్ట్ర తొలి మహిళా డీజీపీగా గుర్తింపు పొందారు.

ఉత్తరాఖండ్‌లో ఘోరం

200 మీటర్ల లోయలో పడిన బస్సు



లోయలో పడి నుజ్జునుజ్జు అయిన బస్సు

- 36 మంది దుర్మరణం.. 24 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం

మర్చులా (ఉత్తరాఖండ్), నవంబరు 4: ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. 60 మందితో ప్రయాణిస్తున్న ఓ ప్రైవేటు బస్సు అదుపుతప్పి 200 మీటర్ల లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 36 మంది దుర్మరణం పాలవగా.. మిగిలిన వారంతా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో చిన్నారులు, మహిళలు ఉన్నారు. ఉత్తరాఖండ్‌లోని అల్మోరా జిల్లాలో సోమవారం ఉదయం 8 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గర్వాల్ ప్రాంతంలోని పౌరి నుంచి ఆదివారం రాత్రి ఈ బస్సు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుమావున్‌లోని రామ్‌నగర్‌కు బయల్దేరింది. మరో 35 కి.మీ. ప్రయాణిస్తే గమ్యం చేరుకుంటుందనగా.. అల్మోరాలోని మర్చులా ప్రాంతంలో అదుపుతప్పి 200 మీటర్ల లోయలో పడిపోయింది. దీంతో ప్రయాణికులను బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఈ బస్సు సీటింగ్ సామర్థ్యం 43 మందే. కానీ.. ప్రమాద సమయంలో దీనిలో 60 మంది ఉన్నారు. ఓవర్ లోడ్ కారణంగానే బస్సు అదుపుతప్పి లోయలో పడి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. క్షతగాత్రులను రామ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన నలుగురిలో ముగ్గురిని హెలికాప్టర్ ద్వారా రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించగా.. ఒకరిని హల్ద్వానీలోని సుశీలా తివారీ ఆస్పత్రికి పంపినట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో మృతులు, క్షతగాత్రులను గుర్తించాల్సి ఉందని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం ప్రకటించిన ప్రధాని మోదీ

ఈ ప్రమాద వార్త తనను తీవ్రంగా కలచివేసిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ.. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.4 లక్షలు, గాయపడిన వారికి రూ.1 లక్ష చొప్పున అందిస్తామని ప్రకటించారు. ఈ ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని అధికారులను ఆదేశించారు. ఈ బస్సులో ఉన్నవారిలో ఎక్కువ మంది దీపావళికి స్వగ్రామాలకు చేరుకుని.. సెలవులు ముగియగానే తిరిగి విధుల్లో చేరేందుకు ఆదివారం రాత్రి బస్సు ఎక్కారు.

త్వరలో 'రైల్వే సూపర్ యాప్' ఆవిష్కరణ

- ఇక సేవలన్నీ ఒకే చోట అందుబాటులో...

న్యూఢిల్లీ, నవంబరు 4: రైల్వే సేవలన్నీ ఒకే చోట లభ్యమయ్యే 'సూపర్ యాప్' త్వరలో అందుబాటులోకి రానుంది. టిక్కెట్ల బుకింగ్, రిజర్వేషన్లు, ప్లాట్‌ఫారం టిక్కెట్లు, కేటరింగ్.. తదితర సేవలన్నింటినీ సమన్వయపరిచి ఒకే యాప్ రూపంలో ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. 'క్రిస్' సంస్థ ఈ నూతన యాప్ రూపకల్పనలో నిమగ్నమయింది. ఈ సమగ్ర మొబైల్ అప్లికేషన్ వచ్చే నెలలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ల ద్వారా ప్రయాణికులకు సేవలు అందుతున్నాయి. ఒక్కో సేవకు ఒక్కో అప్లికేషన్ ఉండడంతో వాటన్నింటినీ సమన్వయపరిచి సమగ్రమైన యాప్‌ను రూపొందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌తో 2023-24లో ఐఆర్‌సీటీసీ రూ.4,270.18 కోట్ల రెవెన్యూను ఆర్జించగా అందులో రూ.1,111.26 కోట్లు లాభంగా మిగిలింది. 45.30 కోట్ల టికెట్ బుకింగ్‌లు జరిగాయి.

వద్దన్నా మార్గదర్శిపై ప్రెస్‌మీట్లు

- హైకోర్టులో ఉండవల్లిపై లూథ్రా ఆరోపణ
- అలాంటిదేమీ లేదని జవాబు
- ఇరువురి మధ్యా వాగ్వాదం
- 69వేల పేజీల సమాచారం

పెన్‌డ్రైవ్‌లో కావాలని పిటిషనర్ వినతి

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మార్గదర్శి ఫైనాన్షియర్స్ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించిందన్న కేసు విచారణ సందర్భంగా సోమవారం హైకోర్టులో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా మధ్య వాగ్వాదం నెలకొంది. మార్గదర్శి కేసుపై మీడియాతో మాట్లాడరాదని చెప్పినప్పటికీ ఉండవల్లి ప్రెస్‌మీట్లు పెడుతున్నారని ఆ సంస్థ తరఫున హాజరైన లూథ్రా ఆరోపించారు. ఇందుకు ఉండవల్లి సమాధానం ఇస్తూ గత 90 రోజులుగా తాను మీడియాతో మాట్లాడలేదని, లూథ్రా కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రత్యారోపణ చేశారు.

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) చట్టానికి విరుద్ధంగా హిందూ అవిభాజ్య కుటుంబం (హెచ్‌యూఎఫ్) పేరిట మార్గదర్శి ఫైనాన్షియర్స్ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందంటూ ఉండవల్లి కేసు పెట్టారు. ప్రజల నుంచి సేకరించిన డిపాజిట్లు తిరిగి ఇచ్చేశామని చెప్పినంత మాత్రాన చేసిన తప్పు చట్టబద్ధమైపోదని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా హాజరైన ఉండవల్లి వాదనలు వినిపిస్తూ దాదాపు 69 వేల పేజీల డిపాజిటర్ల వివరాలు భౌతికంగా పుస్తకాల రూపంలో మార్గదర్శి సమర్పించిందని తెలిపారు. ఆ వివరాలను పెన్‌డ్రైవ్‌లో ఎలక్ట్రానిక్ రూపంలో తనకు అందజేయాలని కోరారు. ఆ వివరాలు ఉంటేనే తాను సరైన విధంగా ఈ కోర్టుకు సహాయపడగలనని పేర్కొన్నారు. మార్గదర్శి ఎస్క్రో బ్యాంకు ఖాతాలో దాదాపు రూ. 5 కోట్లకు పైగా మొత్తం ఉందని, ఈ డబ్బు ఎవరిదో తెలుసుకోవాల్సిన బాధ్యత అందరికీ ఉంటుందని తెలిపారు. అందరికీ తిరిగి చెల్లింపులు జరిపితే ఆ డబ్బు ఎందుకు ఉందో తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. మార్గదర్శి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఈ కేసు ప్రొసీడింగ్స్‌కు సంబంధించి మీడియాలో మాట్లాడరాదని సుప్రీంకోర్టు చెప్పినప్పటికీ ఉండవల్లి మీడియాతో మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆయన వ్యవహారశైలిపై సంక్షిప్తంగా అఫిడవిట్ ద్వారా వివరాలు సమర్పించామని పేర్కొన్నారు. దీనికి ఉండవల్లి స్పందిస్తూ లూథ్రా కోర్టును తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో సైతం ఇలాగే ప్రవర్తించారని అన్నారు. మీడియాతో మాట్లాడవద్దని తనకు ఎలాంటి ఆదేశాలు లేవని చెప్పారు. అయినప్పటికీ తాను మీడియాతో మాట్లాడటం లేదని.. 90 రోజులుగా ప్రెస్‌మీట్ పెట్టలేదని వివరించారు. మాట్లాడవద్దని కోర్టు ఆదేశిస్తే శిరసావహిస్తానని పేర్కొన్నారు. జోక్యం చేసుకున్న ధర్మాసనం.. ఇలాంటి అనవసర విషయాల్లోకి ఇరుపక్షాలు వెళ్లవద్దని సూచించింది. కేవలం కేసులో మెరిట్స్‌పై మాత్రామే తాము విచారణ చేపడతామని వ్యాఖ్యానించింది. విచారణ చేపట్టకుండా తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వబోమని తెలిపింది. పెన్‌డ్రైవ్ ద్వారా వివరాలు అందించడంపైనా విచారణ జరిపి ఆదేశాలు ఇస్తామని స్పష్టంచేసింది. వాదనలు వినిపించేందుకు సమయం కావాలని ఆర్బీఐ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ కోరడంతో విచారణ గురువారానికి వాయిదా పడింది.

అర్ధాంగిపై అంతులేని ప్రేమ

- మరణించిన భార్యకు గుడి కట్టించిన భర్త
- హనుమకొండ జిల్లాలో ఘటన


భార్య విగ్రహం వద్ద రాజకొంరయ్య

భీమదేవరపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అర్ధాంతరంగా తనువు చాలించిన భార్యపై తన ప్రేమను నిరూపించుకున్నాడో భర్త. అర్ధాంగికి గుడి కట్టి తన అంతులేని ప్రేమను చాటుకున్నాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో జరిగింది. ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన మద్దెల రాజకొంరయ్యకు 40 ఏళ్ల క్రితం మల్లమ్మతో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. ఆరేళ్ల క్రితం రాజకొంరయ్య దంపతులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మల్లమ్మ వాహనం పైనుంచి కింద పడింది. తీవ్ర గాయాలపాలై సుమారు రెండేళ్ల తర్వాత మరణించింది. ఆమెకు గుర్తుగా ముస్తాఫాపూర్‌లోని తన వ్యవసాయ క్షేత్రం వద్ద రూ.4 లక్షల వ్యయంతో రాజకొంరయ్య గుడి నిర్మించాడు. అందులో గ్రానైట్ రాయితో తన భార్య శిల్పాన్ని ఏర్పాటు చేశాడు. ఏటా అన్నదానం నిర్వహిస్తున్నాడు.

శారదాపీఠం భూ కేటాయింపులు రద్దు

- ఏపీ సర్కారు ఉత్తర్వులు

అమరావతి (ఆంధ్రజ్యోతి): జగన్‌గురువు, విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందకు కూటమి ప్రభుత్వం గట్టి షాక్ ఇచ్చింది. జగన్ ప్రభుత్వం 2021లో శారదాపీఠానికి చేసిన భూ కేటాయింపులను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖ జిల్లా భీమిలి మండలం కొత్తవలసలో శారదాపీఠానికి 15 ఎకరాల భూ కేటాయింపు ఉత్తర్వును రద్దు చేస్తున్నట్లుగా రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భూ కేటాయింపు రద్దు ఉత్తర్వును నేరుగా విశాఖ కలెక్టర్‌కు పంపించారు. శారదాపీఠం వద్ద ఉన్న ఆ 15 ఎకరాల భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని విశాఖ కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో 225 కోట్లపైమాటే. అయితే నాటి జగన్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా కారుచౌకగా రూ.15 లక్షలకే కట్టబెట్టింది. దీనిపై గత నెలలో 'ఆంధ్రజ్యోతి' కథనాలు ప్రచురించింది. ఈ భూ కేటాయింపులు రద్దు చేయాలన్న రెవెన్యూ ప్రతిపాదనను ఇటీవల మంత్రివర్గం చర్చించి ఆమోదించింది.

ఆర్టికల్ 370 రద్దుపై తీర్మానానికి పీడీపీ సభ్యుడి యత్నం

శ్రీనగర్, నవంబరు 4 : ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) ఎమ్మెల్యే తీర్మానానికి ప్రయత్నించడంతో జమ్ము, కశ్మీర్ అసెంబ్లీ తొలి సమావేశంలో గందరగోళం నెలకొంది. ఆరేళ్ల తర్వాత సోమవారం సమావేశమైన జమ్ము, కశ్మీర్ అసెంబ్లీ సమావేశంలో పీడీపీ ఎమ్మెల్యే వహీద్ పారా ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ, అలాగే జమ్ము, కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించారు. అయితే అది ఎజెండాలో లేదు. దీంతో అసెంబ్లీలో ఉన్న బీజేపీ ఎమ్మెల్యేలు 28 మంది లేచి నిలబడి తీర్మానం ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించారు. ఈ సమయంలో పలువురు సభ్యుల అరుపులు, కేకలతో గందరగోళం నెలకొంది. తీర్మానం తన వద్దకు రాలేదని, వచ్చినప్పుడు పరిశీలిస్తానని స్పీకర్ బదులిచ్చారు.

పత్తి రైతుకు ఎంత కష్టం!

(మొదటి పేజీ తరువాయి)

విత్తనాలు వేశారు. మొక్కలు ఏపుగానే పెరిగినా సెప్టెంబరు, అక్టోబరులో అకాల వర్షాలు మంచి దిగుబడిపై పత్తి రైతులు పెట్టుకున్న ఆశల్ని చిదిమేశాయి. చేలల్లో నీరు చేరడంతో వేరు సంబధిత తెగుళ్లు విజృంభించాయి. గులాబీ పురుగు వ్యాప్తి కూడా పెరిగింది ఫలితంగా ఎకరానికి 8క్వింటాళ్ల నుంచి 12క్వింటాళ్ల వరకు రావాల్సిన దిగుబడి. నాలుగైదు క్వింటాళ్లకే పరిమితమవడం రైతులను కుంగదీసింది. పత్తికి కేంద్రం క్వింటాకు రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ఈ ధర రైతులకు రావడం లేదు. కారణం పంటలో తేమ శాతం 8శాతం లోపే ఉండాలని, పత్తి పింజ పొడువు 29.5 మి.మీ నుంచి 30.5మి.మీ, మైక్రోసీర్ విలువ 3.5 నుంచి 4.3 ఉంటేనే మద్దతు ధర ఇస్తామని సీసీఐ ప్రకటించింది. తేమ పరంగా, పింజ పొడువు పరంగా కాస్త అటూ ఇటూ అయినట్టు అనిపిస్తే ధర తగ్గించేస్తున్నారు. గరిష్ఠంగా 7,421 నుంచి రూ.7471 వరకు మాత్రమే ఇస్తున్నారు. ఇక 12శాతానికి మించి తేమ ఉంటే పంటను కొనేందుకు సీసీఐ నిరాకరిస్తోంది. ఒకవేళ 12శాతం తేమ ఉన్నా పంట నాణ్యంగా ఉంటే రూ. 7,220.16 నుంచి రూ.7,124.16 వరకే ఇస్తోంది. ఇక పంట విక్రయించాక డబ్బులను రాబట్టుకోవడమూ రైతులకు ప్రహసనంగా మారింది. పత్తి విక్రయించిన రైతు తన ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ లింక్ ఉన్న ఉన్న మొబైల్ తీసుకెళ్లాలి. తీసుకెళ్లిన ఆధార్ సమాచారాన్ని సీఐడీఆర్ డేటా బేస్‌తో సరిపోల్చడం కోసం సీసీఐ డెమోగ్రాఫిక్ ధ్రువీకరణ ప్రక్రియ చేపడుతుంది. తర్వాత బయోమెట్రిక్ ధ్రువీకరణ కోసం రైతు వేలిముద్రలు లేదా ఐరిస్, ఆధార్ డేటాతో సరిపోల్చడ ం చేయాలి. ఇక చివరగా ఓటీపీ ఆధారిత ధ్రువీకరణ కోసం రైతు ఆధార్ లింక్ అయి ఉన్న మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని ఉపయోగించి ధ్రువీకరించిన తర్వాతే పత్తిని కొంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీసీఐ 320 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా, చాలాచోట్ల కొనుగోళ్లు ప్రారంభించలేదు. ఫలితంగా రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏ పంటలను ఎవరు సాగు చేశారనేది ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కౌలు రైతు పత్తి సాగు చేసిన చోట కూడా పట్టాదారు పేరునే నమోదు చేశారు. ఫలితంగా వ్యవసాయశాఖ పోర్టల్‌లో పంట సాగు చేసినట్లుగా ఎవరి పేరు నమోదు చేసి ఉంటే వారి ఖాతాల్లోకే డబ్బులు వెళతాయని సీసీఐ చెబుతోంది. ఈ కారణంగా కౌలు రైతులు కూడా తమ పంటను అమ్ముకునేందుకు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. గుజరాత్‌లో క్వింటా పత్తికి రూ.8వేల వరకు ధర లభిస్తోందని, రాష్ట్రంలో గరిష్ఠంగా రూ.7వేలకు మించి ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు. తెలంగాణలో నాణ్యమైన పత్తి పింజ పొడువు 29 మి.మీల నుంచి 30.5మి.మీలకు పైగానే ఉంటుందని, గుజరాత్‌లో మాత్రం గరిష్ఠంగా 29మి.మీలే ఉంటుందని, అయినా ఆ రాష్ట్రంలో పండిన పత్తికి ఉన్న డిమాండ్ తెలంగాణలో ఉండటం లేదని పత్తి రైతులు వాపోతున్నారు.


పత్తి రాకపోవడంతో వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లోని సీసీఐ కేంద్రంలో ఖాళీగా ఉన్న కాంటాలు

జిన్నింగ్ మిల్లులకు పండుగే..

సీసీఐ నిబంధనలు జిన్నింగ్ మిల్లుల వారికి, ప్రైవేటు వ్యాపారుల పాలిట వరంగా మారాయన్న చర్చ జరుగుతోంది. చాలా చోట్ల జిన్నింగ్ మిల్లుల వద్దే సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుంది. సీసీఐ కొర్రీలతో రైతులు జిన్నింగ్ మిల్లుల వద్ద కాంటా పెడుతున్నారు. అయితే సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు కుమ్మక్కై రైతుల నుంచి పత్తిని సీసీఐ కొనుగోలు చేయకుండా నాణ్యత ప్రమాణాలు, తేమశాతం పేరుతో తిరస్కరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫలితంగానే రైతులు జిన్నింగ్ మిల్లులు, ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా కూడా కొన్నేళ్లుగా సీసీఐ, ప్రైవేటు వ్యాపారుల మధ్య ఒప్పందం ప్రకారమే జరుగుతోందన్న చర్చ ఉంది.


పోలీసు శాఖలో పనిచేసినందుకు సిగ్గుపడుతున్నా

- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తే.. తాను పోలీస్ శాఖలో పనిచేసినందుకు బాధగా ఉందని, సిగ్గుతో తలదించుకుంటున్నానని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై ఇష్టానుసారంగా కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సోదరుడు శ్రీకాంత్ గౌడ్‌ను ములాఖత్‌లో శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు కలిసిన అనంతరం ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. పోలీస్ శాఖ ఘోరమైన స్థాయికి దిగజారిందని, ఎఫ్ఐఆర్‌లు గాంధీ భవన్‌లో తయారై, అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్లకు వస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం అంధుల ఇళ్ళను కూలగొడితే నిరాశ్రయులైనవారికి శ్రీకాంత్‌గౌడ్ పదిరోజుల పాటు భోజనం పెట్టి అండగా నిలబడ్డారని, దానికి కేసులు నమోదు చేయడం ఏంటని ప్రశ్నించారు.

సీతారామ టెండర్ల రద్దు?

(మొదటి పేజీ తరువాయి)



పనులకుగాను మొత్తం రూ.1842 కోట్ల అంచనాలతో అధికారులు టెండర్లను ఆహ్వానించారు. ఇందులో సుమారు రూ.768 కోట్లు విలువ చేసే పనులకు మాత్రమే ఆర్థిక శాఖ ఆమోదం తెలపగా, ఆ మేరకు పరిపాలనపరమైన అనుమతులను నీటిపారుదల శాఖ జారీ చేసింది. మిగిలిన రూ.1074 కోట్ల పనులకు అనుమతులను ఆర్థిక శాఖ పెండింగ్‌లో ఉంచింది. నీటిపారుదల శాఖ సైతం పరిపాలన అనుమతులు జారీ చేయలేదు. అయినా కూడా ఈ పనులకు కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ (సీఈ) ఎ.శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలోని అధికారులు టెండర్లు పిలవడం విమర్శలకు దారితీసింది. టెండర్లను ఆహ్వానించిన తర్వాత అనుమతులు లేని పనులకు ర్యాటిఫికేషన్ (క్రమబద్ధీకరణ అనుమతులు) కోరుతూ నీటిపారుదల శాఖకు ప్రాజెక్టు అధికారులు విజ్ఞప్తి చేయగా, సమగ్ర అంచనాలను సమర్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ టెండర్లపై నిలదీసిన ఈఎన్‌సీ (జనరల్)పై.. కొత్తగూడెం సీఈ ఆర్నెల్ల వ్యవధిలో రెండుసార్లు ఏకవచనంతో విమర్శలు చేయడం.. అది కూడా మంత్రుల ముందే రెచ్చిపోవడం గమనార్హం. ఎవరి ఆశీస్సులతో ఈయన ఈ విధంగా రెచ్చిపోతున్నారనేది శాఖలో ఎవరికీ అంతుచిక్కట్లేదు. ఏదేమైనా.. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీలకు సంబంధించి ఆరు టెండర్లకు బిడ్ల దాఖలు గడువు ఈ నెల 8తో ముగియనుండగా, ఒక టెండర్ గడువు సోమవారం(4)తో ముగిసింది. గడువు అనంతరం బిడ్లను తెరిచి... అర్హత కలిగిన కాంట్రాక్టర్ల వివరాలతో సీవోటీ కమిటీ ఆమోదానికి పంపించాల్సి ఉంటుంది. కానీ, ఎలాంటి అనుమతులూ లేనందున ఈ టెండర్లకు సీవోటీ కమిటీ నుంచి ఆమోదముద్ర లభించే అవకాశం లేదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఆర్థిక శాఖ అనుమతులు లభించకపోతే కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకోవడానికి వీలుండదని, టెండర్లను రద్దు చేయాల్సి ఉంటుందని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

సమయమే లేదట..

డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం, ఇతర పనులకు పరిపాలనపర అనుమతులు జారీ చేయాలని కోరుతూ కొత్తగూడెం సీఈ గత నెలలో నీటిపారుదల శాఖకు ప్రతిపాదనలు పంపించారు. కానీ.. 2016లో రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జీవో నం.12 ప్రకారం ఏ పనులు చేపట్టాలన్నా తొలుత సమగ్ర అంచనాలు, డిజైన్లు, డ్రాయింగులను రూపొందించాలి. ఇవన్నీ ఆ ఫైలులో లేకపోవడంతో ఈఎన్‌సీ(జనరల్) వాటిని తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. వాటిని ఎందుకు రూపొందించలేదని అధికారులు అడిగితే.. 'వాటి తయారీకి మూణ్నెల్లు పడుతుంది.. నాకంత సమయం లేదు' అని సీఈ శ్రీనివాస్ రెడ్డి బదులిచ్చినట్లు సమాచారం. దీనిపై జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులకు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డికి కూడా వాస్తవాలు చెప్పకుండా కళ్లకు గంతలు కట్టారని ఆయనపై విమర్శలు వస్తున్నాయి. తక్షణమే టెండర్లను పిలవాలని మంత్రులు ఆదేశించినట్లు మీటింగ్ మినిట్స్‌లో ఉందని, అందుకే ఆహ్వానించానని సదరు సీఈ చెబుతుండగా... నిబంధనల గురించి చెప్పకుండా దాచడం నేరపూరిత నిర్లక్ష్యమేనని పలువురు గుర్తు చేస్తున్నారు. కాగా.. కొత్తగూడెం సీఈ పనితీరును, పంప్‌హౌస్ నిర్మాణం తీరుతెన్నులను పరిశీలించిన ఓ అధికారి.. "ఆయన ప్రభుత్వం కోసం, రైతులకు నీళ్లివ్వడానికి కాదు... కేవలం కాంట్రాక్టర్ల కోసమే పనిచేస్తారు... కాంట్రాక్టర్ల మాటే శిలాశాసనం' అని సంచలన వ్యాఖ్యలు చేశారు.

సామాజిక సమీకరణకు ఎత్తు...

వరుసగా విమర్శలతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమిస్తుండగా సీఈ శ్రీనివాస్ రెడ్డి.. సోమవారం ఉదయం నీటిపారుదలశాఖలోని తన సామాజిక వర్గానికి చెందిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ), ఆ పైస్థాయి అధికారులతో మంతనాలు జరిపి.. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు కుట్రలు చేసినట్లు సమాచారం. కానీ, వారిలో కొందరు కీలక అధికారులు.. 'మీ అహంకారానికి మా మద్దతు ఉండదు' అని స్పష్టం చేసినట్లు తెలిసింది.

క్యాబినెట్‌లో విభేదాలు.. కాంగ్రెస్‌లో కుమ్ములాటలు

- సీఎం, డిప్యూటీ సీఎం మధ్య విభేదాలు: ఏలేటి



నిర్మల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్యాబినెట్‌లో విభేదాలు, కాంగ్రెస్‌లో కుమ్ములాటలను కట్టడి చేయలేని సీఎం రేవంత్‌రెడ్డి.. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్‌తో కలిసి కూల్చివేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ తప్పుడు ప్రచారాలు చేయించడం ఆయన దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం నిర్మల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పార్టీయే కుమ్మక్కైందన్నారు. అందుకే ఆ పార్టీ ముఖ్య నేతలపై కేసులు పెట్టడం లేదన్నారు. మంత్రి శ్రీధర్ బాబు అవగాహన లేకుండా బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని ఆరోపణలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం బీజేపీకి లేదన్నారు. ముఖ్యమంత్రులను మార్చిన చరిత్ర ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు రేవంత్‌రెడ్డిని మార్చి మరో సీనియర్ మంత్రిని సీఎం చేయడానికి కసరత్తు చేస్తున్నట్టు సమాచారం ఉందని.. దీనిపై తాను మీడియాలో మాట్లాడినట్టు మహేశ్వర్‌రెడ్డి వివరించారు. ఇందులో ప్రభుత్వాన్ని పడదోసే వ్యూహం మంత్రి శ్రీధర్‌బాబుకు కనిపించడం ఆయన దృష్టిలోపానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు విభేదాలు ఉన్న మాట వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. మొదటి నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న ఆరుగురు మంత్రులు క్యాబినెట్‌లో ఒక గ్రూపుగా.. సీఎంతో సహా టీడీపీ, బీఆర్ఎస్‌ల నుంచి వచ్చిన మిగిలిన ఆరుగురు మరో వర్గంగా విడిపోలేదా..? అని ప్రశ్నించారు. ఈ అంశాల ఆధారంగా ముఖ్యమంత్రి మార్పు గురించి కాంగ్రెస్ సీనియర్ల మధ్య జరుగుతున్న చర్చ గురించే తాను ప్రస్తావించినట్టు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదని మహేశ్వర్‌రెడ్డి అన్నారు.

డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామా

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి గంగాధర్


గంగాధర్

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ఉద్యోగం వదిలి రాజకీయాల్లో చేరుతున్నారు మందనం గంగాధర్. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన మందనం గంగాధర్ డీఎస్పీ విధుల నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. త్వరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన గంగాధర్ 1998 బ్యాచ్ ఎస్సైగా పోలీసు విధుల్లో చేరారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వరుసగా 12 పోలీస్‌స్టేషన్లకు ఆయన ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహించారు. సుమారు రెండున్నర దశాబ్దాలు పోలీసుగా తాను నిర్వహించిన సేవలు సంతృప్తినిచ్చాయని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు రాజకీయాల్లోకి వెళ్తున్నట్లు గంగాధర్ తెలిపారు.

బీసీల బతుకులు మారబోతున్నాయి: చనగాని

- బీఆర్ఎస్ హయాంలో 300 కోట్ల స్కాం: మెట్టు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రేవంత్ ప్రభుత్వంలో బీసీల బతుకులు మారబోతున్నాయని.. బీసీలంతా సంబరాలకు సిద్ధం కావాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ పిలుపునిచ్చారు. కులగణన చేయాలన్న రాహుల్ గాంధీ ఆలోచనను.. సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. సోమవారం గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. బీసీల కోసం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల హామీ మేరకు కులగణన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటే తెలంగాణ బీసీ సమాజం ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ అన్నారు. ప్రత్యేక కమిషన్ ఏర్పాటుతో బీసీలంతా సంతోషంగా ఉండడం ఓర్చుకోలేకే.. హరీశ్‌రావు సర్పంచ్‌లను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

తక్షణమే సంజాయిషీ ఇవ్వండి

- ఈఎన్‌సీ, కొత్తగూడెం సీఈకి నీటిపారుదల శాఖ తాఖీదులు
- సెలవు పెట్టి వెళ్లిపోవాలని సీఈకి సూచించిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీతారామ ఎత్తిపోతల పథకం టెండర్ల వివాదంలో నీటిపారుదలశాఖ అధికారుల ప్రవర్తనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ మేరకు.. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా.. క్రమశిక్షణ రాహిత్యం, దుష్ప్రవర్తనపై వెంటనే సంజాయిషీ ఇవ్వాలంటూ జి.అనిల్‌కుమార్‌తో పాటు కొత్తగూడెం చీఫ్ ఇంజనీర్ ఎ.శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. క్రమశిక్షణారాహిత్యం, దుష్ప్రవర్తనపై సంజాయిషీ ఇవ్వాలని వారిని నిర్దేశించారు. అధికారులు ఇద్దరూ సంజాయిషీ ఇచ్చాకా తదుపరి చర్యలకు ఉపక్రమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు గత శనివారం సీతారామ ప్రాజెక్టుపై జలసౌధలో నిర్వహించిన సమీక్షలో.. ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్‌పై సీఈ శ్రీనివాస్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడటం విమర్శలకు తావిచ్చింది. పరిపాలన అనుమతులు లేకుండా టెండర్లు ఏ విధంగా పిలిస్తారని, సీవోటీ ఆమోదం ఏ విధంగా లభిస్తుందని ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ ప్రశ్నించగా... తాను ఏడేళ్లు సీవోటీలో పనిచేసిన సమయంలో పాలనాపరమైన అనుమతి లేని టెండర్లను కూడా ఆమోదించానని సీఈ బదులిచ్చారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మొదలైన వాదన క్రమంగా ఏకవచన ప్రయోగానికి దారి తీసింది. నువ్వంటే... నువ్వు అనే అనే రీతిలో వీరి మధ్య వాగ్వావాదం జరగ్గా... ఓ దశలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జోక్యం చేసుకొని 'నోరు మూసుకోండి' అంటూ ఇద్దర్నీ వారించారు. అనంతరం.. 'నిబంధనలు అతిక్రమించినట్లు తేలితే చర్యలు తప్పవు.. వెంటనే సెలవులో వెళ్లిపోండి' అని కొత్తగూడెం సీఈకి వార్నింగ్ ఇచ్చారు. ఇద్దరి ప్రవర్తనా ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని, వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని రాహుల్‌బొజ్జాను ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విజయ్ గెలిచేనా...?

సినీరంగం నుంచి రాజకీయరంగంలోకి ప్రవేశించిన మరో తమిళ నటుడు విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆదివారంనాటి కార్యవర్గ సమావేశంలో పాతికకుపైగా తీర్మానాలు చేసింది. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని భారతీయ జనతాపార్టీ, రాష్ట్రంలో స్టాలిన్ నేతృత్వంలోని ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకె) లక్ష్యంగా ఈ తీర్మానాలు ఉన్నాయి. జమిలి ఎన్నికల ఆలోచన ఉపసంహరించుకోవాలని, నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)నుంచి తమిళనాడు బయటకు రావాలని, అటు కేంద్రం, ఇటు రాష్ట్రం కూడా తమిళనాట కులగణన ఊసెత్తకపోవడం ఇత్యాదివి ఈ తీర్మానాల్లో ఉన్నాయి. కేంద్రం తెస్తున్న వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగానూ, రాష్ట్రంలో ద్విభాషా విధానమే ఉండాలనీ, హిందీకి రాష్ట్రంలో చోటులేదంటూ కూడా తీర్మానాలు జరిగాయి. అధికారంలోకి వచ్చేందుకు స్టాలిన్ అబద్ధపు హామీలు ఇచ్చారని, ప్రజలను మోసం చేశారని కూడా ఆ పార్టీ తప్పుబట్టింది.

ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్టీ ఆరంభం నిర్ణయాన్ని ప్రకటించిన తరువాత, కొద్దినెలలపాటు వ్యవహారం వేగం పుంజుకోలేదు కానీ, ఇటీవల విజయ్ తన జోరుపెంచారు. వారం క్రితం పార్టీ ప్రారంభ మహాసభ లక్షలమందితో కిటకిటలాడిపోయింది. గ్లామర్ ఉన్న నటులకు అభిమానులతోపాటుగా ఆ పాటి జనం రాకపోరన్నమాట నిజమే కానీ ఆ సభను ఎంతో పకడ్బందీగా, క్రమశిక్షణతో నిర్వహించడం విశేషం. విజయ్‌లో మంచి వక్త ఉన్నాడని ఆ సభ రుజువుచేసింది. అనవసరపు పంచ్ డైలుగులు, అర్థంలేని ఆవేశపూరిత వ్యాఖ్యలు లేకుండా ఆకట్టుకొనే రీతిలో చక్కని ప్రసంగం చేశారు. బీజేపీని సైద్ధాంతిక శత్రువుగా, డీఎంకెని రాజకీయ ప్రత్యర్థిగా ప్రకటించారు. దానిని మతతత్వ ఫాసిస్టు పార్టీగా, దీనిని అవినీతిమయమైన కుటుంబపార్టీగా నిర్వచించారు. ద్రవిడ పదాన్ని అడ్డంపెట్టుకొని, ఈ కుటుంబపార్టీ రాష్ట్రప్రయోజనాల విషయంలో రాజీపడుతూ, కొందరితో లాలూచీకి వచ్చి రాజ్యాన్ని ఏలుకుంటోందని విజయ్ విమర్శలు చేశారు. కామరాజ్, అంబేడ్కర్, వేలు నాచ్చియార్ సహా తనకు ఎందరో ఆదర్శమని, సామాజికన్యాయం, మహిళా సాధికారత ఇత్యాది లక్ష్యాలకు కట్టుబడివున్నామని, దేవుడు లేడన్న వాదన మినహా పెరియార్‌ను మిగతా అన్ని విషయాల్లో అనుసరిస్తామని విజయ్ చెప్పుకొచ్చారు. ఆ సందర్భంగా ఆయన ప్రకటించిన పార్టీ విధానాలమీద తమిళనాడును దశాబ్దాలుగా ఏలుతున్న అన్నా డీఎంకె, డిఎంకె వంటి పార్టీలనుంచి విమర్శలు రావడం సహజం.

కొత్తసీసాలో పాతసారా, కలగూరగంప, కాపీ పేస్ట్ ఎజెండా, కాక్‌టెయిల్ వంటి విమర్శలు ఈ కొత్తపార్టీ ఎదుర్కొంటోంది. రాజకీయాల్లోకి కొత్తయినా ఏ దశలోనూ తాను వెనక్కుతగ్గేది లేదని విజయ్ కాస్తంత గట్టిగా చెబుతున్నారు. ఆరంభం బాగుంది అంటూ రజనీకాంత్ అందించిన శుభాకాంక్షల సందేశంలో కొనసాగింపే కష్టమన్న ధ్వని చాలామందికి తోచింది. రాజకీయరంగ ప్రవేశానికి సర్వమూ సిద్ధం చేసుకున్న తరువాత, దశాబ్దాలుగా సినీరంగంనుంచి పోగేసుకున్న ఆస్తులు, అభిమానాలు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ, వయసు, ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని రజనీ ఆఖరునిముషంలో వెనకడుగువేసిన విషయం తెలిసిందే. కమలహాసన్ సైతం సొంతంగా పార్టీ ఆరంభించి బొక్కబోర్లాపడ్డారు. గత తమిళ అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఆర్నెల్లముందు పార్టీని ప్రకటించి, సిద్ధాంతాలు ఆదర్శాలు అంటూ ఏవో కొన్ని ప్రజలముందు ఉంచిన రజనీకాంత్, నిర్భయంగా రాజకీయ రంగప్రవేశం చేసివుంటే డీఎంకె ఇంత సులభంగా అధికారంలోకి రాగలిగివుండేదా అన్నది కొందరి అనుమానం. ఇప్పుడు, విజయ్ కొత్తపార్టీ ఎవరికి మేలుచేస్తుందన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. ద్రవిడ మున్నేట్ర కళగంను దెబ్బతీయడానికే ఈ తమిళగ వెట్రి కళగం పుట్టుకొచ్చిందని స్టాలిన్ విమర్శలు చేస్తున్నారు. కుమారరత్నం ఉదయనిధిని సీఎం కుర్చీలో కూచోబెట్టాలని ఆయన ఆశపడుతున్న తరుణంలో దాదాపు అంతే వయసున్న విజయ్ రాజకీయాల్లోకి రావడం విశేషమైన పరిణామం. అయితే, తమిళరాజకీయాల్లో విజయ్ ప్రవేశం డీఎంకెను కాక అంతకంటే అధికంగా దానికి బలమైన ప్రత్యర్థిగా ఉన్న అన్నాడీఎంకెను దెబ్బతీస్తుందని ఒక విశ్లేషణ. తమిళ ఓటర్లు ప్రధానంగా ఈ రెండుపార్టీల మధ్యా చీలిపోయివున్న నేపథ్యంలో, కరుణానిధి పార్టీ వ్యతిరేకులైన జయలలిత పార్టీ అభిమానులను విజయ్ పెద్ద ఎత్తున తనవైపు తిప్పుకోవచ్చును. జయలలిత మరణానంతరం ముక్కలై, ఆధిపత్యపోరుతో క్రమంగా బలహీనపడుతున్న జయలలితపార్టీనుంచి ఓటర్లు విజయ్ వైపు మళ్ళిపోవడం అనూహ్యమేమీ కాదు. ఎంతో ఘనంగా తన రాజకీయప్రస్థానాన్ని ఆరంభించిన విజయ్ తమిళరాజకీయాల్లో ఎటువంటి ప్రభావం చూపగలరో 2026లో తేలుతుంది.

కాబోయే విజేతకు విజయ హారతి!

అమెరికా అధ్యక్ష పదవీ ఎన్నిక జీవిత సదృశమైనది. ఆ మహా ప్రజాస్వామిక సమర తీరుతెన్నులు తరచు మారిపోతుంటాయి. అంతిమ విజయం ఎవరిదనే విషయమై మనం ఊహలు చేస్తాం. నిర్దిష్ట అంచనాలకు వచ్చేందుకు ఆరాటపడతాం. అయితే తడబడతాం. మన పిచ్చా పాటీలో ప్రత్యామ్నాయ సంవాదాల వైపు మొగ్గు చూపుతాం. రాజకీయ పండితులు తెలివైన కథనాలు నివేదిస్తారు, అయితే పోరు పూర్తయిన తరువాతనే సుమా! అయితే ఇందుకు వారు విజేత ఎవరో నిర్ణయమవక ముందే క్రియాశీలంగా ప్రతిస్పందించవలసి ఉంటుంది. ఎవరు గెలుస్తారు లేదా గెలవరు అనే విషయమై నిరాకరించదగిన, ఆంగీకార యోగ్యమైన అభిప్రాయాలను సేకరించవలసి ఉంటుంది. ఆఖరుకు 'నేను ముందే చెప్పలేదా?' అంటూ తమ సర్వజ్ఞతను సగర్వంగా ప్రదర్శిస్తారు!

ఎన్నిక ఫలితాలు వెలువడిన తరువాత ఎవరు గెలిచారు అనే విషయం ఆధారంగా పాత్రికేయులు తాము ముందే తయారు చేసుకున్న కథనాలలో విజేత కనుగుణమైనదానిని ఎంపిక చేసుకుంటారు. డోనాల్డ్ ట్రంప్ గెలిచినట్లయితే అమెరికాకు అధికారికంగా, అనధికారికంగా వలస వచ్చిన, వస్తున్న వారు, ముఖ్యంగా మెక్సికన్ల పట్ల కఠిన వైఖరితో కూడిన విధానాన్ని అనుసరించాలన్న వాదన కారణంగా ఆయన విజయం సాధించారని తప్పక వక్కాణిస్తారు. ట్రంప్ ఓడిపోయారనుకోండి. అందుకు అధిక సంఖ్యాక వర్గం – శ్వేత జాతీయులు– వారే కారకులు అవుతారు. మిన్నెసోటా, మోంటానా లాంటి రాష్ట్రాల ఓటర్లు వలసల వ్యతిరేక వైఖరిని పట్టించుకోకపోవడమే కారణమవుతుంది. ఇంతకూ ఆ రాష్ట్రాల వారు చూసిన, చూస్తున్న మెక్సికన్లు వెండితెరపై కనిపించేవారు మాత్రమే. మరి వారు హాలీవుడ్ నటుడు క్లింట్ ఈస్ట్‌వుడ్‌కు సరిపోలరు కదా.

కమలా హారిస్ గెలవడం జరిగితే అందుకు ప్రధాన కారకులు నల్ల జాతివారే (ఆఫ్రికన్ అమెరికన్లు). అందునా ఒప్రాహ్ విన్ ఫ్రే, మిషెల్ ఒబామా లాంటి ప్రముఖ ఆఫ్రికన్ అమెరికన్ ప్రముఖులు ఆమె పక్షం వహించడమే కమలాహారిస్‌కు కలిసివచ్చింది. అయితే నల్ల జాతీయుల మద్దతులో మరో కోణాన్ని కూడా మనం చూడవలసి ఉంది. నల్ల జాతి పురుష ఓటర్లు ప్రభావశీలమైన వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసంతో వ్యవహరిస్తూ, ఎటువంటి సవాళ్లనైనా సదా సమర్థంగా ఎదుర్కోగల ధీర ఒక అగ్రగామిగా ఉండడాన్ని ఇష్టపడరు. సరే, కమలా హారిస్ కూడా ఒక నల్ల జాతీయురాలే అని వారు భావించరు. మరి డోనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి గురించి నిరంతరం ఘోషిస్తోంది ఇదే కదా!

ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశంగా ఉన్న గర్భస్రావం విషయాన్ని చూద్దాం. ప్రతిష్ఠాత్మక అధ్యక్ష పదవికి తమ అభ్యర్థిగా కమలా హారిస్‌ను ఎంచుకున్న డెమొక్రాట్లలో అత్యధికులు గర్భ స్రావాన్ని చట్టబద్ధం చేయాలని వాదిస్తున్నారు. అయితే దీనివల్ల మహిళలకు, తగినంత మంది పురుషులకు మాత్రమే ప్రయోజనముంటుంది. కమలాహారిస్ గెలిచినపక్షంలో అందుకు కారణం అమెరికన్లలో కనీసం సగం మంది మహిళలు కావడమే. పిల్లలను కనే వయస్సుదాటిన వారు సైతం గర్భస్రావాన్ని చట్టబద్ధం చేయాలని పట్టుబడుతున్నారు. వీరంతా 1970ల నాటి రో వెర్సెస్ వేడ్ కేసులో గర్భస్రావం అనుకూల తీర్పుకు పోరాడినవారే. ఆ తీర్పు విషయంలో డోనాల్డ్ ట్రంప్ వైఖరి సానుకూలంగా లేదు.



అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ మధ్య తీవ్ర పోటీ ఉందని, ఎవరు విజేత అవుతారన్నది అసందిగ్ధంగా చెప్పలేమని రాజకీయ పండితులు ముక్తకంఠంతో అంటున్నారు. సంభావ్య విజేత గురించి పాత్రికేయులు ముందుగా తయారు చేసుకున్న కథనాలు ఈ ఏకాభిప్రాయం ప్రాతిపదికనే ఉన్నాయి. గెలిచిన అభ్యర్థి ఎవరు అన్న దానిపై ఆధారపడి ఆ పూర్వరచిత కథనాలలో వాస్తవ విజేతకు అనుగుణంగా ఉన్న వాటిని వారు ప్రచురిస్తారు!

కమలా హారిస్ గెలిచిన పక్షంలో కచ్చితంగా ఒక కారణం అందుకు ప్రధానంగా దోహదం చేస్తుంది: ఆమె తన భావాలు, అభిప్రాయాలను, అనుసరించబోయే విధానాలను ప్రశాంతంగా, ఎటువంటి తడబాటు లేకుండా స్పష్టంగా విశదంగా చెప్పడమే, సందేహం లేదు. అయితే ఓడిపోయిన పక్షంలో ఆమె వివరణలు, విధానాలు, నినాదాలు ఏవీ హాంబర్గర్, హాట్ డాగ్ స్టాండ్ (అమెరికాలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లు, స్నాక్స్ క్యాంటీన్‌లు)ల లోనివారిని ఎటువంటి ఉద్వేగాలకు లోనుచేయదు. ఆ రాజకీయ పరిణామాన్ని పట్టించుకోవడంపై వారు శ్రద్ధ చూపరు. విజితురాలుపై వారిలో ఎటువంటి సానుభూతి జనించదు. మహిళా ఓటర్లలో అత్యధికులు తన పక్షానే ఉన్నారని కమలా హారిస్ భావిస్తున్నారేమో కానీ శక్తిమంతుడైన డోనాల్డ్ జాన్ ట్రంప్ తమ సమక్షంలో నిలబడినప్పుడు వారిలో ఎంత మంది ఆయను అనురాగ దృక్కులతో చూస్తారో ఆమెకు తెలుసా?

డోనాల్డ్ ట్రంప్ ఓడిపోయిన పక్షంలో కారణమేమవుతుంది? ఆయన తన రాజకీయ ప్రత్యర్థులను తరచు తీవ్రంగా విమర్శిస్తుండడం, వలసవచ్చినవారిని దూషించడమే; అంతే కాదు, తీవ్ర శిక్షలకు అర్హమైన మహాపరాధాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఎన్నో కేసులు ఉండడం కూడా. అంతేనా? ఎన్నికల ప్రచారానికి ఓటర్లు సమకూర్చిన నిధుల నుంచి ఒక సెక్స్ వర్కర్‌కు, తన ప్రతిష్ఠను కాపాడుకునే నిమిత్తం చెల్లింపులు జరిపారన్న తీవ్ర అప్రతిష్ఠను మూటగట్టుకోవడమూ ఆయన ఓటమికి దారితీసిందని చెప్పడం అనివార్యమవుతుంది. ట్రంప్ గెలిచారే అనుకోండి అప్పుడు ఆయన ఒక శక్తిశాలి పురుషపుంగవుడు కావడమేనని తప్పక చెప్పుతారు. మహిళల కంటే పురుషులనే ఎక్కువగా ఆకట్టుకునే వ్యక్తిత్వ వైనాలు ఆయనలో బాగా ఉన్నాయని ఘోషిస్తారు.

డోనాల్డ్ ట్రంప్ మళ్లీ శ్వేత సౌధం (అమెరికా అధ్యక్షుని అధికార నివాసం) ఆసామీ అయితే అందుకు తోడ్పడిన కారణం ఆయన అధ్యక్ష పదవీ కాలం (2017–21)లో ద్రవ్యోల్బణం తక్కువగా ఉండడమే. అలాగే నిరుద్యోగిత స్వల్ప స్థాయిలో ఉండడమే. అయితే ట్రంప్ పదవీకాలం ఆఖరులో ద్రవ్యోల్బణమూ పెరిగింది, నిరుద్యోగిత సైతం పెచ్చరిల్లింది. అయినా అందుకు ట్రంప్‌ను మీరు తప్పుపట్టలేరు. ఎందుకని? కోవిడ్ విలయాన్ని గుర్తు చేసుకోండి. ట్రంప్ హయాంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉన్నట్టు కన్పించడానికి కారణమేమిటో ఆయనకు తక్షణ పూర్వం అధ్యక్షుడుగా ఉన్న బరాక్ ఒబామా ఇలా చెప్పారు: 'జార్జి బుష్ చిందరవందర చేసిన ఆర్థిక వ్యవస్థను తాను బాగు చేసి దాన్ని మళ్లీ శీఘ్ర పురోగతి బాటలోకి తీసుకువెళ్లడమే'. కనుక దేశ ఆర్థిక వ్యవస్థను మళ్లీ శక్తిమంతం చేసిన ఘనత నిస్సందేహంగా డెమొక్రాట్లదేనని ఒబామా ఘంటాపథంగా అన్నారు.

దిగుమతులపై అత్యధిక స్థాయిలో సుంకాలు విధించడానికి తాను వెనుకాడనని ట్రంప్ ఇప్పుడు గట్టిగా చెప్పుతున్నారు. అమెరికన్ల ఉద్యోగాలను కాపాడేందుకు ఈ చర్య తప్పనిసరి అని ఆయన వాదిస్తున్నారు. ట్రంప్ ప్రతిపాదిత సుంకాలు ఎవరూ ఎప్పుడూ కలలో కూడా కనీవినీ ఎరుగని స్థాయిలో హెచ్చుగా ఉన్నాయి. ట్రంప్ సరళంగా తన విధానాన్ని ప్రతిపాదిస్తున్నారు. ఆర్థిక వ్యవస్థను పీడిస్తున్న సమస్యలు అన్నిటినీ మటుమాయం చేసే అఖండ పరిష్కారమది. కమలా హారిస్ సైతం ఆర్థిక వ్యవస్థను మళ్లీ చక్కదిద్దేందుకు తన ప్రణాళికలను వివరిస్తున్నారు. ఆమె ఎన్నో అంకెలు ఏకరువు పెడుతున్నారు. నోబెల్ ఆర్థిక పురస్కార గ్రహీతలు (అమెరికాలో వీరి సంఖ్య తక్కువేమీ కాదు సుమా!) ఆమె ఆలోచనలు, ప్రతిపాదనలను ప్రశంసిస్తున్నారు. అయితే అసాధారణ మేధావంతులు, హాస్యదాయక రేఖా చిత్రకథలు చదివి ఆనందించేవారి ప్రపంచాలు పూర్తిగా భిన్నమైనవి. అవి పరస్పరం చాలా సుదూరమైనవి మరి.

డోనాల్డ్ ట్రంప్‌ను కమలా హారిస్ ఓడించిన పక్షంలో ఆమె ప్రతిపాదించిన ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానానికి ఆ ప్రతిష్ఠ దక్కుతుంది. ఆమె ఎటువంటి శాఖా చంక్రమణం చేయకుండా ఆ ఓటర్లకు నివేదించిన విధానమది. మరి డోనాల్డ్ ట్రంప్ ఫిలడెల్ఫియా టౌన్ హాల్‌లో తన విధానాలను వివరించిన తీరు పూర్తిగా భిన్నమైనది. వ్యాపారవేత్తగా డోనాల్డ్ ట్రంప్ దివాళా, ఇతర వ్యాపార సంబంధిత చట్టాలను ఉపయోగించుకున్న తీరుతెన్నులపై ఆక్షేపణలు, అభ్యంతరాలు తక్కువేమీ కాదు. అయినప్పటికీ సామాన్య అమెరికన్ పౌరుడు (సిఎన్ఎన్ చర్చలు లేదా 60 మినిట్స్ లేదా అటువంటి టీవీ కార్యక్రమాలను వీక్షించే సమయం లేని శ్రమజీవి) ఒకటే మాట చెప్పుతాడు: 'దేశ సమస్యలను ఎలా పరిష్కరించాలో ట్రంప్‌కు తెలుసు'.

ముస్లింలను తన పక్షానికి తిప్పుకోవడం ట్రంప్‌కు కష్టమేకావచ్చుకాని పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ చర్యలను ఆయన ఎట్టి పరిస్థితులలోను పూర్తిగా అనుమతిస్తారన్న విషయమై యూదు ఓటర్లకు ఎటువంటి సందేహం లేదు. ఈ విషయంలో ట్రంప్‌పై వారికి పూర్తి భరోసా ఉన్నది. అమెరికా విదేశాంగ విధానానికి సంబంధించిన ఈ కీలక అంశంపై కమలా హారిస్ నిక్కచ్చిగా, అస్పష్టంగా మాట్లాడడం లేదు. ఈ విషయంలో ట్రంప్‌దే పైచేయి. పాలస్తీనా సంక్షోభంపై డెమొక్రాట్లు ద్వంద్వ నీతితో వ్యవహరించడాన్ని ముస్లింలు నిరసిస్తున్నారు. కమలా హారిస్ గెలిచినప్పటికీ ముస్లింలు ఆమెకు మద్దతు నిచ్చారని భావించనవసరం లేదు. కాకపోతే ఆమెను, ట్రంప్ కంటే తక్కువ హానికరమైన నేతగా చూస్తున్నారని అర్థం చేసుకోవాలి.

మొత్తం మీద 2024 అమెరికా అధ్యక్ష పదవి ఎన్నికలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ మధ్య తీవ్ర పోటీ ఉందని, ఎవరు విజేత అవుతారన్నది అసందిగ్ధంగా చెప్పలేమని రాజకీయ పండితులు, ఓటర్ల అభిప్రాయాలు విశ్లేషించే నిపుణులు ఏకీభవిస్తున్నారు. సంభావ్య విజేత గురించి పాత్రికేయులు ముందుగా తయారు చేసుకున్న కథనాలు ఈ ఏకాభిప్రాయం ప్రాతిపదికనే ఉన్నాయి. అంతిమ ఫలితం వెలువడిన వెన్వెంటనే వాస్తవ విజేతకు అనుగుణమైనవి ప్రచురితమవుతాయి. నెలల తరబడి తాము తదేక దీక్షతో ఎన్నికల ప్రచార తీరుతెన్నులు, ప్రజల ప్రతిస్పందనల విషయమై తమ నిశిత పరిశీలనను అవి ప్రతిబింబిస్తున్నాయని పాత్రికేయులు చెప్పుతారు. అయితే ప్రజాభిప్రాయం మారిపోయి, గెలిచిన అభ్యర్థి స్వల్ప మెజారిటీతో కాకుండా భారీ మెజారిటీతో ఘన విజయం సాధించిన పక్షంలో ఓటర్ల అభిప్రాయాల విశ్లేషణ నిపుణులు, పాత్రికేయులు తమ వాదనలు, మార్చుకోవలసి ఉంటుంది. తాము పొరపడ్డామని ఒప్పుకోవడం అనివార్యమవుతుంది.

■ దీపాంకర్ గుప్తా
సామాజిక శాస్త్రవేత్త
జేఎన్‌యూ విశ్రాంత ఆచార్యులు

ప్రాణాంతక 'గడ్డిమందు' నిషేధం అవసరం

గడ్డిమందుగా రైతులు పిలుచుకొనే పెరాక్విట్ డైక్లోరైడ్‌ను వారు కలుపు నాశనానికి వాడడం పరిపాటి. ప్రస్తుత వ్యవసాయ కూలీల ఖర్చుల దరిమిలా ఈ మందును రైతులు ఆశ్రయించడంలో ఆశ్చర్యం లేదు. కానీ, గత పదేళ్లలో దేశవ్యాప్తంగా ఈ మందు దుర్వినియోగ మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. వర్షాధారిత భారతావనిలో అతివృష్టి, అనావృష్టి వల్ల పంటనష్టం వాటిల్లి, తీర్చలేని అప్పుల బారిన పడిన రైతన్నలు తమకు అందుబాటులో ఉన్న పురుగు మందులు, కలుపు నాశినులు సేవించి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇందులో ఈ గడ్డిమందు ప్రథమస్థానం ఆక్రమించింది. దీనికి కారణం– ఈ మందుకు ఎటువంటి విరుగుడు లేకపోవడం. అలాగే కొన్ని మిల్లీలీటర్లు తీసుకున్నా మరణం తథ్యమన్న నమ్మకం జనబాహుళ్యంలో నాటుకుపోవడం.

అసహజ మరణాలకు కారణాలు కనుక్కోవడానికి చేస్తున్న శవపరీక్షలలో 15–20 శాతం పురుగు మందులు, కీటక నాశినులు, కలుపు నాశినులు సేవించి మరణించిన వారివే ఉంటున్నాయి. ఈ గడ్డి మందును హత్యలకు, బంధువులను బెదిరించి పనులు సాధించేందుకు కూడా వాడటం చూస్తున్నాం. ప్రతినిత్యం సరైన రక్షణ తొడుగులు లేక, మూతికి గుడ్డ కట్టుకోకుండా పొలంలో గడ్డిమందును పిచికారీ చేసే రైతులు కూడా ప్రమాదవశాత్తూ దీని బారిన పడుతున్నారు. ఇటువంటి వారిలో పార్కిన్‌సన్ వ్యాధి, కాళ్లు–చేతులు మంటలు రావడం లేదా స్పర్శ తగ్గడం వంటివి సంభవిస్తున్నాయి.



తక్కువ సాంద్రతలలో మాత్రమే గడ్డిమందును అనుమతిస్తున్నామని, వాడకాన్ని చాలావరకు నియంత్రిస్తున్నామని కేంద్రప్రభుత్వం వల్లెవేస్తున్నా, వాస్తవంలో నిర్దేశిత పంటలు దాటి రైతులు దీనిని వాడుతున్నారు. అలాగే ఆత్మహత్యల కోసం దీనిని వాడడం చూస్తూనే ఉన్నాం. ప్రపంచ దేశాల పరిశోధకులు గడ్డిమందును అత్యంత ప్రమాదకర పురుగుల మందుగా నిర్ధారించారు. భారత్ కూడా దీనిని నిషేధించాల్సిన సమయం ఆసన్నమైంది.

స్విట్జర్‌లాండ్‌కి చెందిన ఒక సంస్థ 1960వ దశకం నుంచి గడ్డిమందును తయారుచేసి విపణిలో ఉంచింది. ఈ మందు వల్ల సంభవించే స్వల్పకాలిక, దీర్ఘకాలిక విషప్రభావాలు, పర్యావరణంపై దీని దుష్ప్రభావాలను అంచనా వేసి ఆ దేశంతో సహా 60 అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు దీనిని నిషేధించాయి. ఈ సంస్థకు గడ్డిమందు ప్రభావం గురించి ముందుగానే తెలుసని, అయినా ఆ పరిశోధన పత్రాలను దాచిపెట్టి, వ్యాపార కాంక్షతో ఈ మందును తయారుచేసి ప్రపంచ జనాభాను బలి చేసిందని 'ది గార్డియన్' పత్రిక 'పెరాక్విట్ ఫైల్స్' అన్న శీర్షికతో గత ఏడాది ప్రచురించింది. ప్రస్తుతం ఈ గడ్డిమందు వాడకంలో అమెరికా, భారత్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, అర్జెంటీనా, జపాన్ ఉన్నాయి. చైనా, ఇంకా చాలా దేశాలు వారి భూభాగంపై దీనిని వినియోగించడాన్ని అనుమతించకపోయినా, ఎగుమతులకు ఉత్పత్తి చేయడం వారి ద్వంద్వ వైఖరికి తార్కాణం. అమెరికాలో ఈ గడ్డిమందు వల్ల పార్కిన్‌సన్ వ్యాధి బారిన పడినవారు చాలా రాష్ట్రాల్లో సామూహిక దావాలు వేశారు.

ఈ గడ్డిమందు సేవించినప్పుడు నోటిలో, గొంతులో కాలిన గాయాల వలె పుండ్లు పడి మింగడానికి ఇబ్బంది కావడం, వాంతులు–విరేచనాలు అవడం, కామెర్ల బారిన పడడం, శరీరం పసుపుపచ్చగా మారడం, మూత్రం పసుపురంగులో రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. క్రమేపీ కాలేయం, మూత్రపిండాలు చెడిపోవడం, చివరకు ఊపిరితిత్తులు పనిచేయక మనిషి మరణిస్తాడు. దీనికి ప్రత్యేక విరుగుడు మందు లేదు. మరో విషయం ఏమిటంటే తొలుత విష ప్రభావం విరామం ఇచ్చినట్లు కనిపించినా, తర్వాత వారి ఆరోగ్యం క్రమేపీ క్షీణిస్తుంది. ఇది వైద్యులకు ఓ పెను సవాలు. ప్రమాదం నుంచి బయటపడ్డాడు అని వైద్యులు చెప్పిన తరువాత కూడా ఆకస్మిక మరణం పాలయిన అనేక సందర్భాలున్నాయి. ఇది వైద్యులపై దాడులకు కూడా కారణమయింది. ప్రతి ఏడాది వేల సంఖ్యలో సంభవిస్తున్న గడ్డిమందు ఆత్మహత్యలు వైద్యులను కూడా భయాందోళనలకు గురిచేశాయి. దీంతో ఈ మందును సంపూర్ణంగా నిషేధించాలని ఒరిస్సాలోని వైద్యులంతా పెద్దయెత్తున ఉద్యమించారు.

మన దేశంలో కీటకనాశినుల తయారీ, అమ్మకాలని 'కీటకనాశిని చట్టం–1968' నియంత్రిస్తుంది. అయితే విష ప్రభావంపై ఎటువంటి అంచనా లేకుండా, పర్యావరణం, జంతుజాలం, మనుషులపై ఇది చూపించే ప్రభావాలను విశ్లేషించకుండా ఈ గడ్డిమందును సురక్షితంగా పరిగణిస్తూ భారత్‌లో వినియోగించడానికి అనుమతించారు. తరువాత కేరళలో దీని విషప్రభావంపై అధ్యయనం జరిపి, అక్కడి ఉన్నత న్యాయస్థానం ఆదేశానుసారం కొంతకాలం ఈ మందును నిషేధించారు. అయితే కీటకనాశినుల నియంత్రణలో కేంద్రానిదే పైచేయి కావడం, 90 రోజులకు మించి ఒకసారి వీటిని నిషేధించే అధికారం రాష్ట్రాలకు లేకపోవడం గడ్డిమందును నిషేధించాలన్న సంకల్పంతో ఉన్న రాష్ట్రాలకు సమస్యాత్మకంగా మారింది. అంతేకాక కొత్త పురుగుమందుల యాజమాన్యం చట్టం–2020 చాలాకాలంగా పార్లమెంటులో మగ్గుతుండడానికి గల కారణం ఈ మొత్తం వ్యవస్థపై పురుగు మందు సంస్థల గుత్తాధిపత్యం.

చాలా కొన్ని సాంద్రతలలో మాత్రమే గడ్డిమందును అనుమతిస్తున్నామని, వాడకాన్ని చాలావరకు నియంత్రిస్తున్నామని కేంద్రప్రభుత్వం వల్లెవేస్తున్నా, వాస్తవంలో నిర్దేశిత పంటలు దాటి రైతులు దీనిని వాడుతున్నారు. అలాగే సేద్యానికి మించి ప్రాణహానికి వాడడం చూస్తూనే ఉన్నాం. ప్రపంచ దేశాల పరిశోధకులు గడ్డిమందును అత్యంత ప్రమాదకర పురుగుల మందుగా నిర్ధారించారు. వారి పరిశోధనను గౌరవిస్తూ భారత్ కూడా ఈ మహమ్మారిని నిషేధించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి లక్షల కోట్లు గడించిన గడ్డిమందు తయారీ సంస్థ దీని విరుగుడు కోసం ఒక్క రూపాయి అయినా ఖర్చుపెట్టిందా అన్న విషయం దేవుడికే ఎరుక. ఉన్నపళంగా ఈ మందును నిషేధించలేమని ప్రభుత్వాలు భావిస్తే, క్రమేపీ నిషేధించడానికి ఒక ప్రణాళిక సిద్ధం చేయాలి. ఏటికేడాది పెరిగిపోతున్న జనాభాకు తిండిపెట్టడానికి గడ్డిమందు లేకుండా వ్యవసాయం చేయలేమని చెప్పేవారూ లేకపోలేదు. అయితే ఈ మందుకు మునుపు కూడా వ్యవసాయం చేసి, విజయవంతంగా రెట్టింపు సంపద సృష్టించిన రైతుల గాథలు భారతదేశంలో చాలానే ఉన్నాయి. రెప్పపాటులో అద్భుతాలు సృష్టించాలనే పేరాశకు పోకుండా, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, కృషి సంవర్థక విధానాలతో గడ్డిమందు లేకుండా వ్యవసాయం చేయవచ్చు.

నారు నాటే మూడు నెలల ముందు నుంచి రెండు లేదా మూడుసార్లు పొలం దున్నడం వల్ల ఇసుక నేలలో కలుపు సమస్య తక్కువగా ఉంటుంది. రేగడి నేలల్లో గడ్డిమందు వాడకం ఎలాగూ తక్కువే. ఈ నేలను దున్నినప్పుడు పెరుగులాగా ఉండే మట్టి, అధిక నీటి సాంద్రత కలిగి కలుపును, వాటి విత్తులను చీకిపోయేలా చేస్తుంది. చీనీ, నిమ్మతోటల్లో ప్లాస్టిక్ షీట్స్ వినియోగిస్తూ, డ్రిప్ ఇరిగేషన్ వినియోగించడం వల్ల కలుపును చాలా వరకూ నివారించవచ్చు. గడ్డిమందు ప్రత్యామ్నాయ కలుపునాశినులు కూడా చాలానే ఉన్నాయి. వాటి భద్రతపై సరైన వివేచన జరిపి అనుమతులు జారీ చేయాల్సిన అవసరం ఉంది. గడ్డిమందు స్థానంలో వాటి వాడకాన్ని నిర్దేశించవచ్చు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఈ దిశగా పరిశోధనలు జరిపి, వాటి వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనకరం. మనం తినే ఆహారంలో కూడా గడ్డిమందు అవశేషాలు ఉన్నట్లు పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ఆత్మహత్యలకే కాక హత్యలకు కూడా వాడుతున్న ఈ గడ్డిమందు వ్యవసాయదారులను దాటి, ప్రజారోగ్య, ప్రజా రక్షక సమస్యగా పరిణమించింది. అందువల్ల ఈ గడ్డిమందును నిషేధించడం అత్యవసరం.

• కట్టంరెడ్డి అనంత రూపేష్‌రెడ్డి
సహాయ ఆచార్యులు, ఆంధ్రా వైద్య కళాశాల

మెస్ చార్జీల పెంపు ఓ సామాజిక విప్లవం

సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచడం ఒక సాధారణ అంశం కాదు. విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచాలన్న డిమాండ్ పెద్దగా లేకున్నా రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అంత పటిష్ఠంగా లేకున్నా కూడా అధికారుల సిఫారసులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎలాంటి చర్చ లేకుండా దాదాపు 40 శాతానికి పైగా పెంపుదల చేశారు. సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో చదువుకుంటున్న విద్యార్థుల భవిష్యత్ గురించి ముఖ్యమంత్రి లోతుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం ఇది. దీన్ని ఒక సాధారణ అంశంగా పరిగణించలేము. ఆయా వర్గాల విద్యార్థుల భవిష్యత్ కోసం తీసుకున్న ఒక ముందు చూపు నిర్ణయం. సామాజిక విప్లవం దిశగా ఒక ముందడుగు.



7 లక్షల మంది పేద దళిత, గిరిజన, ఆదివాసీ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఈ నిర్ణయం ఒక అద్భుతమైన వరం. సమాజంలో అనేక రకాల వస్తువుల ధరలు అడ్డగోలుగా పెరిగాయి కానీ విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించే ఇలాంటి అంశంలో మాత్రం గత సర్కారు దయచూపలేదు. విద్యా రంగానికి చేసే వ్యయం ఒక ఖర్చులాగా కాకుండా భావి తరాల నిర్మాణానికి పెట్టే పెట్టుబడిగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచించడం గొప్ప పరిణామం. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మరోవైపు ఉప ముఖ్యమంత్రి ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అమలు చేస్తున్న తీరు రాష్ట్ర బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుంది. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా పరుగులు తీయిస్తున్నారు. తెలంగాణ జోడెడ్ల మాదిరిగా అభివృద్ధిని సంక్షేమాన్ని సమానంగా పరుగులు పెట్టిస్తున్నారు. ఏడేళ్లుగా డైట్ చార్జీలు 16 ఏళ్లుగా కాస్మొటిక్ చార్జీలు పెంచలేదు అంటే గత ప్రభుత్వానికి పేద విద్యార్థుల పట్ల ఎంత చిన్న చూపు ఉందో అర్థం చేసుకోవచ్చు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యారంగం పట్ల ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల మరమ్మతులు చేసి వాటికి కనీస సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేశారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఎంతో కాలంగా పెండింగ్ ఉన్న పదోన్నతులను వెంటనే చేపట్టారు. అలాగే బదిలీలు చేపట్టి వేలాది ఉపాధ్యాయులకు వారు కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేసి అనుకూల నిర్ణయాలు తీసుకున్నారు. 11063 ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేసి విద్య పట్ల తనకున్న సానుకూలతను చేతల్లో చూపారు. అలాగే నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటుకై ఒక పకడ్బందీ ప్రణాళిక తయారు చేసి ఇటీవల 26 నియోజకవర్గాలలో శంకుస్థాపన కార్యక్రమాలను కూడా చేపట్టారు.

ఐటీఐలను ఒక్కతాటిపైకి తెచ్చి ఉద్యోగ ఉపాధి రంగాలలో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే స్కిల్ యూనివర్శిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసి విద్యార్థులకు మంచి భవిష్యత్ కోసం ఒక మంచి ప్రణాళికతో ముందుకు పోతున్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి అనేక చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా విద్య పట్ల ఆయన లోతైన చర్యలు చేపట్టారు. చిన్నతనం నుంచి చదువు పట్ల ఆసక్తి ఉంటే విద్యార్థులు వ్యసనాల జోలికి పోరు అని అలాగే విద్య తర్వాత క్రీడలు చాలా ముఖ్యమని రేవంత్‌రెడ్డి భావించారు. అందుకోసమే క్రీడలకు పెద్దఎత్తున సౌకర్యాలు కల్పిస్తున్నారు. యువత మంచి దారిలో నడవడం, ఆరోగ్యంతో ఉండడానికి క్రీడలను అద్భుతమైన అవకాశంగా సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు.

దళిత, గిరిజన, బడుగు, బలహీన, మైనారిటీ వర్గాల విద్యార్థుల అభ్యున్నతికి గొప్ప అవకాశంగా చూడాలి. బలహీన వర్గాలు చదువులో బలవంతులు కావడానికి గొప్ప జీవితానికి ఒక మంచి పునాది కావడానికి ఇదో మంచి అడుగుగా భావించాలి. ఈ అంశంపై రాజకీయాలకు అతీతంగా అందరూ సంపూర్ణంగా సహకారం అందించాలి.



○ మల్లు రవి
ఎంపీ, నాగర్ కర్నూల్
టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు

గుర్తింపు కొరవడిన 'టైగర్ ఆఫ్ తెలంగాణ'

స్వతంత్ర భారతదేశంలో హైదరాబాద్ స్టేట్ విలీనం ప్రక్రియ పూర్తికావచ్చింది. 1947 సెప్టెంబర్ 13న మొదలైన ఆపరేషన్ పోలో 5 రోజుల్లోనే విజయవంతమైంది. సెప్టెంబర్ 17న విలీనమైంది. 18న నిజాం లొంగిపోయాడు. అప్పటికి ముషీరాబాద్ జైల్లో ఉన్న 50 మంది ఉరిశిక్షితుల్లో 12 మందిని ప్రపంచానికి తెలియనీయకుండా ఉరి కంబాలకు ఎక్కించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఒక అమెరికన్ జర్నలిస్టు ద్వారా టైమ్స్ పత్రికలో 'బాలుడికి ఉరిశిక్ష' అనే సారాంశంతో వచ్చిన కథనం ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. సుప్రీంకోర్టులో అప్పీలుకు అవకాశం దొరికింది. అంతర్జాతీయ ప్రాముఖ్యతను సంతరించుకున్న ఈ కేసుని వాదించడానికి లండన్‌లో సుప్రసిద్ధ న్యాయవాది డి.ఎన్.ప్రిట్ ఢిల్లీకి వచ్చాడు. ఈ నాలుగు రోజుల వాదనలకు అప్పటి సోవియట్, అమెరికా, బ్రిటన్ తదితర దేశాలకు చెందిన రాయబారులు హాజరయ్యారు. ఆ 12 మందిలో ఒకడిగా, రేపు ఉరి తీయబడతాడనగా, అంతర్జాతీయ కమ్యూనిస్ట్ సంస్థల, భారత ట్రేడ్ యూనియన్ల ఆందోళనల ఫలితంగా ఉరితీతకు కేవలం 8 గంటల ముందు అప్పటి భారత ప్రభుత్వం నర్సింహులు ఉరి శిక్షను రద్దు చేసింది.

మరో కేసులో అరెస్టై నల్లగొండ జైలులో ఉన్న నల్లా నర్సింహులును చూడ్డానికి ఆపరేషన్ పోలో ఇన్‌చార్జీ, యూనియన్ సైనిక జనరల్ జె.ఎన్. (జయంతో నాథ్) చౌదరి వెళ్ళాడు. అప్పుడు ఆ జిల్లా ఎస్.పి. ధనరాజ్ నాయుడు సంకెళ్ళతో ఉన్న నల్లా నరసింహులును 'టైగర్ ఆఫ్ తెలంగాణ' అంటూ పరిచయం చేశాడు. ఎందుకంటే ప్రజల్లో ఆయనకు ఉన్న పేరు, నాటి నిజాం రాజ్యానికి, రజాకార్లకు, దొరలు, జాగీర్దార్లకు ఆయనంటే హడల్ అని చెప్పాడు.

ఇదే సమయంలో తన కాళ్ళ సంకెళ్ళు తొలగించాలన్న నల్లా నర్సింహులు మాటను తిరస్కరించడంతో, తన లొంగుబాటు కోసం అరెస్టు చేసిన తన భార్య వజ్రమ్మను విడుదల చేయాలని కోరగా, తర్వాత కొంత కాలానికి విడుదల చేశారు.

మొదటి ఘటన బక్కపలచగా, చిన్నగా ఉండే నర్సింహులు ఓ బాలుడిని తలపిస్తే, రెండో సంఘటన ఆ బక్కపలచని వాడి బలాన్ని నిరూపించింది. మూడో ఘటన ఆయనే కాదు ఆయన కుటుంబం పడిన కష్టాలకు తార్కాణంగా నిలిచింది. అక్టోబర్ 2వ తేదీన స్వాతంత్ర్యోద్యమానికి సారథ్యం వహించిన మహాత్మాగాంధీ, దేశానికి రెండో ప్రధానిగా సేవలందించిన జై జవాన్, జై కిసాన్ అన్న లాల్‌బహదూర్ శాస్త్రి జన్మించారు. సరిగ్గా ఇదే తేదీన నల్లా నరసింహులు పుట్టాడు. తెలంగాణ సాయుధ పోరాట నరసింహంగా వెలుగొందాడు. విచిత్రంగా వీళ్ళంతా... నీతి, నిజాయితీకి నిలువుటద్దాలు. వ్యక్తిత్వంలో సమున్నతులు. ఉద్యమాల్లో ఉద్దండులు. పోరాటాల్లో వెన్నుచూపని వీరులు. యాదృచ్ఛికంగా ఈ ముగ్గురు మహోన్నతులు ఒకే తేదీన పుట్టడం కాకతాళీయం కావచ్చు కానీ, దేశం గర్వించదగ్గ భారతమాత ముద్దు బిడ్డలు. ఈ ముగ్గురివి స్వాతంత్ర్య పోరాటాలే కానీ, దారులు వేరు. గాంధీజీ, శాస్త్రీజీ నాటి దేశ దాస్యశృంఖలాలు తెంచడానికి ఉద్యమాలు చేశారు. నర్సింహులు నాటి తెలంగాణ నిజాం నిరంకుశ, దేశ్‌ముఖ్‌ల నుంచి ప్రజలను రక్షించడానికి ఉద్యమించాడు. ఆనాడు వారి దారి శాంతియుత మార్గమైతే, నర్సింహులు అనివార్యంగా సాయుధ పంథాని అనుసరించాడు.

ఇదే పోరాటం మరెవ్వరు చేసినా, నర్సింహులు మరే సామాజిక వర్గానికి చెందినవాడైనా, మరో దేశంలో చేసినా, అసాధారణ పేరు ప్రఖ్యాతులు వచ్చేవి. కానీ తన ప్రాణాలను లెక్కచేయని, నిస్వార్థ గెరిల్లా పోరాట యోధుడు నల్లా నర్సింహులుకు రావాల్సినంత గుర్తింపు రాలేదు.



నల్లా నర్సింహులు 1926 అక్టోబర్ 2న ఇప్పటి జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కడవెండిలో జన్మించాడు. మామూలు పేద పద్మశాలి కుటుంబం. చేనేత పని చేసి, ఉర్దూ మీడియంలో ఏడవ తరగతి వరకు చదువుకున్నాడు. నాడు తన తండ్రికి జరిగిన అవమానంపై తిరగబడ్డ నర్సింహులు అనుకోకుండానే ఉద్యమబాట పట్టాడు. రావి నారాయణరెడ్డి అధ్యక్షతన భువనగిరిలో జరిగిన 11వ ఆంధ్రమహాసభలో సభ్యత్వం తీసుకున్నాడు. తెలుగు విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య పేర్వారం జగన్నాథం 22-01-1989లో చేసిన ఇంటర్వ్యూలో నర్సింహులు చెప్పినట్లు... "ప్రజలను దోపిడీ, వెట్టి నుంచి విముక్తం కావించే శాంతియుత ఉద్యమాలపై దొరల గూండాల దాడులు, వారికి రక్షణగా అప్పటి పోలీసుల కేసులు, నిర్బంధాల నుంచి రహస్య జీవితాలు, సాయుధ పోరాటాలకు దారితీశాయి. నిజానికి సాయుధ పోరాటం పిలుపును కమ్యూనిస్టు పార్టీలు గానీ, పోరాట యోధులు కానీ ఇవ్వలేదు. ఆపరేషన్ పోలో సమయంలోనే సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు." ఆ తర్వాత నర్సింహులు ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో, కొంత ఊగిసలాట తర్వాత సీపీఐలో జీవితాంతం కొనసాగారు.


'ఒకనాడు భూస్వామి రామచంద్రారెడ్డి తన విసునూరు గ్రామంలో దారిలో పోతుండగా, గమనించక, పొరపాటున ఒక రైతు తన ఇంటిముందు అరుగుమీద కూర్చున్నాడు. దీంతో ఆ గ్రామంలోని ప్రజల ఇంటిముందరి అరుగులన్ని మూలమట్టంగా కూలగొట్టించాడు'.

నాటి 'దొరసాని (విసునూరు రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ) దగ్గర పనిచేసే 20 మంది జీతగాళ్లతో సహా ఆ గ్రామంలో జీతగాళ్లందరిని సంఘటితపర్చి ఒక రోజు సమ్మె జరిపించాడు. 3 రోజుల తర్వాత రైతులు సంప్రదింపులకు దిగారు. రైతులు ఇచ్చే రేటు తాను కూడా ఇస్తానని దొరసాని తన ఏజెంటును సంప్రదింపులకు పంపించింది. 3 కుంచాల జొన్నలకు బదులు నాలుగు కుంచాలకు నెలజీతం పెంచబడింది. తూమెడుకు బదులు ఇద్దుం ధాన్యం సంవత్సరానికి భిక్షం పేర అదనంగా ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. సంవత్సరానికి 15 రోజులు సెలవు కూడా అంగీకరించారు. ఇది నర్సింహులు మొదటి విజయం. ఆ తర్వాత అనేక మలుపులు తిరిగిన ఉద్యమంతోపాటు నర్సింహులు పోరాట ప్రయాణం సాగింది. ఉద్యమ ప్రస్థానంలో 122 దళాలను, ఆత్మార్పణ గెరిల్లా సమూహాలను నిర్మించి, నాయకత్వం వహించి, అనేకసార్లు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టి, అప్పుడప్పుడు పట్టుబడి, నరకయాతన అనుభవించి, జైలులో పెట్టబడి, కొన్నిసార్లు జైలు నుంచి తప్పించుకుని, ఒకసారి కోర్టు నుంచి తప్పించుకుని, అనేక కేసుల్లో ఇరికించబడి, తన కేసులు తానే వాదించుకుని, కోర్టు హాలులో న్యాయమూర్తులకే కమ్యూనిస్టు పోరాట పంథాపై సుదీర్ఘ డాక్యుమెంట్లు సమర్పించి, మూడుసార్లు ఉరిశిక్షలు విధించబడి, రద్దు చేయబడి అజేయంగా నిలిచిన నల్లా నరసింహులు పోరాట పటిమ, వాక్పటిమ అనన్యసామాన్యం. అనితర సాధ్యం.

'పోరాటం ముగిసిన తర్వాత' ఆయన మీద పడిన మరణ శిక్షలు, యావజ్జీవ శిక్షలు రద్దయినాక, సుదీర్ఘ జైలు జీవితం అనంతరం 1959లో జైలు నుంచి విడుదలైనారు. 1987లో తెలంగాణ సాయుధ పోరాటం 40వ వార్షికోత్సవం సందర్భంగా సాయుధ పోరాట యోధులు తమ అనుభవాలు నివేదించాలన్న కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు నివేదిక బదులు నల్లా నర్సింహులు, 'తెలంగాణ సాయుధ పోరాటం: నా అనుభవాలు' అనే పుస్తకమే రాశారు. 1989లో ప్రచురితమైంది.

◆ మార్గం లక్ష్మీనారాయణ

(నేడు నల్లా నర్సింహులు వర్ధంతి. పాలకుర్తిలో విగ్రహావిష్కరణ)





పంచ పుష్పాల అలంకరణలో హనుమకొండలోని సిద్దేశ్వరుడు

సమాచారం

8న జాబ్ మేళా



వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 4, (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉపాధి కల్పన శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌వన్‌హెచ్‌ఆర్ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 230 ఉద్యోగాల భర్తీ కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. టెన్త్, డిగ్రీ, డిప్లమా, ఐటీఐ, హోటల్ మేనేజ్‌మెంట్, తదితర కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు మలుగురోడ్‌లోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జీరాక్స్ కాపీలతో జాబ్ మేళాలో పాల్గొనాలని ఆమె పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7093168454 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ..

- తొలిసోమవారం భక్తుల రద్దీ
- రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజల నిర్వహణ
- వేయి స్తంభాల ఆలయంలో దీపోత్సవం
- పంచ పుష్పాల అలంకరణలో సిద్దేశ్వరుడు



కాశీవిశ్వేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

కార్తీకమాసం.. శివకేశవుల ప్రీతికరమైన మాసం. ఈ నెలంతా శివాలయాలు ఆధ్యాత్మిక శోభతో అలరారుతుంటాయి. ఈ క్రమంలో తొలి కార్తీక సోమవారం ఉమ్మడి జిల్లాలోని శివాలయాల్లో తెల్లవారుజామునుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి శివుడిని దర్శించుకున్నారు. ప్రసిద్ధ వేయి స్తంభాల ఆలయం, సిద్దేశ్వరాలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. 8

'ఇందిరమ్మ' దరఖాస్తుదారుల్లో..
ఆనందం



- పథకం అమలుకు షెడ్యూల్ ఖరారుతో చిగురించిన ఆశలు
- 15వ తేదీ నుంచి గ్రామ సభలు.. 20వ తేదీలోపు లబ్ధిదారుల గుర్తింపు
- వివరాల నమోదుకు ప్రత్యేక యాప్
- ప్రక్రియలో ఎమ్మెల్యేలు, ఇందిరమ్మ కమిటీలకు ప్రాధాన్యం
- ఉమ్మడి జిల్లాలో 2.88లక్షల దరఖాస్తుదారులు

హనుమకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని బుధవారం నుంచి ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. త్వరలో తమ సొంతింటి కల నెరవేరబోతోందంటూ వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సొంత స్థలం ఉండి ఇప్పటి వరకు ఇల్లు నిర్మించుకోలేకపోయిన వారికి ఈ ఇందిరమ్మ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక ఈ మేరకు దరఖాస్తులు కూడా స్వీకరించింది. అర్హులైన వారిని ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించింది. కానీ తొమ్మిది నెలలుగా దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో దరఖాస్తుదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూశారు. తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన ప్రకటన, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక షెడ్యూల్ ప్రకటనతో అందరిలోనూ ఆనందం వ్యక్తమవుతోంది. గ్రామాల్లో ఈనెల 15 నుంచి 20వ తేదీ మధ్య గ్రామ సభలు నిర్వహించి అర్హులైన వారిని గుర్తించి జాబితాలు ఖరారు చేయనున్నారు. మొత్తం 15 రోజుల్లోనే గ్రామ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక పూర్తిచేసి జాబితా విడుదల చేయనున్నారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొందిన వారికి ఈ సారి కేటాయింపులు ఉండవని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మొదటి విడతలో సొంత స్థలం ఉన్నవారికి, రెండో విడతలో స్థలం లేనివారికి స్థలం ఇచ్చి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేయనున్నారు.

42 వేల మందికి అవకాశం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇళ్లు లేనివారి సంఖ్య లక్షల్లోనే ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టింది. ఆ ప్రభుత్వం ఆధ్వర్యంలో

మిగతా 6లో...

ఇందిరమ్మ ఇళ్లకు యాప్

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ఇప్పటికే ఒక యాప్ డిజైన్ చేశారు. గ్రామ సభల్లో పేదలను ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను ఈయాప్‌లో పొందుపరుస్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్ తరహాలోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించినట్టు సమాచారం.

మార్గదర్శకాలివీ..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. దీని ప్రకారం మహిళల పేరుతో వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉండి ఇందులో దరఖాస్తుదారు పేరు ఉండాలి. దరఖాస్తుదారు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అనర్హురాలిగా ప్రకటిస్తారు. దరఖాస్తుదారుల్లో దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ మైనారిటీలకు 50 శాతం, జనరల్ కోటా కింద 15 శాతం కేటాయిస్తారు. గతంలో ఇళ్లు మంజూరైన, దళిత బంధు పథకం పొందిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. సొంత స్థలం కనీసం ఒక గుంట భూమి పట్టా ఉండాలి. మంజూరు పత్రాలు అందిన తర్వాత నిర్మాణం ప్రారంభించవచ్చు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తుంది. నాలుగు దశల్లో డబ్బును విడుదల చేస్తారు. పునాది స్థాయిలో రూ.లక్ష, రెండో దశలో రూ.1.25 లక్షలు, మూడో దశలో స్లాబ్‌కు రూ.1.75లక్షలు, ఫినిషింగ్ దశలో ఇంకో రూ.లక్ష ఇస్తారు.

ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ప్రకారం..	జిల్లా	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	ములుగు	జయశంకర్ భూపాలపల్లి
	మొత్తం దరఖాస్తులు	74,000	75,000	40,000	52,000	22,000	25,000
	స్థలం ఉన్నవారు	14,800	15,000	8,000	10,400	4,400	5,000

క్రీడా కోటాను సద్వినియోగం చేసుకోవాలి

- హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి
- ప్రారంభమైన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన క్రీడా కోటాను సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డిపురంలోని టీవీఎస్ క్రికెట్ క్రీడా మైదానంలో అంతర్ జిల్లా స్థాయి అండర్-23 బాలుర విభాగంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను దేవేందర్‌రెడ్డి ముఖ్య అతి థిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాను స్వ తహాగా క్రీడాకారుడిగా క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చడం ద్వారా క్రీడా కోటా లో ఉద్యోగం సాధించడంతో ఈ స్థాయికి చేరుకోవడం జరిగిందన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హితవు పలికారు. ప్రతీ ఒక్కరు చదువుతో పాటు తమకు నచ్చిన క్రీడాను ఎంచుకొని అందులో పట్టుదల, క్రమశిక్షణతో సాధ న చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చునని తెలిపారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంతర్ జిల్లాల అండర్-23బాలుర క్రికెట్ టోర్నీలో వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ జట్ల మధ్య మూడు రోజుల పాటు లీగ్ కం నాకౌట్ పద్ధతిన పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కాగా, తొలి రోజు వరంగల్ వర్సెస్ ఖమ్మం జట్ల మధ్య నిర్వహించిన పోటీల్లో ఖమ్మం జిల్లా జట్టు విజయకేతనం ఎగర వేసిం దని ఆయన తెలిపారు. ఖమ్మం జట్టు బ్యాట్స్‌మెన్ డివిన్ ఒక్కడే 69పరుగులు చేసి తమ జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, రంజీ ప్లేయర్ తోట సుకాంత్, అసోసి యేషన్ బాధ్యుల సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు దుర్మార్గమైన చర్య

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

బాలసముద్రం, నవంబరు 4: (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని పోరుబాటకు పిలుపు నిచ్చిన మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వంలో నాటి సీఎం కేసీఆర్ పిలుపు మేరకు గ్రామాల్లో పల్లెప్రగతి, పకృతివనం, రైతు వేదికలతో పాటు వివిధ అభివృద్ధి పనులు చేసి బిల్లులు చెల్లించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని దయాకర్‌రావు విమర్శించారు. పల్లెలను అభివృద్ధి చేసేందుకు మాజీ సర్పంచ్‌లు ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి పదకొండు నెలలు గడిచినా మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా వారిని భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు చేసిన వాటి బిల్లులు ఇవ్వకుండా ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఊరికి సేవ చేసిన సర్పంచ్‌లను అరెస్టులు చేయడం దుర్మార్గమన్నారు. అక్రమంగా నిర్బంధించి, అరెస్టులు చేసిన మాజీ సర్పంచ్‌లను వెంటనే విడుదల చేయడంతో పాటు పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం
- వినతులు స్వీకరించిన అదనపు కమిషనర్ జోనా



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ జోనా

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌కు ప్రజలు హాజరై సమస్యలు ఏకరువు పెట్టారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సెలవులో ఉండి ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో విషయం తెలుసుకున్న ప్రజలు బల్దియా కార్యాలయంలో నుంచి వెనక్కి వెళ్లిపోయారు. దీంతో బల్దియా ప్రజావాణి కార్యక్రమం తూతూమంత్రంగా సాగింది. అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి వెంటనే అక్కడి ఆయా విభాగాల అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 46 ఫిర్యాదులు స్వీకరించినట్టు జోనా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, ఇన్‌చార్జి సీపీ రవీంద్ర రాడేకర్, హెచ్‌వో రమేష్, టీవో బిర్రు శ్రీనివాస్‌లతో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. ఇంజనీరింగ్ - 10, హెల్త్, శానిటేషన్ - 6, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 05, టౌన్‌ప్లానింగ్-24, తాగునీటి సరఫరా-01 మొత్తం 46 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

- వరంగల్ ఖమ్మం రోడ్డులోని సాయిబాబ టెంపుల్ పక్కనే రెండు ఇండ్లకు సంబంధించిన వారు డ్రైనేజీ నుంచి మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహించడం ద్వారా దుర్వాసన వెదజల్లుతుందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ జేపీఎన్ రోడ్డు (పాత లక్ష్మీటాకీస్) ప్రాంతంలో చాలా రోజులుగా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అదే ప్రాంతానికి చెందిన భవాణి ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ చింతగట్టులో సీసీ రోడ్డు నిర్మాణం చేయడానికి ప్రభుత్వం రూ. 97 లక్షలు ప్రకటించి నిధులు కేటాయించినా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 2వ డివిజన్ గుండ్లసింగారంలో మురుగుకాల్వలో గుర్రపుడెక్కతో కూడిన పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం వల్ల విషజ్వరాలు వస్తున్నాయని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి ఫిర్యాదు చేశారు. ఈ సమస్యపై స్థానిక కార్పొరేటర్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు.



వేదిక నుంచి సంఘీభావం తెలుపుతున్న నేతలు

మాదిగల ఉద్యమ స్ఫూర్తే సుప్రీం కోర్టు తీర్పు

- ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్
- తీర్పును అమలు చేస్తాం : ఎంపీ కావ్య

6

వరంగల్ డీఈవోకు షోకాజ్ నోటీసు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేస్తూ సోమవారం విద్యా శాఖ డైరెక్టర్ ఈవీ. నర్సింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 30న హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో కలిసి సంబంధం లేని వ్యక్తిని సత్కరించడంపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా డీఈవోను ఆ ఉత్తర్వుల్లో డైరెక్టర్ ఆదేశించారు.

తండ్రి బాగోగులు చూడని కొడుకు భూమి పట్టా రద్దు

- తిరిగి తండ్రికే పట్టా చేసిన అధికారులు
- పాస్ పుస్తకం అందించిన తహసీల్దార్
- వరంగల్ ఉమ్మడి జిల్లాలో సీనియర్ సిటిజన్ యాక్టు అమలు చేసిన మొదటి కేసు

6

కేయూలో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు షురూ

కేయూక్యాంపస్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీలో ప్రీ పీహెచ్‌డీ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమైయ్యాయి. సోమవారం కేయూ క్యాంపస్‌లో జరిగిన పరీక్షల తీరును కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్‌ఎల్ సౌజన్యలు పర్యవేక్షించారు. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్స్, న్యాయశాస్త్రం, ఇంజనీరింగ్, కామర్స్‌అండ్‌బిజినెస్ మేనేజ్‌మెంట్‌విభాగాల్లో పరీక్షల నిర్వహి స్తున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య అన్నారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో గర్భస్థ పూర్వ, పిండ లింగ నిర్ధారణ చట్టంపై జిల్లాస్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బాలికలపై వివక్ష, ఎంటీపీ చట్టం, ఇతర ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. గర్భిణులు పరీక్షల నిమిత్తం, లింగా నిర్ధారణ కోసం, అబార్షన్ కోసం అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టం నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని, ఎవరైనా పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని తెలుసుకోవడానికి వస్తే వారి వివరాలను తెలియజేయాలని సూచించారు. అడ్వైజరీ కమిటీ సభ్యులు జిల్లాలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్రస్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలన్నారు. చట్టం ఉల్లంఘిస్తున్న వారి వివరాలను 104, 1098, డయల్ 100కు సమాచారం అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య పేర్కొన్నారు. ఈ సమావేశంలో జీఎంహెచ్ ప్రొఫెసర్ గైనకాలజిస్టు డాక్టర్ జే.రాజేశ్వరి, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ కవిత, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్



మాట్లాడుతున్న ఆకుల రాజేందర్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జిల్లా టీఎన్‌జీవోస్ యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ పంచాయతీ కార్యదర్శులకు భరోసా కల్పించారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని టీఎన్‌జీఓస్ భవన్‌లో సోమవారం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు టీఎన్‌జీవోస్ యూనియన్ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఆకుల రాజేందర్ పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం ఇటీవల నూతనంగా రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల ఫోరంలో జిల్లా నుంచి అసోసియేట్ అధ్యక్షులుగా మహ్మద్ రఫీ, జాయింట్ సెక్రెటరీగా బి. వెంకన్న, కార్యవర్గ సభ్యులుగా అర్షం శ్రీను ఎన్నికైన సందర్భంగా వారిని ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా టీఎన్‌జీఓస్ యూనియన్ అధ్యక్షులు పోలు రాజు, ఐనవోలు ఎంపీఓ గోపు రఘుపతి రెడ్డి, జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షులు పుల్లూరు వేణు గోపాల్, రాష్ట్ర నేత శ్యాంసుందర్, మోయిజ్, లక్ష్మీ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శుల జిల్లా నేతలు అశోక్, నరేష్, రవీందర్, కిశోర్, వేణు మాధవ్, భీమ్‌రాజ్, శివ కృష్ణ, రవి, యాదగిరి, తిరుపతి, జిల్లా టీఎన్‌జీఓస్ నేతలు రాజేష్ ఖన్నా, రాంప్రసాద్, శ్రీనివాస్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఉద్యమ స్ఫూర్తే సుప్రీం కోర్టు తీర్పు

ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్
తీర్పును అమలు చేస్తాం : ఎంపీ కావ్య
ఆత్మీయ సమ్మేళనానికి హాజరు

హసన్‌పర్తి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మాదిగల ఉద్యమ స్ఫూర్తి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కార్యదక్షతతోనే ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు అని ఏఐసీసీ కార్యదర్శి, జోగులాంబ జిల్లా అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ అన్నారు. మండలంలోని చింతగట్టు క్యాంపు కేఎల్‌ఎన్ ఫంక్షన్ హాలులో సోమవారం మాదిగ జేఏసీ కన్వీనర్ నమిండ్ల శ్రీనివాస్ అధ్యక్షతన మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై ఏ మాత్రం అనుమాన పడాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై పూర్తి స్పష్టతతో ఉన్నారని అన్నారు. కొంత మంది మాలలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వారి ఉనికి కోసం అసత్య ప్రచారం చేస్తున్నారని వారి మాటలు నమ్మవద్దని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి భవిష్యత్తులో ఎస్సీ వర్గీకరణపై ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నుంచి కమిషన్ వేసి కమిషన్ రిపోర్టు ప్రకారం వర్గీకరణ ప్రక్రియను అమలు చేస్తారని సీఎం దీనిపై పూర్తి స్పష్టతతోనే ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో చేస్తున్న జాప్యంలో అంతరం ఏమీ లేదన్నారు. మాదిగ హక్కులను కాలరాయాలని చూసే కొద్ది మంది నాయకులకు భవిష్యత్తులో పుట్టగతులుండవన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్

ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ... సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం అమలు చేసే విధంగా కార్యాచరణ అమలుకు కృషి చేస్తామని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి క్యాబినెట్ సబ్ కమిటీ వేసి కమిషన్ రిపోర్టు రాగానే ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని హామీ ఇచ్చారని ఎస్సీ వర్గీకరణ ఎట్టి పరిస్థితుల్లో ఆగదన్నారు. కోర్టులు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. రాజ్యాంగాన్ని అడ్డుకునే శక్తి ఎవరికి లేదని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని హామీ ఇచ్చారు.

ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ... కొన్ని స్వార్థపూరితమైన శక్తులు ఒక అబద్ధాన్ని నిజం చేసే కుట్రలు చేస్తున్నాయని ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలు, మాదిగ ఉపకులాలు ఐకమత్యంతో పోరాడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి వర్గీకరణ సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాలు ఐకమత్యంతో పోరాడి సుప్రీం కోర్టు తీర్పును ప్రభుత్వం అమలు చేసే విధంగా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగి ఐకమత్యంతో సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, తాటికొండ రాజయ్య, కొండేటి శ్రీధర్, ఆరెపల్లి మోహన్, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, ప్రొఫెసర్ ముత్తయ్య, పరంజ్యోతి, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నరేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు పుట్ట రవి, స్థానిక కార్పొరేటర్లు బోడ డిన్న, అనిల్, మంద కుమార్, పవన్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజావాణికి 73 దరఖాస్తులు
ఫిర్యాదులు స్వీకరించిన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



బాధితులు ఇచ్చిన ధరఖాస్తును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ గ్రామాల నుంచి వివిధ సమస్యలపై 73 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులను పిలిచి సమస్యపై ఎంక్వైరీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 6, ఎల్కతుర్తి తహ సీల్దార్ కార్యాలయానికి 6 దరఖాస్తులు రాగా పోలీస్ కమిషనరేట్ కార్యాలయాని 4, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 4, ఐనవోలు, కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి 4 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. మిగతా దరఖాస్తులు వివిధ సమస్యలపై వచ్చాయి. ప్రజావాణిలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, సీపీవో సత్యనారాయణరెడి అధికారులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ సమస్యలు పరిష్కరించండి

హనుమకొండ బాలసముద్రంలోని స్విమ్మింగ్‌పూల్‌లో కనీస సౌకర్యాలు లేవని కాకతీయ స్విమ్మింగ్‌పూల్ అసోసియేషన్ నాయకులు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్విమ్మింగ్‌పూల్‌లో నీరు సరిగా శుద్ధి కాకపోవడంతో స్విమ్మర్లు ఎలర్జీతో పాటు అనారోగ్యానికి గురవుతున్నారని, బాత్ రూంలు, జిమ్‌లో సౌకర్యాలు లేవని, సమ స్యలు పరిష్కరించాలనివినతి పత్రంలో పేర్కొన్నారు.

వరంగల్ కలెక్టరేట్‌లో...

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజావాణి వేదిక కావాలని కలెక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు పంపి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. గత వారం సమర్పించిన వినతుల్లో ఎక్కువ శాతం పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో మొత్తం 87 వినతులు అందగా ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 34, డీఆర్‌డీవో 8, డీబ్ల్యూఎంసీ 9, లీడ్ బ్యాంక్ మేనేజర్ 1, పౌరసరఫరాల శాఖ 2, పోలీసు శాఖ 2, జిల్లా సంక్షేమ శాఖ 5, టీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్ రీజినల్ కో ఆర్డినేటర్ 4, వ్యవసాయశాఖ 2, పంచాయతీ శాఖ 4, కార్మిక శాఖ 2, మైనార్టీ ఆఫీసర్ 1, జీఎం ఇండస్ట్రీస్ 1, వర్ధన్నపేట మునిసిపాలిటీ 1, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కు సంబంధించినవి 10 ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో విజయలక్ష్మి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్య శారద

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

కలెక్టర్ ప్రావీణ్య



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం వ్యవసాయ, డీఆర్‌డీఏ ఐకేపీ, పౌరసరఫరాలు, సహకార, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్ కాలానికి సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టామన్నారు. ధాన్యం కొనుగోలు అయిన రైతులకు సకాలంలో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వాతా వరణ పరిస్థితులను కూడా రైతులకు ప్రతి రోజు అధికారులు తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని 11 రైస్ మిల్లుల యాజ మాన్యాలతో ధాన్యం కొనుగోలు ప్రక్రి య గురించి సంబంధించిన బ్యాంక్ గ్యారెంటీ అండర్ టేకింగ్ జరిగిందన్నారు. జిల్లాలో 101 ధా న్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధా న్యం కొనుగోలు ప్రక్రి యను నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 156.320 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ధాన్యం కొను గోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చిన రైతులకు ఏఈఓలు టోకెన్లు అందజేయాలన్నారు. ధాన్యం రవా ణాలో ఎలాంటి ఇబ్బందులు లేవని పేర్కొ న్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగపద్మజ, డీసీఎస్‌వో దేవరాయి కొమురయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

‘ఇందిరమ్మ’ దరఖాస్తుదారుల్లో..ఆనందం

(5వ పేజీ తరువాయి)

నిర్మాణమై పూర్తయిన, ఇంకా పూర్తికాక మ ధ్య నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్ల విషయంలో ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాలుండగా ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లు మంజూరు చేయనున్నారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లాలో 42 వేల మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు దక్కే అవకాశం ఉంది. అయితే ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయహస్తం ఆరు హామీల్లో ఒకటిగా ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 2,88,000 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో సొంత స్థలం, ఇల్లు కూడా లేనివారు 2,30,400 మంది కాగా, స్థలం కలిగిన వారు 57,000 మంది ఉన్నారు. మొదటి విడతగా నియోజకవర్గానికి 35,000 ఇళ్లనే మంజూరు చేయాల్సి ఉన్న దృష్ట్యా దరఖాస్తుదారుల్లో అర్హులను ఎంపిక చేయడం అధికారులకు సమస్య కానున్నది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను గత ప్రభుత్వం కలెక్టర్ల చేతిలో పెట్టింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే లబ్ధిదారుల ఎంపిక జరుగనున్నది. ప్రతీ నియోజకవర్గంలో వారి మాటకే ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యం ఉంటుందని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లోని నేతలు తమకు అనుకూలంగా ఉన్నవారికి ఇప్పించుకునేందుకు ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఇందిరమ్మ కమిటీలు..

ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామ స్థాయిలో ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాస్తవంగా ఈ కమిటీలను గ్రామ సభల ద్వారా నియమించాల్సి ఉన్నా స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులతో కమిటీలకు తుది రూపం ఇచ్చారు. కమిటీల జాబితాను కలెక్టర్లకు అందజేశారు. అయిదుగురు సభ్యులతో ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేశారు. ఇందులో ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శికి స్థా నం కల్పించారు. గ్రామ పంచాయతీ ల్లో, పురపాలక సంఘాల్లో ఇందిరమ్మ కమిటీ లు, అధికారులు కలిసి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. గ్రామ సభలు నిర్వహించిన దరఖాస్తు ల పరిశీలన అనంతరం కమిటీలు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది.

తండ్రి బాగోగులు చూడని కొడుకు భూమి పట్టా రద్దు

తిరిగి తండ్రికే పట్టా చేసిన అధికారులు
పాస్ పుస్తకం అందించిన తహసీల్దార్
వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో సీనియర్ సిటిజన్ యాక్టు అమలు చేసిన మొదటి కేసు



రైతు రాజకొంరయ్యకు పట్టాదార్ పుస్తకాన్ని అందజేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్

భీమదేవరపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తండ్రి బాగోగులు చూడకపోవడంతో కొడుకు పేరుపైన చేసిన వ్యవసాయ భూమి పట్టాను రెవెన్యూ అధికారులు రద్దు చేశారు. భీమదేవరపల్లి మండలం ముస్తాఫాపూర్ గ్రామానికి చెందిన మద్దెల రాజకొంరయ్య కొడుకు రవి పేరుపైన గతంలో 4.12ఎకరాల భూమిని పట్టా చేశారు. తల్లి మరణాంతరం తండ్రి బాగోగులు చూడకపోవడంతో కుమారుడి పేరుపైన చేసిన పట్టాను రద్దు చేయాలని రాజకొంరయ్య రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేసిన అధికారులు సీనియర్ సిటిజన్ యాక్టు అమలు చేసి కొడుకు రవికి రిజిస్ట్రేషన్ చేసిన 4.12ఎకరాల్లో 3.20ఎకరాలను రవికి రద్దు చేశారు. తిరిగి ఆన్‌లైన్‌లో రాజకొంరయ్యకు రిజిస్ట్రేషన్ చేసి పట్టాదార్ పాస్‌పుస్తకాన్ని సోమవారం తహసీల్దార్ ప్రవీణ్ అందజేశారు. మిగిలిన 32గుంటల భూమిని కూడా రెండు మూడు రోజుల్లో డిజిటల్ సైన్ రాజకొంరయ్య పేరు మీద మార్పిడి చేస్తామని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో సీనియర్ సిటిజన్ యాక్టు అమలు చేసి కొడుకు భూమిని రద్దు చేసి తండ్రికి చేయడం ఇదే మొదటిదని తహసీల్దార్ ప్రవీణ్ తెలిపారు.

జిల్లా మీడియా కన్వీనర్‌గా దీపక్‌రెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటున్న దీపక్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 4 : టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ హనుమకొండ జిల్లా కన్వీనర్‌గా కేతిడి దీపక్‌రెడ్డి నియ మితులయ్యారు. రాష్ట్ర చైర్మన్ రామ్‌మో హన్‌రెడ్డి నియామకాన్ని అధికారికంగా ప్రకటిం చారు. దీపక్‌రెడ్డి 59వ డివిజన్‌కు చెందిన వారు. సోమవారం హను మకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ద్వారా నియామక పత్రాన్ని అందుకున్నాడు.

యాదవుల సంస్కృతిని ప్రతిబింబించేలా సదర్

వడ్డేపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాదవుల సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా సదర్ సమ్మేళన్ ఉత్సవాన్ని ఈనెల 6న సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు హనుమకొండ గోకుల్ నగర్‌లో నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గిరబోయిన రాజయ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బంక సంపత్ యాదవ్‌లు తెలిపారు. సోమవారం హనుమకొండ గోకుల్ జంక్షన్‌లోని ఓ ప్రైవేటు సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారితో పాటు అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నేతలు సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మూగల కుమార్ యాదవ్‌లు మాట్లాడారు. ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమైన సదర్ సమ్మేళన్ ఉత్సవాన్ని మొట్టమొదటిసారి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని హనుమకొండ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహాభారతంలో ప్రధాన భూమిక పోషించిన యాదవులు నీతికి, నిజాయితీకి మారుపేరుగా నిలుస్తున్నారని అన్నారు. ఈ సదర్ సమ్మేళన్ ఉత్సవంలో దున్నపోతుల విన్యాసాలు, యాదవుల సంస్కృతిని ఇమిడింప చేసే పాటలు, నృత్యాలను యాదవ కళాకారులు ప్రదర్శిస్తారని తెలిపారు. రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ సమ్మేళన్ ఉత్సవంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని యాదవులు రాజకీయాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్‌యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నేతలు బనుక సిద్దిరాజు యాదవ్, సత్యం యాదవ్, ఎల్లావుల రాజేందర్, బుట్టి శ్యామ్, బట్టమేకల భరత్, బంక సతీష్, బొంగు రాజు, బంక చంద్రశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

రేపు ‘ఆణిముత్యాలు’ గ్రంథావిష్కరణ

హనుమకొండ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు సంస్కృత పండితులు సముద్రాల శఠగోపాచార్య కలం నుంచి జాలువారిన ఆణిముత్యాలు గ్రంథం, దాని ఆంగ్లానువాదం జెమ్స్‌ఆఫ్ వైదిక్ విస్‌డమ్ గ్రంథావిష్కరణ బుధవారం సాయంత్రం జరుగనుంది. హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ఎస్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎ. వరదారెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. భద్రాద్రి ఆలయ వేద పండితులు జి.మురళీకృష్ణమాచార్య గౌరవ అతిథిగా పాల్గొంటారు. కేయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పాలకుర్తి దినకర్ గ్రంథ పరిచయం చేస్తారు.

28న ఆలయ భూములపై విచారణ

కాశిబుగ్గ, నవంబరు4,(ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర రంగనాథ స్వామి ఆలయాల భూములపై హైకోర్టులో ఈనెల 28న విచారణ జరగనుంది. లక్ష్మీపురంలోని 212సర్వే నెంబరులో గల 2660 చదరపు గజాల భూమిపై ఇక్కడి కోర్టులో 14 ఏళ్ల పాటు విచారణ జరిగింది. ఈ భూమి ఆలయాలకు సంబంధించినదని తీర్పు వెలువడినట్లు రంగనాథ స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగరి రవి తెలిపారు. కాగా, ఈ భూమి తమదే అంటూ రాచర్ల శ్రీనివాస్, రాచర్ల వెంకటేశ్వర్లు హైకోర్టును ఆశ్రయించారు. వంగరి రవి, చిమ్మని రమేష్, పిట్ట పూర్ణచందర్, శ్రీ కాశీవిశ్వేశ్వర రంగనాథ ఆలయ పరిరక్షణ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులను, తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ నేపథ్యంలో వీరికి హైకోర్టు నుంచి నోటీసులు అందాయి. దీనిపై ఈనెల 28న విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో ఆలయ పరిరక్షణ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఇటీవల సమావేశం నిర్వహించుకున్నారు. న్యాయ పోరాటం చేయాలని నిర్ణయించినట్లు కమిటీ అధ్యక్షుడు పెరుమాండ్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులు ఆకెన వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, కోశాధికారి దయాకర్ తెలిపారు. ఆలయ పక్షాన ఉచితంగా కోర్టులో వాదించడానికి న్యాయవాది సాంబారి ప్రభాకర్ ముందుకు వచ్చినట్లు వంగరి రవి తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్య పాల్పడ్డ రైతు శ్రీశైలం.

వేలేరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయనికి చేసిన అప్పులు తీర్చేదారి లేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో సోమవారం జరిగింది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన రైతు బెల్లం శ్రీశైలం (50) తనకున్న రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మూడు సంవత్సరాలుగా ఆశినంత పంట దిగుబడి రాకపోవడంతో క్రమక్రమంగా అప్పుల పాలయ్యాడు. దీనికి తోడు ఇటీవల కూతురు వివాహానికి కూడా అప్పులు చేయడంతో అప్పుల భారం ఎక్కువైంది. దీంతో సాగు చేసిన పంటలు దిగుబడి రాక, పంట నష్టం వాటిల్లడంతో అప్పుల భారం పెరిగింది. చేసిన అప్పులు తీర్చేదారిలేక మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శ్రీశైలం సోమవారం ఉదయం ఐదు గంటల సమయంలో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టు పక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

మడికొండలో టమాటా వాహనం బోల్తా



బోల్తా పడిన టమోటా వాహనం

మడికొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టమాటాల లోడ్‌తో వెళ్తున్న వాహనం బోల్తా పడిన ఘటన మడికొండలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం సోమవారం రాత్రి అనంతపురం నుంచి టమాటాల లోడ్‌తో వరంగల్ మార్కెట్‌కు వెళ్తున్న ట్రక్కు మడికొండ చౌరస్తా వద్దకు రాగానే అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. దీంతో ట్రక్కులో ఉన్న టామాటాలు మొత్తం రోడ్డుపై పడిపోయాయి. ట్రక్కు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో గంటకు పైగా ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. ఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక పోలీసులు ట్రక్కును రోడ్డు ప్రక్కకు తరలించారు. వాహనాలను వన్‌వేలో పంపి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కాగా, ట్రక్కు డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

వైద్యులు అంకితభావంతో పని చేయాలి

హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, సిబ్బంది సేవా భావంతో ప్రజలకు సేవలు అందించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య అన్నారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పల్లె దవాఖాన, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. పీహెచ్‌సీలకు వైద్య సేవల నిమిత్తం వచ్చే వారిని అప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకొని దానికి అనుగుణంగా చికిత్స అందించాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అన్ని ఆరోగ్య కార్యక్రమాలను, నిర్ధేశించిన లక్ష్యాలను సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, వైద్యులు మహేందర్, హిమబిందు, ఇఫ్తాకర్ అహ్మద్, వి.అశోక్‌రెడ్డి, ప్రసన్న కుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కుల గణన నుంచి మినహాయింపు ఇవ్వాలి

డీఆర్‌వోకు దివ్యాంగ ఉపాధ్యాయుల వినతి



డీఆర్‌వోకు వినతి పత్రం అందజేస్తున్న మహేందర్

హనుమకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6వ తేదీ నుంచి జరగబోయే కులగణన విధుల నుంచి తమను మినహాయించాలని దివ్యాంగ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. సోమవారం ఈ మేరకు దివ్యాంగ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ నేతృత్వంలో దివ్యాంగ ఉపాధ్యాయులు డీఆర్‌వో గణేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అధిక వైకల్యం కలిగిన ఉపాధ్యాయులు, అంధ ఉపాధ్యాయులు ఎవరి సహకారం లేకుండా నడవడమే కష్టమ నీ, అలాంటిది కులగణనకు ఇంటింటికి తిరుగుతూ విధులు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016 ప్రకారం దివ్యాంగుల అనుమతి లేనిదే ఎలాంటి అదనపు బాధ్య తలు అప్పగించరాదని, అయినా విధులు కేటాయించడం బాధాకరమన్నారు. తమను విధుల నుంచి మినహాయించాలని అభ్యర్థించారు. డీఆర్‌వోను కలిసిన వారిలో సంఘ బాధ్యులు వాసుదేవరెడ్డి, స్వరూప, వెంకటేశ్, సృజన, సులోచన తదితరులు ఉన్నారు.

డీబీఎఫ్ పోరాటాల ఫలితమే మెస్ చార్జీల పెంపు

రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్

వడ్డెపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) పోరాటాల ఫలితంగానే హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెరిగాయని రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ అన్నారు. సోమవారం హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద డీబీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత గిరిజన బీసీ విద్యార్థి సంఘాల పోరాటాలతో పాటు తమ సంఘం ఆధ్వర్యంలో సుదీర్ఘంగా వసతి గృహాల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ చార్జీలను పెంపుపై ఆందోళన చేపట్టిందని అన్నారు. తమ పోరాటాల ఫలితంగా వసతి గృహాల విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు బొర్ర సంపూర్ణ, మాదాసి సురేష్, కలకోటి మహేందర్, మేకల అనిత, చుంచు నరేష్, పుల్యాల మంజుల, మరుపట్ల సుజాత, రాజు, గొడిశాల హరినాథ్ పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న వినయ్ భాస్కర్

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

మాజీ మాజీ చీఫ్ విప్ వినయ్ భాస్కర్

హనుమకొండ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీలో కొలువైన శ్రీభూ నీళా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయ అర్చకులు వాసుదేవాచార్యులు, యజుర్వేద పండితులు జీవీఎస్ విజయకుమారాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ వైభవోపేతంగా నిర్వహించిన వేడుకల్లో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, సభ్యులు సాయి ప్రసాద్, శ్రీరంగం, ప్రభాకర్‌రెడ్డి, పద్మావతి, నాగేశ్వర్‌రావు, మనోహర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

ఆలయాలకు పోటెత్తిన భక్తులు
నగరంలో ఆధ్యాత్మిక వాతావరణం



కాశిబుగ్గ విశ్వేశ్వరాలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు

ఖిలావరంగల్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని దేవాలయాలలో పవిత్ర కార్తీకమాసం సందర్భ ంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఉదయం ఖిలావరంగల్ మధ్యకోటలోని శ్రీ స్వయంభూదేవాలయంలో శ్రీ శంభులింగేశ్వరస్వామి ప్రాతఃకాల పూజ, అభిషేకం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. 18వ, డివిజన్ శాలినీనగర్‌లోని పంచముఖ నాగవీరేశ్వరాలయంలో అర్చకుడు శివశ్రీభోగేశ్వరశాస్త్రీ ఆధ్వర్యంలో అభిషేకం, రుద్రభిషేకాలు, బిల్వార్చన పూజలు చేశారు. సాయంత్రం ధ్వజస్తంభానికి ఆకాశదీపాన్ని ఎగురవేశారు. రంగశాయిపేటలోని భవానీ శంకర దేవాలయంలో అర్చకుడు శివప్రసాద్‌శర్మ, అభిషేకం, బిల్వపూజ చేశారు. వడ్ల వాడలోని రామలింగేశ్వరాలయంలో ఆలయ చైర్మన్ ముత్తినేని రావ మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వెలిదే ప్రదీప్‌శాస్త్రి, గంగు రాజేంద్రప్రసాద్‌శర్మ పూజలు నిర్వహించారు. 41వ, డివిజన్ విశ్వనాథకాలనీ శ్రీ అభయాంజనేయస్వామి దేవాలయంలో అధ్యక్షుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బొమ్మలగుడిలో..

కరీమాబాద్, (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా కరీమాబాద్‌లోని చారిత్రక కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం (బొమ్మలగుడి)లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు కాపర్తి శంకర్‌శివ శర్మ ఆధ్వర్యంలో ఉదయం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం మహాశివుడికి రుద్రహోమం, నవరసాభిషేకాలు, అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వొగిలిశెట్టి అనిల్‌కుమార్, కొండూరు శివప్రసాద్, నాగరాణి, ధనలక్ష్మి, సంధ్యారాణి, స్వప్న, మహిళా కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విశేష పూజలందుకున్న కాశీవిశ్వేశ్వరుడు..

కాశిబుగ్గ, (ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని శ్రీ కాశీవిశ్వేశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా విశేష పూజలు చేశారు. ఈ మాసంలో మొదటి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, అర్చనలు జరిపించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బయ్యా స్వామి, వెంకటేశ్వర్లు, పోషాలు, పంచాక్షరయ్య, శ్రీను, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మురళీ పేర్లపై పూజలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. కార్యక్రమంలో 19, 20 డివిజన్ల కాంగ్రెస్ అధ్యక్షులు దాసరి రాజేష్, సతీష్, రవీందర్, ఆలయ సేవకులు పాల్గొన్నారు. అనంతరం అయోధ్యలో ప్రతిష్ఠించే రామ బీజాక్షర యంత్రాన్ని ఆలయానికి తీసుకువచ్చి భక్తులకు దర్శనం కల్పించారు.



కరీమాబాద్ బొమ్మలగుడిలో పూజలు చేస్తున్న భక్తులు

దేవాలయ భూముల సర్వే

కాశిబుగ్గ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర, శ్రీ రంగనాథ స్వామి దేవాలయాల భూములను సోమవారం సర్వే చేశారు. కాశీవిశ్వేశ్వర ఆలయం పక్కన కల్యాణ మండపం, రంగనాథ స్వామి ఆలయం స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించడానికి ఈ సర్వే చేపట్టినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఈ సర్వే చేపట్టినట్లు కాంగ్రెస్ నేత అంబి సాంబరాజు తెలిపారు. కార్యక్రమంలో ఈవో వెంకట్రావు, ఏఈ సునీల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ, బొక్కలగడ్డ, లష్కర్‌బజార్, కుమార్‌పల్లి ఏరియాలో ఉదయం 8 నుంచి 11.30 వరకు, ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, చైతన్యపురికాలనీ, టీచర్స్‌కాలనీ ఫెజ్-2 లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, ఎల్‌ఐసీ రోడ్డు ఆఫీస్, ఏకశిల పార్కు రోడ్డు, బాలసముద్రం ఏరియాలో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, భవానినగర్, హౌజింగ్ బోర్డు, ఇందిరానగర్, అశోక్‌కాలనీ, వికాస్‌నగర్ ఏరియాలో సాయత్రం 3.30 నుంచి 5.30 వరకు విద్యుత్ ఉండదన్నారు.

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేష్



సమావేశంలో ప్రసంగిస్తున్న నరేష్

ఖిలావరంగల్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో ఏర్పాటు చేసిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం మాట్లాడుతున్న మాటలకు పొంతన ఉండటం లేదన్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారిందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో విద్యావ్యవస్థను భ్రష్టు పట్టించారని, ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజలు నమ్మి ఓట్లు వేశారని అన్నారు. కానీ రేవంత్‌రెడ్డి సైతం అదే బాటలో నడుస్తున్నారన్నారు. కీలక శాఖలను తన దగ్గరే పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్నా నాడు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. విద్యార్థులే స్వయంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని, లేదంటే ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారధి, ల్యాదళ్ళ శరత్, నాయకులు అభిరామ్, రాకేష్, శ్రీధర్, శివకుమార్, సంతోష్, రాజు, ఖలీల్, ప్రభాస్, సోను, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంలను సూపర్‌వైజర్లుగా నియమించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి నిర్వహించనున్న కుల గణనలో పీఎస్ హెచ్‌ఎంలను సూపర్‌వైజర్లుగా నియమించాలని జిల్లా పీఎస్ హెచ్‌ఎంల సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు దేశిని లక్ష్మీనారాయణ, సీఎస్ఆర్ మల్లిక్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో పీఎస్‌హెచ్‌ఎంలను సూపర్‌వైజర్లుగా నియమించారని గుర్తు చేశారు. ఒకవేళ పీఎస్‌హెచ్‌ఎంలను సూపర్‌వైజర్లుగా నియమించే వీలులేకుంటే వారిని కుల గణన నుంచి వినహాయించాలని కోరారు.

నూతన డీఎస్‌వోను కలిసిన రైస్ మిల్లర్లు



డీఎస్‌వోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు

హనుమకొండ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన దేవరాయ కొమురయ్యను హనుమకొండ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్ది ప్రదీప్ కుమార్ గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువ కప్పి సత్కరించారు.. పుష్పగుచ్ఛాన్ని అందచేశారు. రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వినతి పత్రాన్ని అందచేశారు. డీఎస్‌వోను కలిసిన వారిలో ప్రదీప్ కుమార్‌తో పాటు అసోయేషన్ కార్యదర్శి కన్నయ్య, కోశాధికారి లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షుడు నూక సంతోష్, మరో 30 మంది రైస్ మిల్లర్లు ఉన్నారు.

బహుమతి విజేతకు ఎంపీ కావ్య అభినందన



వనం ధృవను అభినందిస్తున్న ఎంపీ కావ్య

జూలైవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కళా ఉత్సవాలలో వరంగల్ జిల్లా సంగెం మండలం గాంధీనగర్‌కు చెందిన వనం ధృవ ద్వితీయ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్వగృహంలో సోమవారం ధృవను అభినందించారు. తను జమిడికె వాయిస్తూ ఎల్లమ్మ కథ చెబుతూ చేసిన నాట్యం ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. బైండ్ల కళాకారులు వాయించే జమిడికె వాయిద్యాన్ని కళా ఉత్సవాల్లో ప్రదర్శించిన విద్యార్థి ద్వితీయ బహుమతిని గెల్చుకున్నాడు. ఈ కార్యక్రమంలో ధృవ తల్లి దండ్రులు వనం రమేశ్, సుజాత, బైండ్ల సంఘం నాయకులు బొట్టు శ్రీధర్, ఎల్కంటి శ్రీధర్, జిలుకర సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కథల పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు కథల పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఖిలావరంగల్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం రిటైర్డు ఉపాధ్యాయుడు కందగట్ల ప్రకాశ్ విద్యార్థులకు 3 ఆర్, 20 కథల పుస్తకాల సెట్‌ను పంపిణీ చేశారు. సోమవారం శంభునిపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు తాళ్ళపెల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 20 కథల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థులు ఇంటిదగ్గర చదువుకునేందుకు 3 ఆర్ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్‌కుమార్, సిద్దేశ్వర్, పవిత్ర, మమత, వెంకటేశ్వర్లు, రఘు, వివేకానంద, విజయ్, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాకే ఎన్నికలకు వెళ్లాలి

సర్పంచుల సంఘం డిమాండ్
సచివాలయం ముట్టడిని అడ్డుకున్న పోలీసులు



పోలీసుల అదుపులో ఉన్న సర్పంచులు

కాశిబుగ్గ, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచులు సోమవారం చేపట్టిన చలో సచివాలయం కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1548 మంది సర్పంచుల పదవీ కాలం కొన్ని నెలల క్రితం ముగిసింది. అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. వీరికి రెండు సంవత్సరాలుగా బిల్లులు రాలేదు. పదవీ కాలం ముగిసినా చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కలెక్టరేట్‌ల వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సోమవారం సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. అయితే సర్పంచులు హైదరాబాదుకు వెళ్లకుండా పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అయినప్పటికీ ఉమ్మడి జిల్లా నుంచి పోలీసులను తప్పించుకుని 50మందికి పైగా సచివాలయానికి వెళ్లారు. బీఆర్ఎస్ హయాంలో సీసీ రోడ్లు, నర్సరీలు, వైకుంఠధామాలు, ఇంకుడు గుంతలు వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేయించారని సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి తెలిపారు. వాటి బిల్లులు ఇప్పటి వరకు రాలేదని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఉపాధి హామీ నిధులు సైతం ఖాతాల్లో జమకాలేదన్నారు. సంక్రాంతి నాటికి గ్రామాల్లో నూతన సర్పంచులు వస్తారని మంత్రి శ్రీనివాస్ రెడ్డి ప్రకటించన నేపథ్యంలో బకాయి బిల్లులు వస్తాయో లేదోననే అనుమానం సర్పంచుల్లో ఉందని పేర్కొన్నారు. వెంటనే బిల్లులు చెల్లించి ఎన్నికలకు వెళ్లాలని ఆయన కోరారు. వరంగల్, హనుమకొండ జిల్లాలకే రూ.100 కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.


రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు అరవిందరాజ్ ఎంపిక



అరవిందరాజ్‌ను అభినందిస్తున్న కోచ్ సుజీత్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు4: (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు హనుమకొండ నయీంనగర్ హాకీ క్లబ్‌కు చెందిన అరవిందరాజ్ ఎంపికైనట్లు కోచ్ ములకల సుజిత్ తెలిపారు. ఇటీవల హనుమకొండలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి హాకీ పోటీల్లో అరవిందరాజ్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభతో రాణించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. ప్రస్తుతం అరవిందరాజ్ హనుమకొండ మర్కజీ ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైన అరవిందరాజును పాఠశాల అధ్యాపకులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

హనుమకొండ టౌన్, నవంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ సీఐ వై. సతీష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం... వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన మహ్మద్ వసీం ప్రైవేట్ జాబ్ చేసి కుటంబాన్ని పోషించలేక సులువుగా డబ్బు సంపాదించేందుకు బైకు దొంగతనాలు చేసేవాడు. వాటిని ఇతరులకు తక్కువ ధరకు అమ్మి వచ్చే డబ్బులతో జల్సాలు చేసేవాడు. సోమవారం అలంకార్ జంక్షన్ వద్ద బైకు కన్సల్టెన్సీలో తక్కువ ధరకు అమ్ముతున్నాడనే సమాచారం మేరకు అక్కడికి పోలీస్ సిబ్బంది వెళ్లగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా ఆదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. నిందితుడి నుంచి మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. కాగా, నిందితునిపై పలు పోలీస్‌స్టేషన్‌లలో బైకు దొంగతనం కేసులు ఉన్నాయన్నారు.

సృజనాత్మకతతో రీసైక్లింగ్ చేయాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీఈవో వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పనికిరావని పడేసిన వస్తువులను సృజనాత్మకతను జోడించి రీసైక్లింగ్ చేయాలని డీఈవో దౌలాగర్ వాసంతి అన్నారు. సోమవారం హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసి వేస్ట్ టూ వెల్త్ అనే కార్యక్రమానికి ఆమె అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేస్టేజ్‌తో తయారు చేసిన సుందరమైన అలంకరణ వస్తువులను చూసి అబ్బురపడ్డారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీసీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ విద్యాసాగర్, డీఎస్‌వో ఎ.శ్రీనివాసస్వామి పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన బల్దియా సెక్రెటరీ

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సెక్రెటరిగా బాధ్యతలు చేపట్టిన లక్క అలివేలు సోమవారం సాయంత్రం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను కలిసి పూల మొక్కను అందించారు. ఇటీవల బల్దియాలో పని చేస్తున్న విజయలక్ష్మి హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. విజయలక్ష్మి స్థానంలో ప్రస్తుతం మహబూబాబాద్ డీఆర్‌వోగా పని చేస్తూ వరంగల్ బల్దియాకు బదిలీ చేస్తూ రాష్ట్ర అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలివేలు సోమవారం బాధ్యతలు చేపట్టిన తర్వాత కమిషనర్‌ను కలిసి కార్యాలయానికి చేరుకున్నారు.

రైల్వే రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

కాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాజీపేట సమీపంలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట రహ్మత్‌నగర్‌కు చెందిన రైల్వే రిటైర్డ్ ఉద్యోగి కొరివి కృష్ణారావు (75) సోమవారం సాయంత్రం కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి జేబులో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వైద్యుల రాసిన ప్రిస్కిప్షన్‌లు ఉన్నాయి. రైల్వే ఉద్యోగుల సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరిచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశామని, ఆత్మహత్యకు గల వివరాలు తెలియరాలేదని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి బలవన్మరణం

మట్టెవాడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో మామునూరు పెన్షన్‌పురలో ఓ ప్రైవేట్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మామునూరు పోలీసుస్టేషన్ పరిధిలోని పెన్షన్‌పురాలో నివాసం ఉంటున్న ఎండీ వసీం హైమద్ (45) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దానికితోడు ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. అతని కుమారుడు ఎండీ.ఖాజా వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మామునూరు సీఐ రమేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహనదారులకు కోర్టులో న్యాయమూర్తి విద్యాసాగర్ జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి. సీతారెడ్డి తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 34 మందిని సోమవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రూ. 40,700 జరిమానా విధించారన్నారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని నలుగురికి రూ. 2,100 జరిమానా విధించారన్నారు.

భద్రకాళి ఆలయంలో పీఆర్‌టీయూ నేతల పూజలు



అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న నాయకులు

వరంగల్ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి ఆలయాన్ని సోమవారం ఉదయం పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలిచిన పింగిళి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.దామోదర్‌రెడ్డితోపాటు పూర్వ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి తదితరులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. వారి వెంట లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితర జిల్లా నాయకులు కూడా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనం నిర్వహించారు.

సాహిత్యం



మహానంది అవార్డు అందుకుంటున్న శ్రీనివాసాచారి

- కార్యక్రమాల నిర్వహణ, పుస్తకాల రచనలు చేస్తున్న సిద్దోజు
- అమ్మ భాష పరిరక్షణకు పలు కార్యక్రమాల నిర్వహణ
- పలువురి ప్రశంసలు, పురస్కారాలు అందుకున్న శ్రీనివాసాచారి



అభినందిస్తున్న మంత్రి కొండా సురేఖ (ఫైల్)

తెలుగు భాషా సేవలో..

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్వతహాగా తెలుగు పండితుడు, తెలుగు భాషాభిమాని అయిన సిద్దోజు శ్రీనివాసాచారి తెలుగులో రచనలు చేస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు. పర భాషా మోజులో మాతృ భాషను చిన్న చూపు చూడొద్దని, మన భాషను మనం కాపాడుకుందామని నిరంతరం తపిస్తున్నారు స్టేషన్ ఘన్‌పూర్‌కు చెందిన శ్రీనివాసాచారి. ఏటా మాతృ భాషా దినోత్సవం, మాండలిక భాషా దినోత్సవం, కాళోజీ జయంతి, దాశరథి జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా తెలుగు భాషా పండిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కూడా పనిచేస్తున్న ఆయన స్కూళ్లలో కథల పోటీలు, కవితలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు ఏర్పాటు చేస్తున్నారు. అంతేగాక తెలుగు భాష ప్రాశస్త్యం అందరికీ తెలియజేయడానికి పలు పుస్తకాలు రాశారు. ఘన్‌పూర్ కృష్ణవేణి హైస్కూల్‌లో తెలుగు పండిట్‌గా ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్న శ్రీనివాసాచారి తెలుగు భాషాభివృద్ధిలో తన వంతు సేవ కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

రాసిన పుస్తకాలు ఇవీ..

తెలుగు భాషతో పాటు తెలంగాణ ఔన్నత్యం తెలియజేస్తూ పలు పుస్తకాలు రాశారు. మహా భారతం, సరస్వతీ సులభ వ్యాకరణం, సంపూర్ణ రామాయణం, వరంగల్ జిల్లాలో దర్శనీయ స్థలాలు, దేవాలయాలు, మేడారం శ్రీ సమ్మక్క, సారలమ్మ జాతర అనే పుస్తకాలు రాసి వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రచురించారు. ఈ పుస్తకాల ద్వారా జిల్లాలో పలువురి ప్రశంసలు అందుకున్నారు. భాషా దినోత్సవాలు, భాషా, సాహితీ వేత్తల జయంతి, వర్ధంతి కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తు భాషామతల్లి సేవలో తరిస్తున్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహిస్తున్నారు. శ్రీనివాసాచారి ఎంఏ, టీపీటీ చదివారు. పదేళ్లుగా తెలుగు పండిట్‌గా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన భాషా సేవలకు గాను పలు అవార్డులు, సత్కారాలు అందుకున్నారు. వరంగల్‌లో కృష్ణవేణి కళా సమితి ఉగాది పురస్కారం, కరీంనగర్‌లో తెలుగు భాషా సంక్షేమ సంఘం నుంచి రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం అందుకున్నారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జనగామలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనంలో కవి నందినీ సిధారెడ్డితో సత్కారం పొందారు. శ్రీనివాసాచారి సేవలను గుర్తించి భారతీయ దళిత సాహిత్య అకాడమీ 2016–2017 సంవత్సరానికి జ్యోతిరావ్ పూలే అవార్డుకు ఎంపిక చేయగా శ్రీనివాసాచారి ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. అలాగే తాజాగా తెలుగు సంస్కృతీ సాహితీ సేవా ట్రస్ట్ తెలంగాణ, ఏపీ వారు తాను రాసిన మహాభారతం పుస్తకానికి గాను జాతీయ స్థాయి మహానంది అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ తదితరులు అభినందించారు.



శ్రీనివాసాచారి ప్రచురించిన పుస్తకాలు

తెలుగు భాషను బతికించుకోవాలి



శ్రీనివాసాచారి, తెలుగు భాష పండిత సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

నానాటికీ తగ్గిపోతున్న తెలుగు భాషను బతికించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. తెలుగు వారంతా తెలుగు మాట్లాడడమే కాకుండా తమ పిల్లలకు తెలుగులో కథలు, సామెతలు, పురాణాలు, కవితలు నిత్యం చదివించాలి. పరాయి భాషపై వ్యామోహం వీడి.. మాతృ భాషలో చదివితేనే విషయ పరిజ్ఞానం, విలువలు, బంధాలు పెరుగుతాయని గ్రహించాలి. తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి. అన్ని ప్రభుత్వ శాఖల్లో బోర్డులతో పాటు జీఓలు, నోటీసులు అన్ని తెలుగులోనే ఇవ్వాలి. తెలంగాణ భాష, మాండలిక రచనలు, కవిత్వం, కవులు, రచయితలను ప్రోత్సహించాలి.

మీకు తెలుసా ?

శివునిపల్లికి..
ఆ పేరెలా వచ్చిందంటే..

జనగామ జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లిని జంటపట్టణాలుగా పేర్కొంటారు. ఈ రెండు పట్టణాలకు మధ్యలో రైల్వే గేట్ ఒక్కటే అడ్డం. ఆ గేటుకు 150మీటర్ల దూరంలో ఊరి మధ్యలోనే రైల్వేస్టేషన్ ఉంటుంది. 1889లో ఈ రైల్వే స్టేషన్ నిర్మాణం జరగ్గా.. అంతకు ముందు ఈ ఊరిని చిన్నపల్లె అనే వారు. చిన్నపల్లెకు ఆనుకుని ఆబాది ఘన్‌పూర్ ఉండేది. రైల్వే స్టేషన్ ఏర్పడ్డాక రైల్వే శాఖ వారు స్టేషన్ ఘనాపూర్ అని స్టేషన్‌లో బోర్డు ఏర్పాటు చేశారు. చిన్న పల్లె కాస్తా స్టేషన్ ఘనాపూర్‌గా మారింది. పక్క పక్కనే స్టేషన్ ఘన్‌పూర్, ఆబాది ఘన్‌పూర్ రెండు గ్రామాలు ఉండడంతో ప్రజలకు వాటిని గుర్తించడంలో కొంత అయోమయం ఏర్పడింది.

కాల క్రమంలో చిన్నపల్లెలో నగేరేశ్వ రాలయం (శివాలయం) నిర్మితం కావడంతో స్టేషన్ ఘన్‌పూర్‌ను శివునిపల్లె అని పిలవడం మొదలు పెట్టారు. ఇలా గ్రామాన్ని గుర్తించడం సులభం కావడంతో చివరికి అదే పేరు స్థిర పడింది. వాస్తవానికి శివునిపల్లి ఆబాది ఘన్‌పూర్ కంటే పెద్ద వ్యాపార కేంద్రంగా విలసిల్లింది. పోలీస్ స్టేషన్‌తో పాటు మొట్ట మొదటి పోస్ట్ ఆఫీసు, బ్యాంకు, తహసీల్ ఆఫీసు, రిజిస్ట్రేషన్ ఆఫీసు, రైస్ మిల్లులు, దుకాణాలు, సినిమా థియేటర్ అన్నీ శివునిపల్లిలోనే ఉండేవి. కానీ 1980 తర్వాత రైల్వే గేటు ఇబ్బందికరంగా ఉందని అన్నీ ఆబాది ఘన్‌పూర్‌కు తరలించారు.

- స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్




శివాలయం



శివునిపల్లి వివేకానంద చౌరస్తా

చిలుపూర్‌గుట్టపై
వెంకన్న రూపం
సామాజిక మాధ్యమాల్లో వైరల్

చిలుపూర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరి న కోర్కెలు తీర్చే కొంగు బంగారం, బుగులు వేంకటేశ్వర స్వామి కొలువైన చిలుపూర్‌గుట్ట పైభాగంలో, సాక్షాత్తు తిరుమల తిరుపతి కొండపైనున్న స్వామివారి రూపం ఉన్నట్లుగా గూగుల్ ద్వారా చిత్రీకరించిన మ్యాప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. రెండున్నర కిలోమీటర్ల ఎత్తులో ఉన్న గుట్ట పైభాగంలో ఏదో అద్భుతం ఉన్నట్లుగా గుర్తించిన స్థానిక పూజారి కృష్ణమాచార్యులు గూగుల్ మ్యాప్ ద్వారా పరిశీలించగా, అక్కడ స్వామివారి నిజ స్వరూపం, గరుడపక్షి, హనుమంతుడు ఉన్నట్లుగాను, అక్కడినుంచి అరకిలోమీటరు దిగువన స్వామివారి నామాలు ఉన్నట్లు గూగుల్‌లో కనిపించింది.



చిలుపూర్ గుట్టపై వెలకొన్న స్వామి వారి రూపం

సామాజిక సేవలో రా'రాజు'

- జాతీయ, రాష్ట్ర స్థాయి అవార్డులు ఆయన సొంతం
- 35 సార్లు రక్త దానం చేసిన కానిస్టేబుల్

ఖానాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృత్తి రీత్యా కానిస్టేబుల్ అయిన ఆయన సమాజానికి స్నేహ హస్తం చాచి వివిధ సేవా కార్యక్రమాలతో రా'రాజు'గా.. పలువురికి ఆదర్శంగా నిలుస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డులు సొంతం చేసుకున్నారు. ఆపదలో ఉన్న పలువురికి 35 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. విధులతో పాటు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనకంటూ ప్రత్యేకతను సంపాదించుకున్నారు

వరంగల్ రూరల్ జిల్లా ఖానాపురం మం డలం రాగంపేట గ్రామానికి చెందిన రాజు కన్నె కుమారస్వామి, రమణి దంప తుల పెద్ద కుమారుడైన రాజు ప్రస్తుతం కానిస్టేబుల్‌గా విధులు న్విహిస్తున్నాడు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న రాజు ఉన్నత విద్యను అభ్యసిస్తూనే 2005 నుంచి సామాజిక సేవా కార్యక్రమాలకు నాంది పలికారు.

19ఏళ్లుగా కొనసా గుతున్న ఆయన సేవా కార్యక్రమాలను గుర్తించిన పలు సంస్థలు ఆయనకు అవార్డులు అందించి సత్కరించాయి. 2009సంవత్సరంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరినప్పటి నుంచి ఫ్రేండ్లీ పోలీస్‌లో భాగంగా సేవలందిస్తూ పలువురి ప్రశంసలు అందుకున్నారు.

ఇప్పటివరకు 35 సార్లు రక్తదానం చేసిన ఆయన తన మిత్రుల సహాయంతో సుమారు 17,578 మంది ఆపదలో ఉన్న వారికి రక్తం సమకూర్చారు. స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత, హరితహారం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం. మూఢ నమ్మకాలు, ఎయిడ్స్ నిర్మూలన, అవయవదానం, రక్తదానంపై అవగాహన కార్యక్రమాలు, స్త్రీ విద్యను ప్రోత్సహించడం, ప్రభుత్వ విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ, పరీక్షా సామగ్రి పంపిణీ, రాగంపేట గ్రామంలో టెన్త్, ఇంటర్‌లో అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులకు, రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులివ్వడం లాంటివి చేస్తుంటారు. ఓటరు నమోదు, ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణకు అవగాహన తదితర కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.



రక్తదానం చేస్తున్న రాజు (ఫైల్)



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాజు (ఫైల్)

ఆదర్శం



మంత్రి పొన్నం ప్రభాకర్ నుంచి అవార్డు అందుకుంటున్న రాజు (ఫైల్)

పలు అవార్డులు సొంతం

సామాజిక సేవా రంగంలో రాణిస్తున్న రాజు పలు అవార్డులు అందుకున్నారు. సామాజిక సేవా రంగంలో గ్రామీణ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేసినం దుకుగాను మొదటి సారిగా 2019లో మనం మన ఊరి బడి అవార్డు, అదే ఏడాది జాతీయస్థాయి ఉగాది పురస్కారం, రాష్ట్ర స్థాయి ఆదర్శ పోలీస్ అవార్డు, సేవారత్న అవార్డు, టాలెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, జాతీయ స్థాయి తెలంగాణ కళారత్న అవార్డు అందుకున్నారు.

అంతకుముందు 2005 నుంచి పలు సందర్భాల్లో ఉత్తమ రక్తదాత, ఉత్తమ సామాజిక సేవ, రాష్ట్ర స్థాయి సావిత్రి బాయి పూలే, అంబేద్కర్ ఫెల్లోషిప్ నేషనల్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ డైమండ్ సిటిజన్ అవార్డు, స్టేట్ బెస్ట్ సిటిజన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు, ఉత్తమ ఉద్యోగి అవార్డు, బెస్ట్ ఎన్ఎస్ఎస్ వలంటీర్ అవార్డులు అందుకున్నారు. 2017లో రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ క్రీడల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడు మెడల్స్ సాధించారు. తాజాగా ఈ ఏడాది మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా హైయెస్ట్ బ్లడ్ డొనేషన్ అవార్డు, 2023లో హర్యానా సీఎం నుంచి రక్తవీర్ పురస్కారం, నిపా ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు. 2022లో అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ఉత్తమ రక్తదాత అవార్డు అందుకున్నారు.



దీపోత్సవాలను ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ ఏసీ సునీత



దత్తక్షేత్రంలో క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

నేడు నాగులచవితి

ఏటా పవిత్ర కార్తీకమాసంలో చవితి తిథితో కలిసి వచ్చే నాగుల చవితి పండుగను మంగళవారం జరుపుకోనున్నారు. మహిళలు, పెళ్లికాని యువతులు నాగుల చవితి వేళ ఉపవాసం ఉండి నాగేం ద్రుడికి ఇష్టనైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించుకుంటే తమ కోరికలు తీరుతాయన్నది నమ్మకం. ఈ వేడుకల కోసం వరంగల్ నగరంలోని ఉర్సు ప్రాంతంలో ఉన్న నాగమయ్య ఆలయం, ప్రసిద్ధ భద్రకాళి ఆలయ ప్రాంగణంలోని శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, ఊకల్‌లోని నాగేంద్ర స్వామి ఆలయంతో పాటు హనుమకొండలోని ప్రసిద్ధ వేయిస్తంభాల దేవాలయం, హనుమకొండ బ్రాహ్మణ వాడలోని నాగుల వీధిలోని ఆలయంతో పాటు హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వర ఆలయం, పబ్లిక్ గార్డెన్స్ ప్రాంతంలోని కొలువైన పుట్టల వద్దకు భక్తులు తరలి రానున్నారు.



అఖండ దీపారాధన చేస్తున్న భక్తులు

ఆలయాలకు కార్తీక శోభ..

- తొలి సోమవారం భక్తుల రద్దీ
- రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజల నిర్వహణ
- వేయి స్తంభాల ఆలయంలో దీపోత్సవం
- పంచ పుష్పాల అలంకరణలో సిద్దేశ్వరుడు

వరంగల్ కల్చరల్ / హనుమకొండ కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శివ కేశవుల ప్రీతికరమైన కార్తీక మాసంలో తొలిసోమవారం శివాలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. తెల్లవారుజామునుంచే అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. శివుడికి ఆలయాల్లో నమక చమక రుద్ర పారాయణాలతో, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం శివాలయాల్లో భక్తులు దీపాలు వెలిగించి శివుడిని దర్శించుకున్నారు. వరంగల్, హనుమకొండ నగరాల్లోని పలు ఆలయాల్లో శివుడికి పూజలు నిర్వహించి ఉసిరి దీపాలు, జామ పండ్లు, అరటి పండ్లను నైవేద్య నివేదన చేసి మంగళహారతులు ఇచ్చారు. వరంగల్ నగరంలోని శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీదుర్గేశ్వరాలయం, భోగేశ్వరాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, ఆకారపు వారిగుడి శివాలయం, గీతా భవన్‌లోని దాసాంజనేయ ఆలయంలోని శివాలయం, ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రం, గురుధామం, అయ్యప్ప దేవాలయం, శ్రీభద్రకాళి దేవాలయం, రంగంపేటలోని శ్రీభవాని శంకర ఆలయం, పోతన రోడ్డులోని కుంటి భద్రయ్య దేవాలయం, కరీమాబాద్‌లోని బొమ్మల గుడి, ఎస్ఆర్ఆర్‌తోటలోని శివాలయం, ఖిలా వరంగల్‌లోని శంభులింగేశ్వరాలయం, పెరుకవాడలోని శివాలయం, శివనగర్‌లోని శివాలయం, మార్కండేయ శివ భక్త శివాలయం, ఓసిటీలోని శివాలయం, కాశిబుగ్గలోని శివాలయంలో రుద్రాభిషేకాలు నిర్వహించారు.

హనుమకొండలోని చారిత్రక ప్రసిద్ధ వేయి స్తంభాల ఆలయం ఉదయం నుంచే వందలాది భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్ర శర్మ రుద్రేశ్వరుడికి అభిషేకాలు భక్తులచే సామూహిక అభిషేకాలు నిర్వహింపచేశారు. సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రదోషకాల సమయంలో సామూహిక దీపోత్సవాన్ని నిర్వహించగా జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామాల సునిత కార్యక్రమాన్ని ప్రారంభించారు. హనుమకొండలోని సిద్దేశ్వరాలయంలో అర్చకులు సిద్దేశుని రవికుమార్, సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామిని ఐదు రకాల పుష్పాలు , రుద్రాక్ష మాలలతో అలంకరింప చేసి భక్తుల దర్శనానికి అనుమతించారు. అలాగే స్వయంభూ జలేశ్వరాలయంలో అర్చకులు కేసరి రాంనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహింపజేశారు. ఆలయ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, ఇతర సభ్యులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గోదావరి హారతి



గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారంగా కార్తీక మాసం ప్రతీ సోమవారం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దేవస్థాన ప్రధాన రాజగోపురం నుండి మంగళ వాయిద్యాలతో గోదావరి నది వద్దకు బయలుదేరి ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ.మారుతి, సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, దేవస్థానం మాజీ చైర్మన్ గుడాల శ్రీనివాస్, మంథని మునిసిపల్ చైర్మన్ పెండ్రి రమ, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ధ్వజ స్తంభం వద్ద సహస్ర దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు.

కాళేశ్వరంలో భక్తుల సందడి


మహదేవపూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి త్రివేణి సంగమ గోదావరిలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం నుంచే గోదావరిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. గోదావరి మాతకు పసుపు, కుంకుమ, పాలు పట్టు వస్త్రాలతో గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వరస్వాములకు అభిషేకాలు నిర్వహించారు. శుభానం దదేవి ఆలయం, సరస్వతీ అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సోమవారం కావడంతో లక్ష పత్రి పూజలు, ఉసిరిక చెట్టు కింద లక్ష వత్తులు వెలిగించడం, లక్ష దీపారాదాన, బ్రాహ్మణులకు దాన ధర్మాలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించుకున్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆంధ్ర, తెలంగాణలోని భక్తులు చీకట్లోనే స్నానాలు ఆచరించి స్వామివార్లను దర్శించుకున్నారు.

రాజన్న గుడిలో ఎమ్మెల్సీ పూజలు


వర్ధన్నపేట రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇల్లంద గ్రామంలో గల శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో పరిసర ప్రాంతాలు కిక్కిరిపోయాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య లక్ష్మి దంపతులు రాజన్న గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. శివలింగానికి అభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని మొక్కుకున్నట్లు స్పష్టం చేశారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ సారయ్య దంపతులు



యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్



ఇన్‌ఫ్లమేషన్ ఇక్కట్లు

బరువు తగ్గడం పెద్ద సమస్యగా మారిపోయింది. డైటింగ్, వ్యాయామం... ఏం చేసినా అధిక బరువు తగ్గకపోతే, అందుకు శరీరంలోని 'ఇన్‌ఫ్లమేషన్'ను అనుమానించాలి. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో ఇన్‌ఫ్లమేషన్ కూడా స్థూలకాయానికి కారణమవుతుంది దీన్ని వదిలించుకోవడం కోసం 'యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్'ను ఎంచుకోవాలి.

ప్రతి రోజూ ఇవి తప్పనిసరి

- ఒమేగా3 ఫ్యాటీ యాసిడ్లు
- విటమిన్ డి
- ప్రొబయాటిక్స్ (పెరుగు, మజ్జిగ)
- పసుపు (రోజుకు ఒకటి నుంచి రెండు టీస్పూన్లు)
- అల్లం (రోజుకు 250 నుంచి 500 మిల్లీ గ్రాములు)

ప్రత్యామ్నాయాలున్నాయి

- **తీపి కోసం:** చక్కెరకు బదులుగా ముడి బెల్లం, తేనె, ఖర్జూరాలు
- **తెల్ల బియ్యం:** బ్రౌన్ రైస్, మిల్లెట్స్
- **రిఫైన్డ్ నూనెలు:** గానుగ నూనెలు, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్
- **మైదా:** పాలిష్ పట్టని గోధుమ పిండి

కొన్ని ఆరోగ్య సమస్యలకు ప్రత్యేకమైన వైద్య చికిత్సలంటూ ఉండవు. మరీ ముఖ్యంగా జీవనశైలితో ముడిపడి ఉండే ఒబేసిటీకి ఆహారమే ఔషధం. కొంతమంది ఎంత వ్యాయామం చేసినా, ఎంత మితంగా తింటున్నా అధిక బరువును వదిలించుకోలేకపోతూ ఉంటారు. ఈ కోవకు చెందిన ఊబకాయులు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌ను అనుసరించాలి. కొత్తగా, ఫ్యాషన్‌గా, ట్రెండీగా ఉండే పదార్థాలకు స్వస్తి చెప్పి, మన పూర్వీకుల నుంచి వస్తున్న భోజనశైలిని అనుసరించాలి.

పరిష్కారం మన మూలాల్లోనే...

ఏరోమ్యాటిక్ ఆర్థ్రయిటిస్, యూరిక్ యాసిడ్ సంబంధిత ఆర్థ్రయిటిస్... ఈ సమస్యలతో బాధపడుతున్నవాళ్లు, ఎంతకూ బరువు తగ్గనివాళ్లు, కండరాల నొప్పులు, ఎముకల నొప్పులు, బలహీనత మొదలైన లక్షణాలతో బాధపడేవాళ్లు తప్పనిసరిగా శరీరంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను అనుమానించాలి. నిజానికి ఈ సమస్యలకు అసలు కారణాన్ని కనిపెట్టలేక రకరకాల మందులు వాడుకుంటూ ఆరోగ్యాన్ని కుదేలు చేసుకునే వాళ్లూ ఉంటారు. కానీ మూల కారణాన్ని సరిదిద్దుకుంటే ఈ ఇబ్బందులు వాటంతట అవే తొలగిపోతాయి. అందుకోసం యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఆహారాన్ని ఎంచుకోవాలి. పాలిష్ పట్టని ముడి పదార్థాల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. నొప్పి, వాపులను తగ్గించే పోషకాలు మన స్థానిక పంటల్లో ఉన్నాయి.



ఇన్‌ఫ్లమేషన్ పరీక్షలు ఇవే!

మన సమస్యలకు కారణం ఇన్‌ఫ్లమేషన్ అవునో, కాదో తెలుసుకోవడం కోసం, ఇన్‌ఫ్లమేషన్ తీవ్రతను పసిగట్టడం కోసం ఇన్‌ఫ్లమేటరీ మార్కర్స్‌ను పరీక్షించాలి. అందుకోసం 'సి రియాక్టివ్ ప్రొటీన్ ఐఎల్6'ను పరీక్షిస్తే, శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ మోతాదు తెలిసిపోతుంది. మోతాదును బట్టి ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్ తీసుకోవడంతో పాటు, ఇన్‌ఫ్లమేషన్‌ను ప్రేరేపించే పదార్థాలను పూర్తిగా మానేయాలి.

ఇన్‌ఫ్లమేషన్ ఎందుకు?

ఇటీవలి కాలంలో మన ఆహారంలో ప్రాసెస్ చేసిన పదార్థాల మోతాదు పెరిగింది. తెల్ల బియ్యం, గోధుమలు, మైదా, వంటనూనెలు, చక్కెర ఇవన్నీ ప్రాసెస్ చేసినవే! వీటితో తయారయ్యే బిర్యానీలు, రొట్టెలు, బ్రెడ్లు, స్వీట్స్, కేక్స్, పిజ్జా వంటి ఆహార పదార్థాలన్నీ ఇన్‌ఫ్లమేషన్ కారకాలే! ఇంతకు ముందు ఈ సమస్య ఉండేది కాదు. ఇంట్లో తయారు చేసుకునే వంటకాల్లో దంపుడు బియ్యం, పొట్టు తీయని కంది పప్పు, పెసరపప్పు, పసుపు, వెల్లుల్లి వాడుకుంటూ ఉండేవాళ్లం. కానీ ఇప్పుడు మనం తింటున్న ఆహారంలో 80% ప్రాసెస్ చేసిన పదార్థాలే ఉంటున్నాయి. ప్రాసెస్డ్ మీట్, రిఫైన్డ్ షుగర్స్, రిఫైన్డ్ ఆయిల్స్, ఎక్కువ ఉప్పు, తీపి, నూనెలు కలిసిన పదార్థాలు, డీప్ ఫ్రై పదార్థాలు ఎక్కువగా తింటున్నాం. వీటి వల్ల శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ మొదలై, వాపులు, నొప్పుల రూపంలో బయటపడుతూ ఉంటుంది. ఇన్‌ఫ్లమేషన్ మూలంగా కార్డియోవ్యాస్క్యులర్ సమస్యలు కూడా పెరుగుతాయి. జీర్ణ వ్యవస్థ ఇబ్బందులకు లోనవుతుంది. చర్మ సమస్యలు పెరుగుతాయి.

వీటి మోతాదు పెంచాలి

- ఒమేగా3 పుష్కలంగా ఉండే సాల్మన్, మ్యాకెరల్ చేపలు
- ఆకుకూరలు
- వాల్‌నట్స్, బాదం
- షియా సీడ్స్, గుమ్మడి విత్తనాలు, అవిసె గింజలు
- యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండే దానిమ్మ, బెర్రీ, సిట్రస్ పండ్లు
- పసుపు, దాల్చినచెక్క, వెల్లుల్లి, అల్లం
- బ్రౌన్ రైస్, మిల్లెట్స్, హోల్ వీట్ ఆటా, దంపుడు బియ్యం
- సెనగలు, బొబ్బర్లు, అలసందలు
- పెరుగు, మజ్జిగ

విటమిన్ డి లోపంతో...

ఇన్‌ఫ్లమేషన్‌కు మరొక ప్రధాన కారణం విటమిన్ డి లోపం. కాబట్టి ప్రతి ఒక్కరూ విటమిన్ డి మోతాదును పరీక్షించుకుని, అవసరం మేరకు సప్లిమెంట్ల రూపంలో ఈ విటమిన్ భర్తీ చేసుకుంటూ ఉండాలి. మనం ప్రధానంగా నిర్లక్ష్యం చేసే మరొక మినరల్ మెగ్నీషియం. ఈ లోపాన్ని భర్తీ చేసుకోవడం కోసం గుమ్మడి విత్తనాలు, పుచ్చ విత్తనాలు తీసుకోవాలి.

- కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్స్, గానుగ నూనెలు, బెల్లం, దంపుడు బియ్యం
- ప్రతి రోజూ 5 నుంచి 7 రకాల కూరగాయలు, పండ్లు తినాలి
- వంటకాల్లో పసుపు, దాల్చినచెక్క, అల్లం ఎక్కువగా వాడాలి

ఇవి వద్దే వద్దు

- హాట్ డాగ్, సాసేజ్, బేకన్ లాంటి ప్రాసెస్డ్ మీట్స్
- తెల్లని చక్కెర, హై ఫ్రక్టోజ్ కార్న్ సిరప్ లాంటి రిఫైన్డ్ షుగర్స్
- లాక్టోజ్ ఇంటాలరెన్స్ కలిగి ఉండేవాళ్లు పాల ఉత్పత్తులు తీసుకోకూడదు
- సోడియం ఎక్కువగా ఉండే ప్రాసెస్డ్, క్యాన్డ్ ఫుడ్స్
- పిజ్జాలు, బర్గర్లు లాంటి బేక్ చేసిన స్నాక్స్, పదార్థాలు
- శీతల పానీయాలు
- గ్లూటెన్ పడనివాళ్లు గోధుమలు, మైదాలతో తయారయ్యే పదార్థాలకు దూరంగా ఉండాలి

యాంటీ ఇన్‌ఫ్లమేటరీ డైట్‌తో...

ఈ డైట్‌తో ఒబేసిటీ అదుపులోకి రావడంతో పాటు మరెన్నో ఆరోగ్యపరమైన ప్రయోజనా లుంటాయి. అవేంటంటే...

- **తీవ్ర రుగ్మతలు:** గుండె జబ్బులు, కేన్సర్లు, ఆటో ఇమ్యూన్ ముప్పులు తగ్గుతాయి
- ఇమ్యూనిటీతో పాటు, చర్మ ఆరోగ్యం, శక్తి మోతాదులు కూడా పెరుగుతాయి
- క్యాలరీలు తక్కువ, పీచు ఎక్కువ కాబట్టి బరువు తగ్గుతారు



డాక్టర్ సుజాత స్టీఫెన్
క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్
మలక్ పేట, హైదరాబాద్.

హెల్దీ ఫుడ్

వీటిలో ప్రొటీన్ పుష్కలం!

మాంసాహారంలోనే కాదు శాకాహారంలోనూ మాంసకృత్తులు ఉంటాయి. ఈ పోషకాలు ఎక్కువ పరిమాణంలో ఉండే పదార్థాల గురించి తెలుసుకుని క్రమం తప్పక తింటూ ఉంటే బలహీనత దరి చేరదు.

- **చిక్కుళ్లు:** ఒక కప్పు చిక్కుళ్లలో 15 గ్రాములు ప్రొటీన్లు ఉంటాయి. పీచు, ఫోలేట్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, మాంగనీసు మొదలైన ఖనిజ లవణాలు చిక్కుళ్లలో ఉంటాయి. ఈ పోషకాలు సమృద్ధిగా అందాలంటే చిక్కుళ్లను వేయించకుండా ఆవిరి మీద ఉడికించుకుని లేదా కూరగా, స్టిర్ ఫ్రై రూపంలో తినాలి.
- **సబ్జా:** 30 గ్రాముల సబ్జాలో 4 గ్రాములు ప్రొటీన్ ఉంటుంది. క్యాల్షియం, ఫైబర్, ఫాస్ఫరస్, మెగ్నీషియం కూడా సబ్జాలో ఉంటాయి. స్మూదీ, సలాడ్స్ సూప్స్ లేదా నీళ్లలో నానబెట్టి తీసుకోవచ్చు.
- **క్వినోవా:** ఒక కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. వీటిలో మెగ్నీషియం, ఫాస్ఫరస్, మాంగనీసు కూడా ఉంటాయి. అన్నం బదులుగా తినవచ్చు.



స్ట్రెస్ ఫ్రీ

ఒత్తిడితో చిత్తు కాకుండా...

రోజు మొత్తంలో ఏదో ఒక సందర్భంలో ఒత్తిడి ఎదుర్కొంటాం. కానీ అదే పనిగా ఒత్తిడికి గురవుతుంటే, ఆ ప్రభావం కచ్చితంగా శరీరం మీద పడుతుంది. ఫలితంగా మైగ్రెయిన్ మొదలు రక్తపోటు, మధుమేహం, ఊబకాయం వరకూ రకరకాల సమస్యలు బాధించడం మొదలు పెడతాయి. ఒత్తిడి ప్రభావం గుండె మీద కూడా ఎక్కువే! కాబట్టి ఒత్తిడిని చిత్తు చేసే చిట్కాలు ఆచరించాలి.

- **టైమ్ మేనేజ్‌మెంట్:** ప్రాధామ్యాలను క్రమానుగుణంగా ఏర్పరుచుకోవడంలో మనం పొరపాటు పడుతూ ఉంటాం. ఏ పని ముందు చేయాలి? ఏ పనిని వాయిదా వేయవచ్చు? ఏ పని ముఖ్యం? అనే విశ్లేషణ కొరవడి, కంగారు పడిపోతూ ఉంటాం. ఈ కంగారులో ప్రాముఖ్యత లేని పనుల కోసం సమయం వృథా చేస్తాం. ఫలితంగా ముఖ్యమైన పనులకు సమయం కేటాయించలేక ఒత్తిడికి లోనవుతాం. ఇలా అనవసర ఒత్తిడికి గురి కాకుండా ఉండాలంటే పనులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేసే అలవాటు అలవరుచుకోవాలి.
- **ధ్యానం:** మానసిక ప్రశాంతతతో ఒత్తిడిని జయించవచ్చు. ఇందుకోసం ధ్యానం, బ్రీదింగ్ ఎక్సర్‌సైజులు చేయవచ్చు. ఒత్తిడి వల్ల మనం ఊపిరి తీసుకునే తీరు మారుతుంది. త్వరత్వరంగా ఊపిరి పీల్చడం, వదలడం చేస్తాం. గాలిని కూడా శక్తి మేరకు లోపలికి పీల్చం. ఫలితంగా సరిపడా ఆక్సిజన్ రక్తంలో కలవదు. దాంతో మెదడు పనితీరు తగ్గుతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ఊపిరి మీద దృష్టి పెట్టాలి. రోజులో వీలైనన్నిసార్లు గుండెల్నిండా ఊపిరి పీల్చుకుని వదులుతూ ఉండాలి. గాలి లోపలికి పీల్చుకున్నప్పుడు కొన్ని క్షణాలు బిగించి ఉంచి, వదలడం సాధన చేయాలి.
- **చిన్న చిన్న ఆనందాలు:** అదే పనిగా గంటల తరబడి పనిలో మునిగి తేలడం సరి కాదు. ఎంత పని ఒత్తిడిలో ఉన్నా మధ్యమధ్యలో కొన్ని నిమిషాలపాటు బ్రేక్ తీసుకోవాలి. ఆ బ్రేక్‌లో నచ్చిన వ్యక్తులతో కలిసి ఆహ్లాదంగా నవ్వుకోవాలి. నవ్వు తెప్పించే పుస్తకం తిరగేయాలి. అవేవీ వీలు కాకపోతే కొన్ని నిమిషాలు నడవాలి.
- **సంగీతం వినాలి:** ఒత్తిడిని తొలగించే సాధనాల్లో సంగీతం ఒకటి. కాబట్టి నచ్చిన పాటలతో ప్లే లిస్ట్ తయారు చేసుకుని తీరిక వేళల్లో వినాలి. ఉదయం ఆఫీసుకు రెడీ అయ్యే సమయంలో, భోజనం చేస్తున్నప్పుడు, కుటుంబంతో గడిపేటప్పుడు ఈ పాటలు ప్లే చేసుకోవాలి. ఇలా ఆహ్లాదం కలిగించే పాటలు వినడం వల్ల మనసు తేలిక అవుతుంది. ఫలితంగా ఒత్తిడి వదులుతుంది.




డయాగ్నొస్టిక్స్

పరీక్షలతో ఆరోగ్యరక్షణ!

వయసుల వారీగా వేధించే ఆరోగ్య సమస్యలకు ముందుగానే అడ్డుకట్ట వేయాలంటే, వాటిని పసిగట్టే వీలున్న ఈ పరీక్షలు వయసుల వారీగా చేయించుకుంటూ ఉండాలి.

- 18వ ఏడులో అడుగుపెట్టినప్పటి నుంచి ప్రతి రెండేళ్లకోసారి బ్లడ్ ప్రెషర్ చెక్ చేయించుకుంటూ ఉండాలి.
- 20వ ఏట నుంచి ప్రతి ఐదేళ్లకోసారి కొలెస్ట్రాల్ పరీక్ష చేయించుకుంటూ ఉంటే గుండె జబ్బుల ప్రమాదాన్ని ముందుగానే నియంత్రించవచ్చు. ఇదే వయసునుంచి మొదలుపెట్టి 40 ఏళ్లకు చేరుకునేవరకూ ప్రతి మూడేళ్లకోసారి క్లినికల్ బ్రెస్ట్ ఎగ్జామ్, మామోగ్రామ్ స్క్రీనింగ్ చేయించుకుంటూ ఉంటే రొమ్ము కేన్సర్‌ను నియంత్రించవచ్చు.
- 21వ ఏళ్ల నుంచి ప్రతి రెండేళ్లకోసారి పాప్‌స్మియర్, పెల్విక్ పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. ఈ పరీక్షతో కణాల మార్పులను కనిపెట్టి సర్విక్స్ కేన్సర్ వచ్చే అవకాశాలను ముందుగానే కనిపెట్టవచ్చు.
- 45 ఏళ్ల వయసునుంచి ప్రతి మూడేళ్లకూ బ్లడ్ గ్లూకోజ్ టెస్ట్ చేయించుకుంటూ ఉంటే, ప్రీ డయాబెటిస్‌ను గుర్తించవచ్చు.
- 50 ఏళ్ల మహిళల్లో మెనోపాజ్ వల్ల ఎముకల సాంద్రత తగ్గుతుంది. కాబట్టి ఆస్టియోపొరోసిస్‌ను గుర్తించటం కోసం ఏడాదికోసారి బోన్ డెన్సిటీ టెస్ట్ చేయించుకుంటూ ఉండాలి.



ఐ కేర్

కూలింగ్ గ్లాసెస్ అవసరమే!

ఎండాకాలమే కాదు, అన్ని కాలాల్లోనూ చలువ కళ్లజోడు ఉపయోగకరమే! అన్ని కాలాల్లోనూ ఎండలో అతినీలలోహిత కిరణాలు, రేడియేషన్ కలిసి ఉంటాయి. కాబట్టి వాటి నుంచి కళ్లకు రక్షణ కల్పించాలంటే చలువ కళ్లద్దాలు ధరించాలి.

సాధారణంగా మార్కెట్లో ఎన్నో రకాల కూలింగ్ గ్లాసెస్ దొరుకుతూ ఉంటాయి. వాటిలో చవకవీ, ఖరీదైనవీ ఉంటాయి. వీటిలో ఏది కొనాలో అర్థం అవక, అయోమయానికి గురవుతూ ఉంటాం. అయితే చలువ కళ్లద్దాలు వేటితోనైనా కళ్లకు రక్షణ దొరుకుతుంది. అయితే వాటికి అతినీలలోహిత కిరణాలను ఆపే 'యువి ప్రొటెక్షన్' ఉందా? అనేది తెలుసుకోవాలి. చవక చలువ కళ్లద్దాలతో పోలిస్తూ ఖరీదైన ప్రముఖ కంపెనీ ఉత్పత్తులు ఈ ఫిల్మ్ విషయంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తాయి. కాబట్టి కళ్లకు పూర్తి రక్షణ కోరుకుంటే, మన్నికైన, నాణ్యమైన కూలింగ్ గ్లాసెస్‌నే ఎంచుకోవాలి. తక్కువ ఖర్చులో చలువ కళ్లజోడు కొనే సమయంలో వాటి అద్దాల నాణ్యత పరిశీలించాలి. చత్వారం ఉన్న వాళ్లు ఎండ సోకితే నల్లబడే 'ఫొటోక్రోమ్' జోడు ఎంచుకోవాలి.



హెల్త్ వెల్త్



కాగులెంట్స్ వల్లే రక్తం ద్రవ రూపంలో ఉంటుంది. రక్తంలో ఉండే కాగ్యులెంట్స్, ప్లేట్‌లెట్లు రక్తస్రావాన్ని నియంత్రిస్తూ ఉంటాయి. అయితే ఏ కారణంగానైనా ఇవి హెచ్చుతగ్గులకు గురైనప్పుడు రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడతాయి. ఈ పరిస్థితి తలెత్తకుండా బ్లడ్ థిన్నర్స్ ఉపయోగపడతాయి.

బ్లడ్ థిన్నర్స్ ఎందుకు?

మధుమేహం, అధిక రక్తపోటు, ధూమపానం, అధిక కొలెస్ట్రాల్, అతి ఒత్తిడి వంటి కారణాల వల్ల రక్తనాళాల్లోని లోపలి పొరలో ఉండే ఎండోథీలియం కణాలు దెబ్బతింటాయి. ఇవే కాకుండా, శరీరక శ్రమ లోపించడం, స్థూలకాయం వల్ల కూడా ఈ స్థితి ఏర్పడుతుంది. ఎండోథీలియం కణాలు దెబ్బ తిన్నప్పుడు రక్తం చిక్కబడటం, గడ్డలు కట్టడం జరుగుతుంది. ఈ గడ్డలు గుండె రక్తనాళాల్లో అడ్డుపడి గుండెపోటుకు కారణం కావచ్చు. మెదడు రక్తనాళాల్లో అడ్డుపడి పక్షవాతానికి కారణం కావచ్చు. అయితే, గడ్డలు ఏర్పడకుండా యాంటీ కాగులెంట్లను, ప్లేట్‌లెట్ల అసహజ ధోరణిని నివారించడానికి యాంటీ ప్లేట్‌లెట్లను ఇవ్వాల్సి ఉంటుంది.

బ్లడ్ థిన్నర్లు అందుకే...

సాధారణంగా రక్తాన్ని పలచబరిచే బ్లడ్ థిన్నర్లను రెండవ దశ వైద్యంగానే ఇస్తారు. అంటే యాంజియోప్లాస్టీ, లేదా స్టెంట్‌లు వేసిన తర్వాత ఇస్తూ ఉంటారు. ఈ మందులను కనీసం ఏడాదిపాటైనా, క్రమం తప్పకుండా వాడుకోవలసి ఉంటుంది. దెబ్బతిన్న గుండె కవాటాలకు చికిత్స పొందిన వాళ్లయితే ఈ మందులను జీవితకాలమంతా వాడాల్సి ఉంటుంది. కాలి నరాల్లో రక్తం గడ్డలు కట్టినప్పుడు(థ్రాంబోసిస్), అవి కరిగిపోవడానికి ఈ మందులు 6 మాసాల పాటు వాడాల్సి ఉంటుంది. రక్తం గడ్డకట్టుకుపోవడం వల్ల కొందరి గుండె లయ తప్పుతూ ఉంటుంది. అలాంటి వారికి కూడా యాంటీ కాగ్యులెంట్లు, నావల్-యాంటీ కాగ్యులెంట్ల వంటి మందుల వల్ల ప్రయోజనం కలుగుతుంది.

> **రక్తం పలచగా ఉండడం వల్ల ఎముకలు, పొట్ట, చర్మం, మెదడు భాగాల్లో అతిగా రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. అందువల్ల ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా పలు విధాలా ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.**

జాగ్రత్తలు తప్పవు!

బ్లడ్ థిన్నర్ల వల్ల ఎంతో మంది హృద్రోగులకు ప్రయోజనం కలుగుతుందనేది వాస్తవం. అయితే, కొంత మంది హృద్రోగులు వీటి దుష్ప్రభావాలకు గురయ్యే ప్రమాదం కూడా ఉంది. ముఖ్యంగా రక్తం పలచగా ఉండడం వల్ల ఎముకలు, పొట్ట, చర్మం, మెదడు భాగాల్లో అతిగా రక్తస్రావం జరిగే ప్రమాదం ఉంది. అయితే, రోగి పడిపోయి గాయాల పాలై, లేదా మరేదైనా ప్రమాదానికి గురైనప్పుడే ఈ దుష్ప్రభావాలు ఎక్కువగా కనిపిస్తాయి. అందువల్ల ఇలాంటి ప్రమాదాల బారిన పడకుండా పలు విధాల ముందు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం. అలాగే ఏదైనా సర్జరీ జరగడానికి, లేదా దంతాలను తొలగించడానికి ముందు బ్లడ్ థిన్నర్ మందులను ఆపాల్సి ఉంటుంది. సర్జరీ అయిపోయాక మందులను వేసుకోవడం మళ్లీ కొనసాగించవచ్చు. ఈ కొన్ని జాగ్రత్తలు పాటిస్తే, బ్లడ్ థిన్నర్ల ద్వారా అనేక ప్రయోజనాలు, అవసరమైన ఆరోగ్య రక్షణ పొందవచ్చు.

లంగ్ కేన్సర్ అవేర్‌నెస్ మంత్



ఊపిరితిత్తులకు ప్రథమ శత్రువు ధూమపానం ఒక్కటే కాదు. వాతావరణ కాలుష్యం మొదలు ఎన్నో రకాల ముప్పులు లంగ్స్‌కు పొంచి ఉంటాయి. వాటిని తొలగించుకుంటూ ప్రధానంగా లంగ్ కేన్సర్ ముప్పు నుంచి లంగ్స్‌ను కాపాడుకోవడం అవసరం.

లంగ్స్‌కు లక్ష ముప్పులు

ప్రపంచంలో రెండవ అత్యంత సాధారణ కేన్సర్... లంగ్ కేన్సర్. లంగ్ కేన్సర్ ప్రాణాంతకంగా మారే అవకాశాలు ఎక్కువ. కానీప్రారంభంలోనే లక్షణాలను గుర్తించి, చికిత్స మొదలుపెడితే ఈ కేన్సర్ నుంచి సురక్షితంగా బయటపడవచ్చు. అంతకంటే ముఖ్యంగా ఈ కేన్సర్‌కు గురి కాకుండా ఉండడం కోసం ముందస్తు జాగ్రత్తలు పాటించడం తప్పనిసరి. లంగ్ కేన్సర్ ముప్పును తెచ్చిపెట్టే కారకాలు కోకొల్లలు. అవేంటంటే...



గాలి కాలుష్యం: అత్యధిక ట్రాఫిక్, పారిశ్రామిక కార్యకలాపాలు జరుగుతూ ఉండే నగరాల్లో గాలి కలుషితమవుతూ ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో ధూళి కణాలు, రసాయనాలు లాంటివి కలిసిపోయి ఉంటాయి. ఇవి శ్వాసకోస సమస్యలు, కేన్సర్ ముప్పును పెంచుతాయి. నైట్రోజన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్‌లు దీర్ఘకాలంలో ఊపిరితిత్తుల్లోని కణజాలాన్ని దెబ్బతీసి, కేన్సర్ వ్యాధికి ఆస్కారం కల్పిస్తాయి. కాబట్టి ఇంట్లో నుంచి బయట అడుగుపెట్టిన ప్రతిసారీ మాస్క్ ధరించాలి.

సెకండ్‌హ్యాండ్ స్మోక్: ధూమపానం అలవాటు లేకపోయినా, ఆ అలవాటున్న వాళ్లు వదిలే పొగ పీల్చడం వల్ల కూడా లంగ్ కేన్సర్ సోకుతుంది. సిగరెట్ పొగలోని రసాయనాలు ఊపిరితిత్తుల్లోని కణాలను దెబ్బతీసి కేన్సర్ ముప్పును పెంచుతాయి. సెకండ్‌హ్యాండ్ స్మోక్‌కు క్రమంతప్పక బహిర్గతమయ్యేవాళ్లలో లంగ్ కేన్సర్ ముప్పు 30 శాతం మేరకు ఉంటుంది.

రాడాన్ గ్యాస్: ఈ అణుధార్మిక వాయువు సహజసిద్ధంగానే గాలిలో కలిసిపోయి ఉంటుంది. వాసన లేని ఈ వాయువును ప్రత్యేకమైన పరీక్షతో తప్ప పసిగట్టే వీలుండదు. ఈ వాయువు, లంగ్ కేన్సర్‌కు రెండవ ప్రధాన కారణం. కాబట్టి ఇంట్లో రాడాన్ గ్యాస్ పేరుకుపోకుండా, గాలి ధారాళంగా చొరబడేలా చూసుకోవాలి. ఎగ్జాస్ట్ ఫ్యాన్స్ వాడుకోవాలి.



వృత్తుల్లో: వృత్తిలో భాగంగా ప్రమాదకరమైనరసాయనాలు, అణువులకు బహిర్గతమయ్యేవారు కూడా లంగ్ కేన్సర్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువ. గనుల్లో పని చేసేవారు, భవన నిర్మాణ పనులు చేసేవారు, ఫ్యాక్టరీ వర్కర్లు యాస్‌బెస్టాస్, సిలికా డస్ట్, ఫార్మాల్డిహైడ్ రసాయనాలకు బహిర్గతమవుతూ ఉంటారు. ఈ పదార్థాలు లంగ్స్‌లోకి చేరుకుని, తీవ్రమైన ఇరిటేషన్ తలెత్తేలా చేసి, దీర్ఘకాలంలో లంగ్స్ గట్టిపడి, కేన్సర్‌కు దారి తీయడానికి దోహదపడతాయి.

స్మోకింగ్, వేపింగ్: ధూమపానంతో లంగ్ కేన్సర్ సోకుతుందనే విషయం అందరికీ తెలిసిందే! ధూమపానంతో కేన్సర్ కారకాలు లంగ్స్‌లోకి నేరుగా ప్రవేశించి అక్కడి నుంచి రక్తప్రవాహంలోకి చేరుకుంటాయి. ధూమపానంతో లంగ్స్‌లోని కణాలు దెబ్బతిని ఉత్పరివర్తనాలకు దారి తీస్తాయి. వేప్స్‌లోని ద్రవాల్లోని రసాయనాలు ఇన్‌ఫ్లమేషన్‌కు దారి తీస్తాయి.

కుటుంబ చరిత్ర: కుటుంబ చరిత్రలో కేన్సర్ ఉన్నప్పుడు, వారి సంతానానికి లంగ్ కేన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుంది. టాక్సిన్లను ప్రాసెస్ చేయడంలో, దెబ్బతిన్న కణాలను మరమ్మతు చేయడంలో జన్యువులు కీలక పాత్ర పోషిస్తాయి. కొన్ని సందర్భాల్లో వంశపారంపర్యంగా సంక్రమించిన జన్యు ఉత్పరివర్తనాలు లంగ్ కేన్సర్ వృద్ధికి తోడ్పడుతూ ఉంటాయి.

తీవ్ర శ్వాసకోస ఇన్‌ఫెక్షన్లు: బ్రాంకైటిస్, న్యుమోనియాలతో దీర్ఘకాలంలో లంగ్స్ బలహీనపడతాయి. ఇలాంటి ఇన్‌ఫెక్షన్లతో ఊపిరితిత్తుల్లోని కణజాలం దెబ్బతినడం వల్ల, పలురకాల వ్యాధులు, మరీ ముఖ్యంగా లంగ్ కేన్సర్ ముప్పు పెరుగుతుంది. మరీ ముఖ్యంగా క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మొనరీ డిసీజ్‌తో బాధపడేవాళ్ల ఊపిరితిత్తులు అప్పటికే బలహీనపడిపోయి ఉంటాయి కాబట్టి ఈ కోవకు చెందినవాళ్లకు లంగ్ కేన్సర్ ముప్పు ఎక్కువగా ఉంటుంది.

కస్తూరి వ్యాఖ్యలపై తెలుగు సంఘాల ఆగ్రహం

- తన మాటలను డీఎంకే వక్రీకరించిందని కస్తూరి ఆరోపణ
- తెలుగువారంటే తనకు గౌరవమంటూ వివరణ



చెన్నై, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తెలుగువారిని అవమానించేలా సినీ నటి కస్తూరి చేసిన వ్యాఖ్యలపై తెలుగు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా నెటిజన్లు ఆమెపై దుమ్మెత్తిపోశారు. దీంతో వెనక్కి తగ్గిన కస్తూరి.. తన వ్యాఖ్యలను డీఎంకే వారు వక్రీకరించి తప్పుడు ప్రచారం చేశారని, తనకు తెలుగువారంటే ఎంతో గౌరవమంటూ మీడియా ముందు వివరణ ఇచ్చారు. ఆదివారం చెన్నైలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. 300 ఏళ్ల కిందట ఒక రాజు వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి తెలుగు ప్రజలు వచ్చారని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' ఆ వ్యాఖ్యలను ప్రచురించింది. దీంతో కస్తూరిపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో కస్తూరి సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తన వ్యాఖ్యలను డీఎంకే వక్రీకరించి, ప్రచారం చేస్తోందని, తాను తెలుగు ప్రజలను కించపరిచేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదని పేర్కొన్నారు.

దీపావళి టపాసులను ఎందుకు అడ్డుకోలేదు

- ఢిల్లీ ప్రభుత్వం, పోలీసులకు సుప్రీం కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, నవంబరు 4: దీపావళి సమయంలో టపాసులు కాల్చకుండా వాటిని నిషేధించాలంటూ తామిచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఢిల్లీ ప్రభుత్వం, పోలీసులకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. వచ్చే సంవత్సరాల్లో అయినా ఈ నిషేధం సక్రమంగా అమలు చేయాలంటే తీసుకోవాల్సిన చర్యలను కూడా సూచించాలని కోరింది. ఢిల్లీలో గతంలో ఎన్నడూ లేనంత ఎక్కువగా కాలుష్యం ఉండటం చూస్తే తమ ఆదేశాలు అమలు కాలేదని అర్థమవుతోందని, దీని విషయంలో ఎలాంటి సందేహం లేదని సుప్రీం కోర్టు పేర్కొంది. టపాసుల నిషేధాన్ని ఎందుకు అమలు చేయలేదో సమగ్ర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను సుప్రీం ఆదేశించింది.

ఆటో కొనిస్తామని బాంబులపై కూర్చోబెట్టారు!

- దీపావళి వేడుకల్లో ఆకతాయిల చర్య.. యువకుడి మృతి

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకల్లో స్నేహితుల ఆకతాయి చేష్టలకు అందులో ఒకరు ప్రాణం కోల్పోయారు. బెంగళూరు కోణనకుంటెలోని వీవర్స్ కాలనీలో గత నెల 31వ తేదీ గురువారం రాత్రి ఈ విషాదం చోటుచేసుకుంది. స్నేహితులందరూ కలిసి మద్యం సేవించి.. టపాసులు పేల్చడం ప్రారంభించారు. ఓ డబ్బాకింద టపాసులు పెట్టి.. అవి పేలేదాకా కూర్చుంటే ఆటో కొనిస్తామని వారిలో ఒకరైన శబరీశ్ (32)తో పందెం కాశారు. ఆటో వస్తుందని ఆశపడిన శబరీశ్.. డబ్బా మీద కూర్చున్నాడు. వెంటనే బాణాసంచాకు నిప్పు పెట్టి.. మిత్రులందరూ కేరింతలు కొట్టారు. భారీ పేలుడు సంభవించడంతో శబరీశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. నిందితులు నవీన్, దినకర్, సత్యవేలు, కార్తీక్, సతీశ్, సంతోష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

పరికరాలకు అనుమతి ఉంటేనే విమానాల్లో 'వైఫై'

న్యూఢిల్లీ, నవంబరు 4: విమానాల్లో వైఫై వినియోగంపై కొత్త నిబంధన తీసుకొచ్చినట్టు సోమవారం కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఇంతవరకు ఉన్న నిబంధనల ప్రకారం విమానం 3,000 మీటర్ల కనీస ఎత్తులో ఎగురుతున్నప్పుడు మాత్రమే అందులో వైఫై వినియోగించడానికి అవకాశం ఉంది. దేశంలో కమ్యూనికేషన్ల వ్యవస్థకు అంతరాయం కలగకూడదన్న ఉద్దేశంతోనే ఆ నిబంధన పెట్టింది. ప్రస్తుతం ఆ నిబంధనల్లో సవరణ చేసింది. వైఫై సేవలు అందించే ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగానికి అనుమతి ఉన్నప్పుడు మాత్రమే కనీస ఎత్తులో కూడా వైఫైని వాడుకునే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

మా ఇంటికి ప్రధాని రావడం తప్పేమీ కాదు



అధికారాల విభజన ఉల్లంఘన కిందికి రాదు

● వ్యవస్థల మధ్య చర్చలు అవసరమే.. జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, నవంబరు 4: ప్రధాని నరేంద్ర మోదీ తన నివాసానికి రావడంలో తప్పేమీ లేదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ అన్నారు. జస్టిస్ చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణపతి పూజలకు ప్రధాని హాజరవడంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య చర్చలు జరుగుతుంటాయని, వాటిని గౌరవించాల్సి ఉంటుందని తెలిపారు. న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య అధికార విభజన ఉందని, దానిని ఉల్లంఘించేలా రెండు వ్యవస్థల అధిపతులు ఈ తరహాలో భేటీ కావడం సరికాదన్న విమర్శలకు కూడా ఆయన సమాధానం ఇచ్చారు. అధికారాల విభజనకు దీనికి సంబంధం లేదని అన్నారు. నిజానికి వ్యవస్థల మధ్య సమన్వయం అవసరమేనని చెప్పారు. ఇలాంటి సందర్భాల్లో రాజకీయ పరిపక్వతను ప్రదర్శించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సోమవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ "గణపతి పూజ నిమిత్తం ప్రధాని నా నివాసానికి రావడం తప్పేమీ కాదు. ఇలాంటివి జరుగుతునే ఉంటాయి. రాష్ట్రపతి భవన్‌లోనూ, రిపబ్లిక్ ఉత్సవాల్లోనూ కలిసి మాట్లాడుతునే ఉంటాం. ఇవేవీ కేసుల గురించి కాదు. జీవితాలు, సమాజం గురించి ముచ్చటిస్తుంటాం" అని అన్నారు. న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల గురించి చెబుతూ.. "అధికార విభజన అంటే న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు కలుసుకోకూడదన్న అర్థం కాదు. హేతుబద్ధమైన చర్చలు జరపకూడదనీ కాదు. రాష్ట్రాల్లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు పరిపాలన కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి వివిధ అంశాలపై చర్చలు జరపడం ఓ ప్రొటోకాల్‌గా ఉంది. కోర్టుల్లో మౌలిక సౌకర్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, బడ్జెట్ తదితర అంశాలపై చర్చిస్తారు. ప్రజల జీవితాలు, ఉపాధి కోసం రెండు వ్యవస్థల మధ్య సంభాషణలు అవసరమ"ని చెప్పారు. కార్యనిర్వాహక వ్యవస్థ తీర్పులు చెప్పదు..న్యాయవ్యవస్థ విధానాలను రూపొందించదు... దీనిని గుర్తుంచుకోవడమే అధికార విభజన అని వివరించారు. వీటిని అర్థం చేసుకోవడానికి రాజకీయ పరిపక్వత ఉండాలని అన్నారు. "మా రాతలను చూసే జడ్జీలను గౌరవిస్తారు. మేం తీసుకునే నిర్ణయాల్లో రహస్యం ఏమీ ఉండదు. అన్నీ సమీక్షకు లోబడేవే" అని చెప్పారు. అందువల్ల న్యాయమూర్తులపై నమ్మకం ఉంచాల్సిన అవసరం ఉందని అన్నారు. అయోధ్య తీర్పు సందర్భంగా దేవుడిని ప్రార్థించానంటూ జస్టిస్ చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యపైనా విమర్శలు వచ్చాయి. దీనిపై స్పందిస్తూ "సామాజిక మాధ్యమాలతో ఇదే సమస్య. ఏ సందర్భంలో మాట్లాడానో పట్టించుకోరు. నా స్వగ్రామం కన్హేర్‌సర్‌లో జరిగిన సన్మాన సభలో మాట్లాడాను. రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంపై తీర్పు రాసే ముందు మార్గం చూపించాలని దేవుడిని ప్రార్థించానని చెప్పాను. సంక్లిష్టమైన కేసుల్లో పరిష్కారం లభించనప్పుడు ఇలా చేస్తుంటాం. దీనిపైనా విమర్శలు చేశారు" అని వ్యాఖ్యానించారు.

ముడా కేసులో కర్ణాటక సీఎంకు నోటీసులు

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ముడా ఇంటి స్థలాల కేసును దర్యాప్తు చేస్తున్న లోకాయుక్త పోలీసులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీన మైసూరులోని లోకాయుక్త కార్యాలయానికి రావాలని ఆదేశించారు. ముడా పరిధిలో 14 ఇంటి స్థలాలను సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి కేటాయించడం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ కేసును ఓవైపు లోకాయుక్త, మరోవైపు ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. ఏ1 నిందితుడిగా ఉన్న సీఎం సిద్దరామయ్యకు లోకాయుక్త నోటీసులు జారీ చేయడంతో ప్రభుత్వానికి షాక్ ఇచ్చినట్టు అయింది. ఈ కేసులో ఏ2గా ఉన్న సిద్దరామయ్య భార్య పార్వతితోపాటు బావమరిది మల్లికార్జున స్వామి, భూమి విక్రయించిన దేవరాజ్‌ను ఇప్పటికే లోకాయుక్త విచారించింది. ఇక సిద్దరామయ్యను మాత్రమే విచారించాల్సి ఉంది. కాగా, ముఖ్యమంత్రి హోదాలో లోకాయుక్త ముందు సిద్దరామయ్య హాజరు కావడాన్ని విపక్షాలు ఆక్షేపిస్తున్నాయి. విచారణకు వెళ్లే ముందు సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

కుప్పకూలిన మిగ్- 29

ఆగ్రా, నవంబరు 4: భారత వైమానిక దళానికి చెందిన ఓ మిగ్-29 యుద్ధవిమానం ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో కుప్పకూలింది. సోమవారం సైనిక శిక్షణలో భాగంగా విన్యాసాల కోసం పంజాబ్‌లోని అదంపూర్ నుంచి ఆగ్రాకు బయలుదేరింది. ఆగ్రా సమీపంలోకి రాగానే సాంకేతిక లోపం తలెత్తి విమానం ప్రమాదానికి గురైంది. సోంగా గ్రామ సమీపంలోని పొలాల్లో కూలిపోయింది. దీంతో ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భారీ శబ్దాలు వచ్చాయని, క్షణాల్లోనే విమానం కాలిపోయిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదం నుంచి పైలట్ సురక్షితంగా బయటపడినట్టు భారత వైమానిక దళ అధికారులు మీడియాకు వెల్లడించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు. కాగా, 2నెలల క్రితం ఓ మిగ్-29 విమానం రాజస్థాన్‌లోని బర్మేర్‌లో కుప్పకూలింది.

హిందు ఐఏఎస్‌లతో వాట్సాప్ గ్రూప్

తిరువనంతపురం, నవంబరు 4: ఒక మతానికి చెందిన ఐఏఎస్ అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుకావడం చర్చనీయాంశంగా మారింది. అదీ ఒక ఐఏఎస్ అధికారి ఫోన్ నంబరుతో ఏర్పాటుకావడం విమర్శలకు తావిస్తోంది. 'మల్లు హిందు ఆఫీసర్స్' పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటైంది. కేరళ క్యాడర్‌కు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులను ఈ గ్రూప్‌లో గత నెల 31న చేర్చారు. అయితే ఇందులో కేవలం హిందూ అధికారులను మాత్రమే చేర్చడం విమర్శలకు దారితీసింది. ఐఏఎస్ అధికారి కె.గోపాలకృష్ణన్ వినియోగిస్తున్న ఫోన్ నంబరుతో ఏర్పాటైన ఈ గ్రూప్ పట్ల పలువురు అధికారుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంపై గోపాలకృష్ణన్ స్పందిస్తూ.. తన ఫోన్ హ్యాక్ అయిందని, తన అనుమతి లేకుండానే తన కాంటాక్ట్‌తో చాలా గ్రూప్‌లు ఏర్పాటైనట్టు పేర్కొన్నారు.

కీలక పత్రాల లీకేజీతో ఇజ్రాయెల్‌లో ప్రకంపనలు

- పీఎంవో అధికార ప్రతినిధి ఎలిఫెల్డ్ స్టెయిన్ అరెస్ట్
- లీకేజీతో కుదరని కాల్పుల విరమణ ఒప్పందం
- లీకేజీతో తమ స్టాఫ్‌కు సంబంధం లేదన్న నెతన్యాహు



టెల్ అవీవ్, నవంబరు4: హమాస్, హెజ్‌బొల్లా మిలిటెంట్ సంస్థలతో భీకర యుద్ధం కొనసాగుతున్న వేళ కీలక పత్రాల లీకేజీ ఇజ్రాయెల్‌లో ప్రకంపనలు రేపుతోంది. గాజా దాడుల్లో లభ్యమైన కీలక సమాచారాన్ని తమకు అనుకూలంగా మార్చుకుని మీడియాలో ప్రచారం చేసుకున్నారని నెతన్యాహు ప్రభుత్వంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగా హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదరక, బందీల విడుదల సాధ్యం కాలేదని వారి బంధువులు మండిపడుతున్నారు. బందీలను విడిపించేందుకు మధ్యవర్తులు తీవ్ర యత్నాలు చేస్తున్న తరుణంలో యూరప్ మీడియాకు ప్రధానమంత్రి కార్యాలయం నుంచి అధికార ప్రతినిధి ఎలిఫెల్డ్ స్టెయిన్ దేశ భద్రతాపరమైన అత్యంత రహస్య సమాచారాన్ని లీక్ చేశారని వెల్లడైంది. స్టెయిన్ అరెస్ట్ తర్వాత భద్రతా సంస్థల్లో పనిచేసే మరో ముగ్గురు అధికారులకు కూడా ఈ సమాచారం లీక్ చేసిన ఘటనతో సంబంధం ఉందని తేలింది. లీకేజీ ఘటనపై సంయుక్త దర్యాప్తునకు ఇజ్రాయెల్ కోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. నెతన్యాహు తన రాజకీయ ప్రయోజనాల కోసం బందీల ప్రాణాలను పణంగా పెట్టడంతో పాటు దేశ భద్రతపై రాజీపడ్డారని ప్రతిపక్షాలు ఆరోపించాయి. నెతన్యాహు ప్రమేయం లేకుండా లీకేజీలు ఎలా జరుగుతాయని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. లీకేజీ ఘటనపై లోతుగా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశాయి. ప్రతిపక్షాలు చేస్తున్న లీకేజీ ఆరోపణలను ప్రధాని నెతన్యాహు కొట్టిపారేశారు. తమ సిబ్బంది ప్రమేయం లేదని తేల్చి చెప్పారు. లీకేజీకి సంబంధించి మీడియా కథనాల్లో చూశాకే తనకూ తెలిసిందన్నారు. బందీలను నాటి హమాస్ చీఫ్ సిన్వర్ రక్షణగా చేసుకుని వారిని ఇరాన్‌కు తరలించాలని పథకం రచించారని నాడు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. హమాస్ లక్ష్యాలు నెరవేరే వరకు బందీలను ఎట్టి పరిస్థితుల్లోనూ విడుదల చేయవద్దని సిన్వర్ ఆదేశించినట్లుగా కూడా కథనాల్లో ఉంది.

ఆ మహిళ ఎక్కడ?

- ఇరాన్‌లో మోరల్ పోలీసుల వేధింపులపై ఓ వర్సిటీలో మహిళ అర్ధనగ్నంగా నిరసన.. అరెస్టు చేసిన అధికారులు
- 2 రోజులైనా తెలియని ఆచూకీ.. విడుదలకు డిమాండ్



ఇస్లామిక్ ఆజాద్ వర్సిటీలో మహిళ నిరసన

న్యూఢిల్లీ, నవంబరు 4: ఇరాన్‌లో రెండు రోజుల క్రితం నైతికత(మోరల్) పోలీసుల వేధింపులకు వ్యతిరేకంగా అర్ధనగ్నంగా నిరసన ప్రదర్శన చేపట్టిన మహిళ ఆచూకీ ప్రస్తుతం తెలియరావడం లేదు. ఆమె ఎక్కడున్నదనే దానిపై స్పష్టత లేదు. టెహ్రాన్‌లోని ఇస్లామిక్ ఆజాద్ యూనివర్సిటీలో మహిళ చేపట్టిన నిరసనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. కొంత మంది సాధారణ దుస్తుల్లో ఉన్న వ్యక్తులు ఆమెను కారులో ఎక్కించి, గుర్తుతెలియని ప్రాంతానికి తీసుకెళ్లినట్లు వీడియో ఫుటేజీ చూపిస్తోంది. సదరు మహిళ హిజాబ్, దుస్తులను చింపి వేధించారనే ఆరోపణలు వచ్చాయి. మహిళ ఆచూకీ తెలియకపోవడంపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇరాన్ చాప్టర్ స్పందిస్తూ.. ఆమెను వెంటనే విడుదల చేయాలని, వేధింపులు నుంచి కాపాడాలని డిమాండ్ చేసింది. రెస్టు సమయంలో కొట్టినట్లు, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై స్వతంత్ర, నిష్పక్షపాత విచారణ చేయాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనను నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఐరాస ప్రతినిధి మైనటో తెలిపారు.

నవ్య | చిత్రజ్యోతి

వేదం కాంబినేషన్



'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రం వచ్చి ఏడాది దాటింది. అప్పటి నుంచి అనుష్క నటించిన సినిమా ఏదీ రాలేదు. ఆమె కొత్త సినిమాల గురించి వార్తలు వినిపించాయి. వాటి మీద సోషల్ మీడియాలో చర్చ కూడా జరిగింది. ఇప్పుడు ఉన్నట్టుండి 'ఘాటీ' అంటూ ఓ భారీ బడ్జెట్ చిత్రం న్యూస్ వచ్చింది. ఈ సినిమాకు క్రిష్ దర్శకుడు. విమర్శకుల ప్రశంసలు పొంది, కమర్షియల్‌గా కూడా హిట్ అయిన 'వేదం' చిత్రం తర్వాత అనుష్క, క్రిష్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో 'ఘాటీ' మీద అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పటికే చాలా భాగం వర్క్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం షూటింగ్ ఈ నెల ఏడుతో పూర్తవుతుందట. ఆ రోజే అనుష్క పుట్టినరోజు కావడంతో సినిమా ఫస్ట్ లుక్‌ను, 'ఏ స్పెషల్ గ్లింప్స్ ఇన్ టు ద వరల్డ్'ని విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు కూడా ఆ రోజే వెల్లడించనున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా 'ఘాటీ' చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.



ప్లాన్ చేస్తే విజయాలు రావు

దుల్కర్ సల్మాన్

'మనం ప్లాన్ చేస్తే విజయాలు రావు. మంచి సినిమాలు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాను. కష్టానికి తగ్గ ఫలితం దక్కుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది' అని దుల్కర్ సల్మాన్ అన్నారు. 'మహానటి, సీతారామం' చిత్రాల తర్వాత ఆయన నటించిన 'లక్కీ భాస్కర్' ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- దర్శకుడు వెంకీ అట్లూరి కథ చెబుతున్నప్పుడే మనసులో ఈ సినిమా చేయాలని నిర్ణయించుకున్నాను. బ్యాంకింగ్ నేపథ్యాన్ని తీసుకొని మధ్య తరగతి కుటుంబాల కథ చెప్పడం కొత్తగా అనిపించింది. ఎప్పటి నుంచో వాస్తవానికి దగ్గరగా ఉండే ఓ మధ్యతరగతి తండ్రి పాత్ర చేయాలనుకుంటున్నాను. అది ఈ సినిమాతో నెరవేరింది. నా దృష్టిలో ఇది వాస్తవకథ హర్షద్ మెహతా లాంటివాడు భారీ స్కాం చేస్తుంటే ఒక చిన్నబ్యాంక్ ఉద్యోగి తన పరిధిలో స్కాం చేయడం అనేది కొత్త పాయింట్. కథ పైన వెంకీ ఎంతో రీసెర్చ్ చేశాడు. ఈ సినిమా కథలో ఎలాంటి తప్పు లేదని బ్యాంకింగ్ నిపుణులు చెప్పారు. సినిమా ప్రతి దశలో ఎంజాయ్ చేశాను. సినిమా విజయం ఎంతో సంతృప్తిని ఇచ్చింది.
- మమ్ముట్టి గారి అబ్బాయినే అయినా నేను కూడా అందరిలానే ఆలోచిస్తాను. కాలేజ్ రోజుల్లో ఉన్నప్పుడు లాటరీ తగిలితే సొంతంగా నచ్చినవన్నీ కొనుక్కోవచ్చు అని కలలు కనేవాణ్ణి. నాన్నకు 'లక్కీ భాస్కర్' బాగా నచ్చింది. సినిమా చూశాక వెంకీతో మాట్లాడారు. ఎంతగానో మెచ్చుకున్నారు. ప్రస్తుతం తెలుగులో 'ఆకాశంలో ఒక తార' చిత్రం చేస్తున్నాను.



ఇన్ ప్రోగ్రెస్

సాయి దుర్గా తేజ్ మూవీలో...



'విరూపాక్ష', 'బ్రో' బ్లాక్‌బస్టర్ విజయాల తర్వాత సాయి దుర్గా తేజ్ చేస్తున్న కొత్త ప్రాజెక్ట్ 'ఎస్‌డిటి18'. ఈ పాన్ ఇండియా మూవీని రోహిత్ కేపీ దర్శకత్వంలో కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇందులో సాయి దుర్గా తేజ్ మునుపెన్నడూ చేయని పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారు. హీరోయిన్‌గా ఐశ్వర్య లక్ష్మీ నటిస్తున్నారు. ఈ మూవీలో నటుడు జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. రగ్గడ్ లుక్‌లో ప్రెజెంట్ చేసిన జగపతిబాబు ఇంట్రో పోస్టర్ చాలా క్యూరియాసిటీని పెంచింది.

హరుడైన నరుడు



'గంగమ్మ తల్లిని తెలుగు ప్రజలు ఎంతగానో ఆరాధిస్తారు. ఆ అమ్మవారి కథతో తీసిన చిత్రమే 'జాతర'' అని సతీశ్ బాబు రాటకొండ అన్నారు. ఆయన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 8న విడుదలవుతోన్న సందర్భంగా సతీశ్‌బాబు మీడియాతో ముచ్చటించారు.

- వాస్తవ సంఘటనల ఆధారంగా రాసుకున్న కథతో తెరకెక్కిన చిత్రం 'జాతర'. ఒక మనిషి రాక్షసుడై అమ్మవారిని చెరపడితే మరో నరుడు హరుడై ఆ రాక్షసుణ్ణి ఎలా సంహరించాడు అనేది మా సినిమాలో వినోదాత్మకంగా చూపించబోతున్నాం.
- హీరో క్యారెక్టర్ మూడు డైమెన్షన్స్‌లో ఉంటుంది. అతను ఒక ఫేజ్ నుంచి మరో ఫేజ్‌కు వెళ్లేందుకు ప్రేమ అనేది ఒక మీడియంలా ఉంటుంది.

విడుదలకు సీక్వెల్



గతేడాది తమిళంలో విజయం సాధించి తెలుగు ప్రేక్షకులను సైతం ఆకట్టుకున్న చిత్రం 'విడుదల'. దీనికి సీక్వెల్‌గా రూపొందిన సినిమా 'విడుదల 2'. వెట్రీ మారన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి నటించారు. సినిమాను తెలుగులో విడుదల చేసే అవకాశాన్ని ప్రముఖ నిర్మాత చింతపల్లి రామారావు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'డిసెంబరు 20న 'విడుదల 2' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నాం. మంచి కమర్షియల్ వాల్యూస్ ఉన్న చిత్రమిది. ఇందులో విజయ్ సేతుపతి, సూరి నటన హైలెట్‌గా నిలుస్తాయి' అని తెలిపారు.

మహాశివరాత్రికి తమ్ముడు




పవన్‌కల్యాణ్ హీరోగా గతంలో 'తమ్ముడు' పేరుతో ఓ సినిమా వచ్చింది. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు అదే టైటిల్‌తో మరో సినిమా వస్తోంది. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీరామ్ వేణు దర్శకత్వంలో దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరిలో ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటిస్తూ రిలీజ్ డేట్ పోస్టర్‌ను కూడా వదిలారు. కాగడా చేత పట్టిన నితిన్, భుజాన ఓ పాపను ఎత్తుకుని పరిగెడుతూ రావడం, ఆయనతో పాటు ఊరి ప్రజలు కూడా కాగడాలతో అనుసరిస్తుండడం ఆసక్తి కలిగిస్తోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న 56వ చిత్రమిదనీ, ఇందులో నటి లయ కీలక పాత్రను పోషిస్తోందనీ నిర్మాతలు వెల్లడించారు. 'వకీల్ సాబ్' చిత్రం తర్వాత దర్శకుడు శ్రీరామ్ వేణు రూపొందిస్తున్న చిత్రం కావడంతో 'తమ్ముడు' మీద భారీ అంచనాలు ఉన్నాయి.

టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో...



సైన్స్ ఫిక్షన్, మైథాలజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రం 'రహస్యం ఇదం జగత్'. కోమల్ ఆర్. భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మించారు. రాకేష్ గలేబి, స్రవంతి ప్రత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్య తారలు. ఈనెల 8న చిత్రం ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సినిమా కథానాయికలు మానస వీణ, స్రవంతి ప్రత్తిపాటి మీడియాతో ఆదివారం ముచ్చటించారు. 'మానస వీణ మాట్లాడుతూ 'ఇది నా తొలి ఫీచర్ ఫిల్మ్. ఇందులో అరుణి ఆచార్య అనే పాత్రలో నటించాను. ఈ పాత్ర నాకు పర్సనల్‌గా ఎంతో నచ్చింది. ముఖ్యంగా కథ వినగానే సైన్స్ ఫిక్షన్‌కు మైథాలజీని కనెక్ట్ చేసి టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో సినిమా నేపథ్యం ఉండటం నన్ను ఆకర్షించింది. ఈ చిత్రంలో నా పాత్ర కోసం రీసెర్చ్ కూడా చేశాను' అని చెప్పారు. స్రవంతి ప్రత్తిపాటి మాట్లాడుతూ 'ఈ చిత్రంలో నా పాత్ర పేరు అకిరా. తప్పకుండా ఈ పాత్ర అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ నాకు తాత వరుస అవుతారు. ఆయన సలహాలు, సూచనలు నా కెరీర్ కోసం తీసుకున్నాను' అని తెలిపారు.

గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో రజాకార్



భారతీయ చలన చిత్రోత్సవంలో రజాకార్ సినిమాకు గుర్తింపు దక్కింది. ప్రతి ఏడాది గోవాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ)లో ఉత్తమ తొలి దర్శకుడు(బెస్ట్ డెబ్యూ డైరెక్టర్) కేటగిరీకి ఈ సినిమా దర్శకుడు యాట సత్యనారాయణ నామినేట్ అయ్యారు. ఈ మేరకు సోమవారం కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉత్తమ తొలి దర్శకుల కేటగిరీలో నామినేట్ అయిన వారిలో రజాకార్ (తెలుగు) దర్శకుడు యాట సత్యనారాయణతో పాటు బూంగ్(మణిపురి) దర్శకురాలు లక్ష్మీప్రియా దేవి, ఘరత్ గణపతి(మరాఠీ) దర్శకుడు నవజ్యోత్ బండివాడేకర్, మిక్కా బన్నాద హక్కి (కన్నడ) దర్శకుడు మనోహర, థానుప్ (మలయాళం) దర్శకుడు రాగేశ్ నారాయణన్ ఉన్నారు. గోవాలో ఈ నెల 28న జరిగే ముగింపు వేడుకలో ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిని ఎంపిక చేస్తారు.

- న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

విభిన్న పాత్రల్లో వరుణ్



వరుణ్‌ధావన్, కీర్తిసురేశ్ జంటగా నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'బేబీ జాన్'. వామికా గబ్బి, జాకీ ష్రాఫ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డిసెంబర్ 25న విడుదలవుతోంది. చిత్రబృందం సోమవారం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. శక్తిమంతమైన పోలీసాఫీసర్‌గా, తండ్రిగా, వంటమనిషిగా విభిన్న పాత్రల్లో వరుణ్ కనిపించారు. కలీస్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. జియోస్టూడియోస్, అట్లీ సమర్పణలో ప్రియా అట్లీ, మురాద్ ఖేతనీ, జ్యోతిదేశ్‌పాండే నిర్మిస్తున్నారు.

స్పోర్ట్స్

ఆ ఇద్దరిని తీసుకోండి

న్యూఢిల్లీ: దేశంలో న్యూజిలాండ్ చేతిలో మాదిరి ఆస్ట్రేలియా పర్యటనలో ఘోర పరాజయం ఎదురు కాకుండా ఉండాలంటే పుజార, రహానెలను వెంటనే జట్టులోకి తీసుకోవాలని అభిమానులు డిమాండ్ చేస్తున్నారు. అయితే బోర్డర్-గవాస్కర్ సిరీ్‌స్‌కు జట్టును ఇప్పటికే ప్రకటించినందున పుజార, రహానెలకు అవకాశంలేదు. ఒకవేళ ఆసీస్‌తో సిరీస్‌కు వారిని తీసుకొని జట్టు విజయాలలో పుజార, రహానె రాణించారే అనుకుందాం. కానీ వారికి కూడా వయస్సు మీరుతోంది కదా. వారు మాత్రం ఎంతకాలం ఆడగలరు. అందువల్ల దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా గిల్, సర్ఫరాజ్, కేఎల్ రాహుల్‌పై ఎక్కువగా నమ్మకం ఉంచాలి. ఒకటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన వారిని పక్కనపెట్టకూడదు. పైగా అనుభవంతో వారు మరింత రాటుదేలతారు కూడా.

షమి రాక మరింత ఆలస్యం


బెంగళూరు: పోటీ క్రికెట్‌లోకి వెటరన్ పేసర్ షమి పునరాగమనం మరింత ఆలస్యం కానుంది. ఈ ఏడాది ఆరంభంలో పాదం గాయానికి షమి శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆటకు దూరంగా ఉన్నాడు. కోలుకున్న అతడు రంజీట్రోఫీ ద్వారా పునరాగమనం చేస్తాడని భావించారు. కానీ పూర్తి ఫిట్‌నెస్ సాధించకపోవడంతో కర్ణాటక, మధ్యప్రదేశ్‌లతో జరిగే రంజీ మ్యాచ్‌లకు షమిని బెంగాల్ జట్టుకు ఎంపిక చేయలేదు.

నెలాఖరున రియాద్‌లో ఐపీఎల్ వేలం?



న్యూఢిల్లీ: వచ్చే సీజన్ కోసం జరిగే ఐపీఎల్ మెగా వేలం ఈనెల 24, 25 తేదీల్లో జరిగే అవకాశాలున్నాయి. దీనికి సౌదీ రాజధాని రియాద్ వేదిక కానుంది. ఇప్పటికే పది ఫ్రాంచైజీలు కూడా తమ రిటెన్షన్ జాబితాను వెల్లడించాయి. మొత్తంగా 46 మంది ఆటగాళ్లను అట్టిపెట్టుకోగా, ఇందులో పది మంది విదేశీ క్రికెటర్లు ఉన్నారు. వీరిపై అన్ని జట్లు కలిపి రూ.558.5 కోట్లు వెచ్చించాయి. వేలంలోకి ఢిల్లీ, కోల్‌కతా, లఖ్‌నవూ కెప్టెన్లు పంత్, శ్రేయాస్, రాహుల్ రావడంతో కొత్త సారథుల కోసం చూస్తున్న జట్లు వీరికోసం పోటీపడనున్నాయి.

బ్రెజిలియన్ గ్రాండ్ ప్రీ విజేత వెర్‌స్టాపెన్




సావోపోలో: బ్రెజిలియన్ ఫార్ములావన్ గ్రాండ్ ప్రీ టైటిల్‌ను రెడ్‌బుల్ డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ సొంతం చేసుకొన్నాడు. దీంతో నాలుగోసారి ఎఫ్-1 చాంపియన్‌షిప్ గెలుచుకొనే అవకాశాలను మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. ఫైనల్ రేస్‌ను 17వ స్థానం నుంచి ప్రారంభించినా.. అద్భుత ప్రదర్శనతో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. అల్పైన్ రెనాల్ట్‌కు చెందిన డ్రైవర్లు ఎస్టిబన్ ఒకాన్, పెర్రీ గాస్లీ రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

మూలాలు మరిస్తే ఎలా..!



అశ్విన్



జడేజా



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం) >

న్యూజిలాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో ఘోర పరాభవం నేపథ్యంలో స్టార్ క్రికెటర్లు దేశవాళీల్లో.. ముఖ్యంగా రంజీట్రోఫీ ఆడడం తప్పనిసరి చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. భారత జట్టులోని పలువురు సీనియర్ ఆటగాళ్లు దేశవాళీ పోటీల గురించే మరిచిపోయారనడంలో అతిశయోక్తి లేదు. ప్రపంచ టెస్టు క్రికెట్‌లో స్పిన్నర్లను సమర్థంగా ఎదుర్కోవడంలో భారత ఆటగాళ్లకు మించినోళ్లు లేరని కొన్ని ఏళ్ల క్రితం మనోళ్లకు గొప్ప ఘనత ఉండేది. ఇప్పుడు..విదేశాల విషయం పక్కనబెడితే స్వదేశంలో టర్నింగ్ వికెట్లపై పరుగులు చేసేందుకు మన స్టార్ బ్యాటర్లు ఆపసోపాలు పడుతున్నారు. చాలా ఏళ్లుగా సీనియర్లు దేశవాళీ పోటీల్లో ఆడకపోవడానికి కిక్కిరిసిన అంతర్జాతీయ షెడ్యూల్ కూడా కారణం. అయినా..తీరిక చేసుకొని కనీసం ఒకటి రెండు మ్యాచ్‌ల్లోనైనా ఆడివుంటే న్యూజిలాండ్ స్పిన్నర్లను సమర్థంగా తిప్పికొట్టే వారేమో ! తీరికలేకుండా అంతర్జాతీయ షెడ్యూల్ ఉన్నా..గతంలో స్టార్ క్రికెటర్లు దేశవాళీ పోటీల్లో ఆడడానికి ప్రాధాన్యమిచ్చేవారు. సుదీర్ఘ దక్షిణాఫ్రికా పర్యటనను ముగించుకున్న భారత జట్టు 2007 జనవరి తొలివారంలో స్వదేశం తిరిగి వచ్చింది. ఇక.. వన్డే ప్రపంచ కప్ సన్నాహకాల్లో భాగంగా.. అదే జనవరి చివరి వారంలో వెస్టిండీస్‌తో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో భారత్ తలపడింది. జనవరి 21, 24, 27, 31 తేదీల్లో నాగ్‌పూర్, చెన్నై, కటక్, వదోదరలో ఆ మ్యాచ్‌లు ఆడింది. అప్పటి భారత జట్టులోని నలుగురు స్టార్లు సచిన్, జహీర్, అజిత్ అగార్కర్, గంగూలీ వదోదర నుంచి నేరుగా ముంబై చేరుకున్నారు. ఎందుకో తెలుసా? ఫిబ్రవరి రెండు నుంచి ఆరు వరకు జరిగే ప్రతిష్ఠాత్మక రంజీట్రోఫీ ఫైనల్లో తలపడే ముంబై-బెంగాల్ జట్ల తరపున ఆడేందుకు. ఆ మ్యాచ్‌లో టెండూల్కర్ శతకం సాధిస్తే, సౌరవ్ 90 పరుగులు చేశాడు. జహీర్ తగినన్ని వికెట్లు పడగొట్టాడు. రంజీట్రోఫీ తుది పోరు ముగిసిన 48 గంటల్లో సచిన్, దాదా, జహీర్ శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్‌లోనూ ఆడాల్సి ఉంది. అయినా రంజీట్రోఫీ బరిలో దిగడం దేశవాళీ టోర్నీకి వారు ఎంత ప్రాధాన్యమిచ్చారో అర్థమవుతుంది.

మరి ఇప్పుడో..

న్యూజిలాండ్‌తో టెస్ట్‌ల్లో ఘోరంగా ఓడిన టీమిండియాలోని పలువురు స్టార్ ఆటగాళ్లకు ఈసారి దులీప్ ట్రోఫీ నుంచి మినహాయింపు ఇవ్వడం గమనార్హం. దీనికి కొందరు 'పని భార నిర్వహణ' అని చెబుతున్నా.. టీ20 ప్రపంచ కప్ ముగిశాక, తర్వాత శ్రీలంకలో జరిగిన వన్డే సిరీస్‌కు మధ్య వారికి తగిన విరామమే లభించింది. దాంతో 'పనిభారం' పేరిట దులీప్ ట్రోఫీకి మినహాయింపు ఇవ్వడంపై ప్రస్తుతం తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. పేస్ దళ సారథిగా బుమ్రాకు 'పని భారం'తో దులీప్ ట్రోఫీకి తీసుకోకపోవడం సమంజసమే. కానీ కోహ్లీ, రోహిత్, అశ్విన్, జడేజాలకు టోర్నీ నుంచి మినహాయింపు ఇవ్వడంలో ఔచిత్యమేమిటి? 2000 సంవత్సరం ఏప్రిల్..తీవ్రమైన ఎండలో తమిళనాడుతో రంజీ సెమీస్‌లో సచిన్ అజేయ డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. మరో మూడ్రోజుల తర్వాత హైదరాబాద్‌తో రంజీట్రోఫీ ఫైనల్లోనూ టెండూల్కర్ పాల్గొని అర్ధ శతకం, శతకం చేసిన విషయాన్ని ఇక్కడ ప్రస్తావించాలి. మార్చి చివరి వారం వరకు జరిగిన వన్డేలలో ఆడి..ఆపై రెండు వారాల వ్యవధిలో సచిన్ రంజీట్రోఫీ సెమీస్, ఫైనల్ బరిలో దిగడాన్ని నేటి స్టార్ క్రికెటర్లు ఎందుకు ఆదర్శంగా తీసుకోరు? విరాట్ చివరిసారి 2013లో, రోహిత్ 2015లో రంజీట్రోఫీ బరిలో దిగారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఆ తర్వాత ఈ ఇద్దరు కూడా ఒకటే ఫస్ట్‌క్లాస్ మ్యాచ్ ఆడడం గమనార్హం. 24 ఏళ్ల తన కెరీర్‌లో తీరికలేని అంతర్జాతీయ షెడ్యూల్ ఉన్నా..200 టెస్టులు సహా 316 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడడం ఒక్క సచిన్‌కే చెల్లింది. మరోవైపు కోహ్లీ కేవలం 32 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో ఆడాడు. కానీ రోహిత్ కాస్త మెరుగ్గా 61 మ్యాచ్‌ల్లో పాల్గొన్నాడు. అయితే ఇప్పటి మాదిరి..సచిన్, లక్ష్మణ్, ద్రావిడ్, గంగూలీ కెరీర్ ఉచ్ఛ దశలో ఉన్న సమయంలో రెండు నెలల ఐపీఎల్, టీ20 మ్యాచ్‌లు ఉండేవి కావు. పనిభారం నిర్వహణ ముఖ్యమే. కానీ అత్యుత్తమ బ్యాటర్లు ఫామ్ కోల్పోయిన తరుణంలోనైనా దేశవాళీ పోటీల్లో ఆడాలనేది సర్వత్రా వినవస్తున్న అభిప్రాయం. ఇరానీ కప్ మ్యాచ్‌లో రెస్టాఫ్ ఇండియా తరఫున స్టార్ క్రికెటర్లు తప్పనిసరిగా ఆడేలా నిబంధన తీసుకురావాలనే సూచన వినవస్తోంది. ఆ సమయంలో టెస్ట్ మ్యాచ్‌ల షెడ్యూల్ లేకుండా బీసీసీఐ చూడాలి. ఏదేమైనా ఓ పెద్ద సిరీస్‌కు ముందు స్టార్ ఆటగాళ్లు ఒకట్రెండు దేశవాళీ పోటీలు ఆడడం తప్పనిసరి చేయాలి. దేశ క్రికెట్ సీజన్ అక్టోబరు నుంచి మార్చి వరకు ఉంటుంది. ఆ సమయంలో స్వదేశంలో టెస్ట్ సిరీస్‌కు ముందు రంజీట్రోఫీ ఒకటి రెండు రౌండ్లు ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. తద్వారా స్టార్ ఆటగాళ్లు ఆ పోటీలలో పాల్గొనే అవకాశం లభిస్తుంది.

క్రికెట్‌కు సాహా వీడ్కోలు



ఈ రంజీ సీజన్ కెరీర్‌లో చివరిదని ప్రకటన

న్యూఢిల్లీ: వెటరన్ వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలుకనున్నాడు. ప్రస్తుత రంజీ ట్రోఫీ సీజన్ అతడి కెరీర్‌లో చివరిది కానుంది. 'క్రికెట్‌లో నా అద్భుత ప్రయాణానికి ముగింపు పలుకబోతున్నాను. చివరిసారి రంజీల్లో బెంగాల్‌కు ఆడనున్నందుకు సంతోషంగా ఉంది. ఈ సీజన్‌ను మరపురానిదిగా మలిచేందుకు ప్రయత్నిద్దాం' అని 40 ఏళ్ల సాహా సోషల్ మీడియాలో ప్రకటించాడు. 2010లో భారత జట్టు తరఫున అరంగేట్రం చేసిన తను 40 టెస్టుల్లో 1353 పరుగులు, 9 వన్డేల్లో 41 పరుగులు సాధించాడు. ధోనీ రిటైర్మెంట్ తర్వాత సాహా జట్టు కీపర్‌గా సేవలందించినా.. పంత్ రాకతో స్థానం గల్లంతైంది. 2021లో చివరి టెస్టు ఆడాడు. ఇక ఐపీఎల్ ఆరంభం నుంచి అన్ని సీజన్లు ఆడిన సాహా ఈసారి వేలంలో తన పేరును నమోదు కూడా చేసుకోలేదు.



పుణె పాంచ్ పటాకా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ పుణెరి పల్టన్ ఈ సీజన్‌లో ఐదో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. సోమవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 49-30తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. యువ ఆటగాళ్లతో కూడిన పుణె సమష్టిగా ఆడి ఫలితం రాబట్టింది. పుణె జట్టులో ఆకాశ్ షిండే (11 పాయింట్లు) సూపర్ టెన్‌తో సత్తా చాటాడు. మరో మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ 36-32తో తమిళ్ తలైవా‌స్‌ను ఓడించింది.

పాక్‌పై చెమటోడ్చిన ఆసీస్

మెల్‌బోర్న్: పాకిస్థాన్‌తో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 2 వికెట్లతో అతికష్టంగా గెలిచింది. ముందుగా పాక్ 46.4 ఓవర్లలో 203 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ రిజ్వాన్ (44), నసీమ్ షా (40), బాబర్ (37) ఫర్వాలేదనిపించారు. స్వల్ప ఛేదనలో ఆసీస్ 33.3 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 204 రన్స్‌తో గట్టెక్కింది. ఇన్‌గ్లిస్ (49), స్మిత్ (44) ధాటిగా ఆడినా, ఓ దశలో 155/7 స్కోరుతో జట్టు ఓటమి దిశగా వెళ్లింది. అయితే చివర్లో కెప్టెన్ కమిన్స్ (32 నాటౌట్) టెయిలెండర్ల సహకారంతో విజయం అందించాడు.

ఇంగ్లండ్, ఆస్ట్రేలియాకు భారత్ ఆతిథ్యం



మహిళల ఎఫ్‌టీపీ విడుదల

దుబాయ్: మహిళల క్రికెట్ 2025-29 చక్రానికి సంబంధించిన భవిష్యత్ పర్యటనల షెడ్యూల్ (ఎఫ్‌టీపీ)ని ఐసీసీ విడుదల చేసింది. ఇందులో ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలతో భారత్ సొంతగడ్డపై సిరీస్‌లు ఆడనుంది. బంగ్లాదేశ్, జింబాబ్వేలతో కూడా భారత జట్టు తలపడనుంది. మొత్తం 11 జట్లకు సంబంధించిన అంతర్జాతీయ షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. కాగా, న్యూజిలాండ్, వెస్టిండీస్, ఐర్లాండ్, దక్షిణాఫ్రికాల్లో భారత జట్టు పర్యటించనుంది. మొత్తంగా ప్రతి జట్టు నాలుగేళ్ల చక్రంలో ఇంటా, బయటా నాలుగేసి సిరీస్‌ల చొప్పున ఆడనుంది. 2026లో జరిగే మహిళల టీ20 ప్రపంచకప్ ముందు జరిగే ముక్కోణపు సిరీస్‌లో ఇంగ్లండ్, న్యూజిలాండ్‌తో భారత్ తలపడనుంది. కొత్తగా టీ20 చాంపియన్స్ ట్రోఫీని కూడా ఐసీసీ ప్రకటించింది. 2027లో జరిగే ఈ టోర్నీకి శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనుండగా.. 6 జట్లు పాల్గొంటాయి. ఈ చక్రంలో మొత్తం 15 టెస్టులకు ఐసీసీ అవకాశం కల్పించింది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వెస్టిండీస్ మళ్లీ టెస్టు సిరీస్‌లు ఆడనుండడం విశేషం. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్), హండ్రెడ్, బిగ్‌బాష్ లీగ్‌లకు నిర్దుష్టమైన షెడ్యూల్‌ను ఐసీసీ కేటాయించింది. కొత్త చక్రంలో రెండు టీ20 వరల్డ్‌కప్‌లు (2026, 2028), రెండు వన్డే వరల్డ్‌కప్‌లు (2025, 2029), టీ20 చాంపియన్స్ ట్రోఫీ (2027) నిర్వహించనున్నారు. కాగా, జట్ల సంఖ్యను వన్డే ప్రపంచకప్‌లో పదికి, టీ20 వరల్డ్‌కప్‌లో 12కు పెంచనున్నారు.

బిజినెస్

లాభాల్లో హైదరాబాద్ విమానాశ్రయం

ఈ ఏడాది నుంచి డివిడెండ్ — జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

ముంబై: జీఎంఆర్ గ్రూప్ నిర్వహణలోని జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) లాభాల బాట పట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) నుంచి ఈ విమానాశ్రయం డివిడెండ్ చెల్లిస్తుందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సౌరభ్ చావ్లా ఎకనామిక్ టైమ్స్ పత్రికకు తెలిపారు. మరో రెండు మూడేళ్లలో తమ నిర్వహణలోని ఢిల్లీ ఎయిర్‌పోర్టూ లాభాల బాటపడుతుందన్నారు. అలాగే హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సెజ్‌లు, కార్యాలయ భవనాలు, విద్యా సంస్థలు, సీనియర్ సిటిజన్ల నివాస వసతుల కల్పన కోసం రూ.800 కోట్ల నుంచి రూ.900 కోట్లతో వివిధ నిర్మాణాలు చేపడుతున్నట్టు చావ్లా వెల్లడించారు.

భూముల నగదీకరణ: దీనికి తోడు వచ్చే ఐదేళ్లలో హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో 1,400 ఎకరాలు, ఢిల్లీ, గోవా ఎయిర్‌పోర్టులోని 200 ఎకరాలు, కొత్తగా ఏర్పాటు చేసే భోగాపురం ఎయిర్‌పోర్టులో 200 ఎకరాల్లో కొత్త వసతులు, నిర్మాణాలు చేపట్టి.. వాటి నుంచీ పెద్దఎత్తున ఆదాయ ఆర్జనకు కృషి చేస్తామని చావ్లా తెలిపారు. హైదరాబాద్, ఢిల్లీ విమానాశ్రయాల ఆధునీకరణ కోసం ఇప్పటి వరకు రూ.12,000 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు వెల్లడించారు.

అప్పుల భారం తగ్గింపే లక్ష్యం: అప్పుల భారం తగ్గించుకోవడమే లక్ష్యంగా ప్రస్తుతం తాము పని చేస్తున్నట్టు సౌరభ్ చావ్లా తెలిపారు. ఇటీవల అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) సమకూర్చిన రూ.6,300 కోట్ల దీర్ఘకాలిక రుణంతో కంపెనీకి పెద్ద మొత్తంలో వడ్డీలు, అప్పుల చెల్లింపుల భారం తగ్గుతుందన్నారు. ప్రస్తుతం కంపెనీ అప్పులు- స్థూల లాభం నిష్పత్తి 6 శాతంగా ఉంది. విమానాశ్రయేతర ఆదాయాల పెంపు చర్యలు, ఏడీఐఏ సమకూర్చిన రుణాలతో వచ్చే రెండు మూడు సంవత్సరాల్లో ఇది 3.5 నుంచి 5 శాతానికి తగ్గే అవకాశం ఉందని చావ్లా చెప్పారు.

అమర రాజా ఎనర్జీ లాభం రూ.241 కోట్లు

ఒక్కో షేరుకు 530% మధ్యంతర డివిడెండ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ (ఏఆర్ఈఎం).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.3,154.30 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.240.71 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో మొత్తం ఆదాయం రూ.2,838.82 కోట్లుగా ఉండగా లాభం రూ.226.40 కోట్లుగా ఉంది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం వ్యయాలు రూ.2,530.09 కోట్ల నుంచి రూ.2,830.33 కోట్లకు పెరిగాయి. ఫలితాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5.30 (530 శాతం) మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ డైరెక్టర్ల బోర్డు ప్రకటించింది. డివిడెండ్ చెల్లింపునకు రికార్డు తేదీగా నవంబరు 14ను ఖరారు చేయగా డిసెంబరు 3 లోగా చెల్లింపులు చేపట్టనున్నట్లు అమర రాజా ప్రకటించింది. కాగా అనుబంధ సంస్థ అమర రాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఆర్ఏసీటీ)లో పెట్టుబడుల పరిమితిని రూ.1,000 కోట్ల నుంచి రూ.2,000 కోట్లకు పెంచినట్లు వెల్లడించింది.

16% తగ్గిన గ్లాండ్ ఫార్మా లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో గ్లాండ్ ఫార్మా కన్సాలిడేటెడ్ నికర లాభం 16 శాతం క్షీణించి రూ.163.50 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ నికర లాభం రూ.194.10 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ కార్యకలాపాల ఆదాయం మాత్రం 2 శాతం వృద్ధితో రూ.1,401.70 కోట్ల నుంచి 1,405.80 కోట్లకు చేరుకుంది. ఈ కాలంలో కంపెనీ అమెరికా ఆదాయం రూ.754.70 కోట్లుగా ఉంది.

పెరిగిన తాజ్ జీవీకే లాభం

తాజ్ జీవీకే హోటల్స్ అండ్ రిసార్ట్స్ సెప్టెంబరు త్రైమాసికంలో స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన రూ.107.37 కోట్ల ఆదాయంపై రూ.19.65 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.90.46 కోట్లు, లాభం రూ.11.13 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,450 ▼	73,750 ▼	1,06,500 ▲
ముంబై	78,518 ▼	71,923 ▼	94,482 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	128	విజయవాడ	125
వరంగల్	128	గుంటూరు	126
కరీంనగర్	128	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	128	చిత్తూరు	115
కర్నూలు	128	నెల్లూరు	115
విశాఖపట్నం	111	అనంతపురం	115
గోదావరి	125		

రూ.6 లక్షల కోట్లు ఉఫ్

భారీగా పతనమైన మార్కెట్.. 3 నెలల కనిష్ఠానికి సూచీలు

- ఒక దశలో 1,492 పాయింట్లు కోల్పోయిన బీఎస్ఈ సెన్సెక్స్
- చివరికి 942 పాయింట్ల నష్టంతో 78,782 వద్ద ముగిసిన సూచీ
- 24,000 దిగువ స్థాయికి నిఫ్టీ
- దాదాపు 3% క్షీణించిన ఆర్ఐఎల్

నష్టాలకు కారణాలు

- అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఎవరు గెలుస్తారనే అంశంపై అనిశ్చితి
- ఈ వారంలో యూఎస్ ఫెడ్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాడ్ (బీఓఈ) ద్రవ్యపరపతి సమీక్ష నిర్ణయాలు ప్రకటించనున్న నేపథ్యంలో అప్రమత్తత
- విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) పెట్టుబడులు తరలిపోతుండటం
- సెప్టెంబరు త్రైమాసిక ఆర్థిక ఫలితాల సీజన్ ఆశాజనకంగా లేకపోవడం
- అధిక ధరల వద్ద ట్రేడవుతున్న షేర్లలో మదుపరులు లాభాలు స్వీకరించడం

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం కుప్పకూలాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,491.52 పాయింట్లు పతనమై 78,232.60 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 941.88 పాయింట్ల (1.18 శాతం) నష్టంతో 78,782.24 వద్ద స్థిరపడింది. సూచీకి దాదాపు రెండు నెలల (ఆగస్టు 6 తర్వాత) కనిష్ఠ ముగింపు స్థాయి ఇది. నిఫ్టీ విషయానికొస్తే, ఒక దశలో 488 పాయింట్ల వరకు క్షీణించి 23,800 స్థాయికి జారుకుంది. చివరి గంటలో కాస్త తేరుకుని 309 పాయింట్ల (1.27 శాతం) నష్టంతో 23,995.35 వద్ద క్లోజైంది. దాంతో సూచీ 24,000 కీలక స్థాయిని చేజార్చుకున్నట్లైంది. అమ్మకాల హోరులో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.5.99 లక్షల కోట్లు తగ్గి రూ.442.11 లక్షల కోట్లకు (5.26 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.



సరికొత్త కనిష్ఠానికి రూపాయి

మరిన్ని ముఖ్యాంశాలు..

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 24 నష్టపోయాయి. అదానీ పోర్ట్స్ షేరు 3.23 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీ లిమిటెడ్ (ఆర్ఐఎల్) షేరు 2.77 శాతం పతనమవడంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.50,205 కోట్లు తగ్గి రూ.17.62 లక్షల కోట్లకు పడిపోయింది. మార్కెట్లో అధిక వెయిటేజీ కలిగిన మరో షేరు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం 1.37 శాతం క్షీణించడం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలకు ప్రధాన కారణమయ్యాయి.

5 వారాల్లో 7,200 పాయింట్లు డౌన్

ఈ సెప్టెంబరు 27న 85,978 పాయింట్ల వద్ద ఆల్‌టైం రికార్డు గరిష్ఠాన్ని నమోదు చేసిన సెన్సెక్స్.. ఆ తర్వాత తిరోగమన బాట పట్టింది. గడిచిన ఐదు వారాల్లో లేదా 25 ట్రేడింగ్ సెషన్లలో సూచీ 7,196 పాయింట్లు నష్టపోయింది.

భారత కరెన్సీ విలువ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. ఫారెక్స్ ట్రేడింగ్‌లో డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 4 పైసల నష్టంతో 84.11 వద్ద ముగిసింది. మన ఈక్విటీ మార్కెట్లో భారీ నష్టాలు, విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటంతో పాటు ముడి చమురు ధరలు మళ్లీ ఎగబాకడం రూపాయి విలువకు గండికొట్టాయని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. నష్టాల్లో నమోదై లాభాల్లోకి..

షాపూర్జీ పల్లోంజీ గ్రూప్‌నకు చెందిన అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ సోమవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.463తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 7.11 శాతం నష్టంతో రూ.430.05 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. ఒక దశలో 9.31 శాతం క్షీణించి రూ.419.85 వద్దకు జారుకున్నప్పటికీ.. తిరిగి పుంజుకుని లాభాల్లోకి మళ్లింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ షేరు 2.49 శాతం లాభంతో రూ.474.55 వద్ద స్థిరపడింది.

నివా బూపా ఇష్యూ ధరల శ్రేణి రూ.70-74

నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (గతంలో మ్యాక్స్ బూపా హెల్త్ ఇన్సూరెన్స్) ఐపీఓ ఈ నెల 7న ప్రారంభమై 11న ముగియనుంది. రూ.2,200 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వస్తున్న ఈ కంపెనీ ఇష్యూ ధరల శ్రేణిని రూ.70-74గా నిర్ణయించింది.

ఏసీఎంఈ సోలార్ ఆఫర్ ధరల శ్రేణి రూ.275-289

పునరుత్పాదక ఇంధన రంగ సంస్థ ఏసీఎంఈ సోలార్ హోల్డింగ్స్ లిమిటెడ్ ఐపీఓ ఈ నెల 6న ప్రారంభమై 8న ముగియనుంది. ఇష్యూ ధరల శ్రేణిని కంపెనీ రూ.275-289గా నిర్ణయించింది. ఐపీఓ ద్వారా కంపెనీ మొత్తం రూ.2,900 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

వచ్చే ఏడాదిలో రిలయన్స్ జియో ఐపీఓ

భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ జియో ఇన్ఫో వచ్చే ఏడాదిలో ఐపీఓకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రిటైల్ వ్యాపార విభాగమైన రిలయన్స్ రిటైల్‌ను ఆ తర్వాత లిస్ట్ చేయాలనుకుంటున్నట్లు సమాచారం. జియో మార్కెట్ విలువను రూ.8.40లక్షల కోట్లస్థాయిలో లెక్కగట్టే అవకాశం ఉంది.

ఎంఎఫ్‌లకు సెబీ మరో వెసులుబాటు

విదేశీ ఫండ్స్‌లో పెట్టుబడులకు ఓకే

న్యూఢిల్లీ: దేశీయ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ మరో వెసులుబాటు కల్పించింది. ఈ ఫండ్స్ పెట్టుబడులను నిర్వహించే ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్లు, తమ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని విదేశీ మ్యూచువల్ ఫండ్స్ లేదా యూనిట్ ట్రస్టుల్లో పెట్టుబడి పెట్టేందుకు అనుమతించింది. అయితే ఆ విదేశీ ఫండ్ లేదా యూనిట్ ట్రస్టు నికర పెట్టుబడుల్లో 25 శాతానికి మించి మన దేశ కంపెనీలకు చెందిన షేర్లు లేదా రుణ పత్రాలు ఉండకూడదని స్పష్టం చేసింది. దీంతో ఎంఎఫ్ పథకాల ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్లకు పెట్టుబడుల వివిధీకరణకు మరింత వెసులుబాటు లభిస్తుందని భావిస్తున్నారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని సెబీ తెలిపింది. ఒకవేళ ఈ పథకాల పెట్టుబడుల్లో భారత కంపెనీల షేర్లు, రుణ పత్రాల వాటా 25 శాతం మించితే, ఆ విషయం తెలిసినప్పటి నుంచి ఆరు నెలల వరకు లేదా మళ్లీ పెట్టుబడులు 25 శాతం దిగువకు వచ్చే వరకు, దేశీయ ఎంఎఫ్‌లు ఆ పథకాల్లో పెట్టుబడులు పెట్టకూడదని సెబీ నిషేధించింది.

అంతర్జాతీయ మార్కెట్లోకి పోసిడెక్స్ టెక్నాలజీస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న కస్టమర్ డేటా మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ సంస్థ పోసిడెక్స్ టెక్నాలజీస్ తన కార్యకలాపాలను అంతర్జాతీయ మార్కెట్లోకి విస్తరిస్తోంది. ఇందులో భాగంగా అమెరికా, దుబాయ్, సింగపూర్, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్ దేశాలకు సంస్థ కార్యకలాపాలను విస్తరించనున్నట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ కే వెంకట్ రెడ్డి తెలిపారు. పోసిడెక్స్ ఇప్పటి వరకు భారత్‌లోని 60కి పైగా సంస్థలకు సేవలందిస్తోందన్నారు. బ్యాంకింగ్, బీమా, కన్స్యూమర్ ఫైనాన్స్, హౌసింగ్ ఫైనాన్స్, రిటైల్, క్యాపిటల్ మార్కెట్స్ సహా పలు ప్రభుత్వ శాఖలు ఇందులో ఉన్నాయని తెలిపారు.

కేసీఆర్, హరీశ్ ఇళ్ల ముందు ధర్నా చేయండి

- సర్పంచ్‌ల ఆత్మహత్యలకు వారే కారణం
- వారు ఉన్నప్పుడే బిల్లుల పెండింగ్: సీతక్క
- సర్పంచ్‌లూ తొందరపడొద్దు: పొన్నం

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచులు ఆందోళన చెందొద్దని రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులను విడుదల చేస్తుందని, బీఆర్ఎస్ రాజకీయ కుట్రలో వారు బలి కావొద్దని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాము అధికారం చేపట్టాక. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన బిల్లుల్లో ఇప్పటికే రూ.500 కోట్లు విడుదల చేశామని వెల్లడించారు. ఈ మేరకు సీతక్క సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాజీ సర్పంచ్‌ల బాధ, ఆవేదన తమకు తెలుసని, అందుకే ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న బిల్లులను క్లియర్ చేస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లతో బలవంతంగా పనులు చేయించి.. వారికి బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కేసీఆర్, హరీశ్‌రావు కారణం కాదా? అని ప్రశ్నించారు. పనులు చేయించుకుని బిల్లులు చెల్లించని ఆ ఇద్దరి నివాసాల ముందు మాజీ సర్పంచ్‌లు ధర్నాలు చేయాలని సూచించారు. హరీశ్ ఆర్థిక మంత్రిగా ఉన్నపుడే.. బిల్లులు పెండింగ్‌లో పెట్టారని మాజీ సర్పంచ్‌లకు తెలుసునని. ఆర్థిక శాఖను, అధికారాన్ని చేతిలో పెట్టుకొని సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమైందే హరీశ్ అని ఆరోపించారు. ఏళ్లతరబడి బిల్లులు చెల్లించకుండా ఇబ్బందిపెట్టిన బీఆర్ఎస్ ఇప్పుడు మాజీ సర్పంచులను రెచ్చగొడుతోందని, వారి తీరు చూస్తుంటే.. చంపినోడే తద్దినం పెట్టినట్లుగా ఉందని విమర్శించారు.

బీఆర్ఎస్ నేతల మొసలి కన్నీరు

సర్పంచ్‌ల ఆత్మహత్యకు కారణమైన బీఆర్ఎస్ నేతలు.. ఇప్పుడు వారి పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. విపక్షాల ఉచ్చులో పడొద్దంటూ సర్పంచ్‌లకు విజ్ఞప్తి చేశారు. "సర్పంచ్‌లూ.. తొందర పడకండి! రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు. వచ్చే ఏడాది మార్చి చివరిలోగా విడతల వారీగా మీ బకాయిలు క్లియర్ చేస్తాం" అని వ్యాఖ్యానించారు. గాంధీభవన్‌లో సోమవారం పొన్నం మీడియాతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో సర్పంచ్‌లు పడే బాధలు తమకు తెలుసునని, ప్రస్తుతం సర్పంచ్‌ల పరిస్థితికి బీఆర్ఎస్ పాలకులే కారణం అని ఆరోపించారు. సర్పంచ్‌ల గురించి ఆ పార్టీ నేతలు మాట్లాడటం.. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రకు వెళ్లడం అన్న చందమేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై మాట్లాడే అర్హత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేదన్నారు. తమను ఆయన ప్రశ్నించే ముందు గత పదేళ్లలో బీజేపీ ఇచ్చిన హామీలను ఎంతవరకు అమలు చేశారో చెప్పాలని నిలదీశారు. ఈ అంశమ్మీద సికింద్రాబాద్ క్లాక్ టవర్ దగ్గర ఉన్న అమరవీరుల స్థూపం వద్ద చర్చకు సిద్ధమా? అని కిషన్‌రెడ్డికి సవాలు విసిరారు. వరదల కారణంగా తెలంగాణలో రూ.10 వేల కోట్ల మేరకు నష్టం వాటిల్లితే కేంద్ర ప్రభుత్వం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని, దీన్ని బట్టి కేంద్రం వద్ద కిషన్‌రెడ్డి బలం ఏపాటిదో అర్థమవుతోందని విమర్శించారు. ఆయన రక్తంలో తెలంగాణ డీఎన్ఏ ఉంటే గనక రాష్ట్రానికి అదనపు నిధులు తీసుకురావాలన్నారు. కాగా తొలుత సర్పంచ్‌ల కాళ్లు పట్టుకుని క్షమాపణ చెప్పిన తర్వాతే హరీశ్‌కు వారి బకాయిల పైన మాట్లాడే హక్కు ఉంటుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ బకాయిలకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. వారి హయాంలో పదుల సంఖ్యలో సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నా.. ఏ ఒక్క కుటుంబాన్నీ హరీశ్ రావు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల పేరుతో సర్పంచ్‌లతో రూ. లక్షలు ఖర్చు పెట్టించిన కేసీఆర్ ప్రభుత్వం.. రూ. 40 వేల కోట్ల వరకు బకాయిలు పెట్టి.. వారిని ఆర్థికంగా దెబ్బతీసిందన్నారు. సమయానికి పనులు చేయలేదని కొంతమందిని సస్పెండ్ కూడా చేయించిందన్నారు. కేంద్ర ఆర్థిక సంఘం నిధులనూ దారి మళ్లించి పంచాయతీల పొట్ట కొట్టిందన్నారు. ఈనాటి సర్పంచ్‌ల దుస్థితికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే కారణమని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ ఛైర్మన్ రాచమళ్ల సిద్దేశ్వర్ అన్నారు. గ్రామపంచాయతీల నిధులను ఇతర పనులకు వాడుకుని సర్పంచ్‌లను రోడ్డున పడేసిందన్నారు. సర్పంచ్‌లు చేసిన పనులకు చెల్లింపులు చేయకుండా వారి ఆత్మహత్యలకు కారణమైంది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అంటూ హరీశ్‌ను ప్రశ్నించారు.

ఆ ఇద్దరి విచారణ డిసెంబరులో!

- గత ప్రభుత్వంలో కీలక ప్రజాప్రతినిధులను విచారించనున్న కాళేశ్వరం కమిషన్

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన గత ప్రభుత్వంలోని ఇద్దరు ప్రజాప్రతినిధులను విచారణకు పిలవాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ యోచిస్తోంది. అక్టోబరు 31తో కమిషన్ గడువు ముగిసింది. కమిషన్ గడువును రెండు నెలల పాటు పొడిగించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఈ క్రమంలో ప్రభుత్వం గడువు పొడిగిస్తే.. కమిషన్ ఈ నెల 12 నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ పునఃప్రారంభించనుంది. ఇప్పటికే కమిషన్ నీటిపారుదల శాఖలోని కీలక అధికారుల విచారణను పూర్తిచేసింది. ఈ నెల 12 నుంచి తాజా, మాజీ ఐఏఎస్‌లను విచారణకు పిలవనుంది. సీఎం కేసీఆర్ మాజీ కార్యదర్శి స్మితాసభర్వాల్, మాజీ సీఎస్‌లు సోమేశ్‌కుమార్, ఎస్కే జోషిలతో పాటు ఆర్థిక శాఖ ప్రత్యేక సీఎస్ రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ మాజీ ప్రత్యేక సీఎస్ రజత్‌కుమార్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాలున్నాయి. ఇప్పటికే విచారణలో పలు సందర్భాల్లో మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు నీటిపారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్లు బయటికి వచ్చాయి. దీంతో నవంబరులో ఐఏఎస్‌లను, డిసెంబరులో గత ప్రభుత్వంలోని ఇద్దరు కీలక ప్రజాప్రతినిధులను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది. విద్యుత్తుపై జస్టిస్ మదన్ లోకూర్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో.. ఆ ప్రభావం పరోక్షంగా కాళేశ్వరం కమిషన్‌పైనా పడింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సాక్షులు, అధికారులను విచారిస్తూ ఆధారాలు రాబట్టే పనిలో ఉంది. ఓ వైపు విచారణ చేస్తూనే.. మరోవైపు నివేదికను రూపొందిస్తోంది. త్వరలోనే కమిషన్ గడువు పొడిగింపు ఉత్తర్వులు జారీ కానున్నాయి.

24 గంటల విద్యుత్ అంటూ మోసం: హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నది తామేనని చెబుతూ కాంగ్రెస్.. దేశాన్ని తప్పుదోవ పట్టిస్తోందని, ఈ వైఖరి మంచిది కాదని.. మాజీమంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించే రాష్ట్రంగా తెలంగాణను నిలిపింది కేసీఆర్ మాత్రమేనని సోమవారం 'ఎక్స్' వేదికగా తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఓట్ల కోసం కేసీఆర్ అందించిన 24 గంటల ఉచిత కరెంటు ఘనతను తమ ఖాతాలో వేసుకోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సాధించిన అభివృద్ధిని చూపించలేక, తెలంగాణలో బీఆర్ఎస్ సాధించిన అభివృద్ధిని చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

బిల్లుల కోసం..

(మొదటి పేజీ తరువాయి)



ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ఉంచారు. సంఘం ప్రతినిధులు, హైదరాబాద్‌కు బయలుదేరి వస్తున్న వారిని పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. రంగారెడ్డి జిల్లా, కరీంనగర్, మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, ఇతర జిల్లాల్లో పలువురు మాజీ సర్పంచ్‌లను హైదరాబాద్‌కు రాకుండా అడ్డుకొని పోలీస్ స్టేషన్లకు తరలించారు. దీంతో అరెస్టయిన చోటనే వారంతా తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. నిరసనకు దిగారు. అప్పులుతెచ్చి గ్రామాల్లో శ్మశాన వాటికలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు వంటివి అనేకం అభివృద్ధి పనులు చేశామని వారు పేర్కొన్నారు. ఆయా పనులకు సంబంధించి 2019 నుంచి 2024వరకు బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో బిల్లులు చెల్లించాలని సీఎం, గవర్నర్ సహా అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వస్తున్న మాజీ సర్పంచ్‌లను ఎక్కడికక్కడ అరెస్టుచేయడం సరికాదని వారు వెల్లడించారు.

మాజీ సర్పంచుల అరెస్టును ఖండించిన బీఆర్ఎస్

రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్‌పార్టీ తీవ్రంగా ఖండించింది. పెండింగ్ బిల్లులో కోసం మాజీ సర్పంచులు ఏడాదిగా తిరుగుతున్నారని, వారి కుటుంబాలను రోడ్డున పడేయడం దారుణమని ఆ పార్టీ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు.. గ్రామాభివృద్ధి కోసం ఖర్చుచేసిన డబ్బు ఇవ్వాలని కోరితే అరెస్టులు చేస్తారా? అని వారు ప్రశ్నించారు. మాజీ సర్పంచులంతా అప్పులుతెచ్చి, ఆస్తులమ్మి, భార్యాపిల్లల బంగారం తాకట్టుపెట్టి పనులు చేపట్టారని పేర్కొన్నారు. ప్రజాపాలన అంటే గ్రామానికి సేవచేసిన వారిని అరెస్టు చేయడమేనా? అని ప్రభుత్వాన్ని వారు నిలదీశారు. మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించింది. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని కమీషన్లకోసం ఉపయోగిస్తోందని వారు ఆరోపించారు.

ప్రభుత్వం రూ.1500కోట్లు విడుదల చేయాలి

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిపనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్యఅని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1500కోట్లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యే: హరీశ్

తిరుమలగిరి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దొంగలు, టెర్రరిస్టులను అరెస్టు చేసినట్లు మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడం హేయమైన చర్య అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. పెండింగు బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు 'ఛలో హైదరాబాద్ యాత్ర'కు పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం వారందిరినీ ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. కొంత మందిని తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారనే విషయాన్ని తెలుసుకున్న హరీశ్ రావు తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అక్కడ మాజీ సర్పంచులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడారు. సర్పంచుల మీద కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. అప్పులు చేసి భార్యపిల్లల మీదున్న బంగారాన్ని అమ్మి అభివృద్ధి పనులు చేసిన సర్పంచ్‌లు ఆ బిల్లులు చెల్లించాలనే డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు ఎంతో కృషి చేశారని.. మంచి పనులు చేసిన సర్పంచులకు ఎందుకు ముఖ్యమంత్రి శిక్ష వేస్తున్నారని ప్రశ్నించారు. బడా కాంట్రాక్టర్ల వందల కోట్ల బిల్లులు చెల్లిస్తున్నారు కానీ పేద సర్పంచ్‌లు పనులు చేసిన పాపానికి శిక్ష అనుభవించాలా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం వచ్చి 10 నెలలు దాటిందని, రూ. 10లక్షల బిల్లులు కూడా వారికి చెల్లించలేదని ఆరోపించారు. అరెస్టు చేసిన సర్పంచ్‌లను వెంటనే బేషరతుగా వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. కాగా జిల్లాల్లోనూ సోమవారం 'ఛలో హైదరాబాద్ యాత్ర'కు బయలుదేరిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు.

అమరావతి పనులకు మళ్లీ టెండర్లు!

- మూడేళ్లలో అభివృద్ధి పనులు పూర్తి చేయడమే లక్ష్యం
- సీఆర్డీయే సమావేశంలో కీలక నిర్ణయాలు

అమరావతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి పనులకు కొత్తగా టెండర్లు పిలవాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటిదాకా పనుల కొనసాగింపునకు అడ్డంకిగా మారిన పాత టెండర్లను రద్దు చేసి, త్వరలోనే కొత్తగా టెండర్లను ఆహ్వానించనుంది. సోమవారం అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సీఆర్డీయే 39వ సమావేశం జరిగింది. ఇందులో రాజధాని పనులకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైకోర్టు, అసెంబ్లీ భవనాలకు జనవరిలోపు కొత్త టెండర్లు పిలుస్తారు. విగిలిన అన్ని పనులకు డిసెంబరు 31లోగానే టెండర్లను ఆహ్వానిస్తారు. సమావేశ వివరాలను పురపాలక శాఖ మంత్రి నారాయణ మీడియాకు వెల్లడించారు. మూడేళ్లలో అమరావతి అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేస్తామని ప్రకటించారు. అమరావతి అభివృద్ధి పనులకు సంబంధించి ప్రపంచ బ్యాంక్ రూ.15 వేల కోట్లు ఇవ్వడానికి అంగీకారం తెలిపిందని, అయితే వరద నివారణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆ బ్యాంకు ప్రతినిధులు కోరారని తెలిపారు. సీడ్ కేపిటల్‌లో 48 కిలోమీటర్ల మేర మూడు కాల్వలు వస్తున్నాయన్నారు. కేపిటల్ సిటీ వెలుపల రెండో దశలో వరద నివారణ పనులు చేపట్టాలని నెదర్లాండ్స్ కన్సల్టెన్సీ నివేదిక ఇచ్చిందని, ఈ పనుల సమగ్ర నివేదిక తయారీకి అథారిటీ ఆమోదం తెలిపిందన్నారు. అందుకు తగ్గట్టుగా రాజధాని అమరావతిలో 217 చదరపు కిలోమీటర్ల కోర్ క్యాపిటల్ పరిధిలోను, ఆ వెలుపల పలు చోట్ల మినీ రిజర్వాయర్లు నిర్మించనున్నట్టు తెలిపారు. నీరుకొండ వద్ద 0.04 టీఎంసీలు, కృష్ణాయపాలెం వద్ద 0.01 టీఎంసీలు, శాఖమూరు వద్ద 0.01 టీఎంసీల నిల్వకు రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పుడు ఉన్న లిఫ్ట్ కాకుండా ఉండవల్లి వద్ద 7,300 క్యూసెక్కులు పంపింగ్ చేసే మరొక లిఫ్ట్ ఏర్పాటు చేస్తామన్నారు.

పంట ఉత్పత్తులపై ఆంక్షలు తగదు

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు

విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పంటల ఎగుమతిపై నిబంధనలు మంచిది కాదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఏ వస్తువు ఎగుమతిపైనా లేని నిబంధనలు ఒక్క పంటల ఎగుమతి పైనే ఎందుకని ప్రశ్నించారు. విజయవాడ బందరు రోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జాతీయ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆయన ముఖ్య అతిథిగా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. దేశానికి రైతులు వెన్నెముక అని, రైతులతో మిల్లర్లకు అవినాభావ సంబంధం ఉందని పేర్కొన్నారు. మిల్లర్ల సమస్యలపై ఎప్పటికప్పుడు అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేయవలసిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటను ఎగుమతి చేసేందుకు రైతులు ఇబ్బందులు పడకూడదన్నారు. తాను ఢిల్లీ వెళ్లిన తరువాత కేంద్ర ఆహార శాఖ మంత్రితో మాట్లాడి మిల్లర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఎమ్మెల్యే హరీశ్‌బాబు నిరవధిక దీక్ష

- అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



సిర్పూర్(టి), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు నిరవధిక దీక్ష చేపట్టారు. సోమవారం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండల కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట దీక్ష చేపట్టిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అటవీ అధికారుల దౌర్జన్యాలు, అరాచకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం.. అడవి పందిని హతమార్చారంటూ మండలంలోని బెంగాలీ క్యాంపునకు చెందిన ఏడుగురిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వారిని అన్యాయంగా జైలు పంపించారన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

- పొలంలో విద్యుత్ తీగలు తగిలి అన్నదాత మృతి

వేలేరు, చెన్నూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయనికి చేసిన అప్పులు తీర్చే దారిలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలంలో సోమవారం జరిగింది. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన రైతు బెల్లం శ్రీశైలం (50) మూడేళ్లుగా పంటలు సాగు చేస్తుండగా ఆశినంత పంట దిగుబడి రాకపోవడంతో క్రమక్రమంగా అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు తీర్చేదారి లేక సోమవారం ఉరేసుకున్నాడు. మరో ఘటనలో.. మంచిర్యాల జిల్లా చెన్నూరు మం డలం రచ్చపల్లి గ్రామానికి చెందిన రైతు జాడి బాపు (45) ఆదివారం సాయంత్రం సాగు చేసిన పంటను చూసుకోవడానికి పొలానికి వెళ్లాడు. అయితే, అతడి పొలం సమీపంలో మరొకరి పొలం దాటుతుండగా అక్కడ అడవి పందుల కోసం అమర్చిన విద్యుత్ తీగ కాలికి తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.



కొన్ని ప్రైవేటు సంస్థల అవగాహన ఒప్పందాల రద్దు

వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కొన్ని ప్రైవేటు సంస్థలు 2022 జూలై వరకు చేసుకున్న అవగాహన ఒప్పందాలను సోమవారం రద్దు చేసినట్టు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. పలు అవగాహన ఒప్పందాలను పున:పరిశీలించిన తర్వాత విశ్వవిద్యాలయం ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఉన్నాయని తెలుసుకున్నామని, అందుకే ఈ అవగాహన ఒప్పందాలను రద్దు చేసినట్టు చెప్పారు. ప్రైవేటు సంస్థలకు వ్యవసాయ విశ్వవిద్యాలయంతో ఎలాంటి సంబంధంలేదన్న విషయాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. కొన్ని ప్రైవేటు సంస్థలు.. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పేరును వాడుకుని పలు సామాజిక మాధ్యమాల ద్వారా, బ్రోకర్ల ద్వారా సీట్లు ఇప్పిస్తామని, అలాగే వ్యవసాయ విశ్వవిద్యాలయంతో అనుబంధం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నట్లు వర్సిటీ దృష్టికి వచ్చిందన్నారు. వీటిని నమ్మొద్దని వీసీ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాహిత ప్రకటన జారీ చేశామన్నారు.



పుస్తక ప్రదర్శన లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం, రమా మెల్కొటే, కె. రామచంద్రమూర్తి, యాకూబ్, ఆర్. వాసు తదితరులు

డిసెంబరు 19 నుంచి బుక్ ఫెయిర్

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే పేరెన్నికగన్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీకి శాశ్వత భవనం నిర్మాణానికి స్థలం కేటాయింపు విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్సీ ప్రొ. కోదండరాం వెల్లడించారు. ప్రతి ఏటా డిసెంబరులో నిర్దిష్ట తేదీల్లో పుస్తక ప్రదర్శనకు ఎన్టీఆర్ స్టేడియాన్ని ఉచితంగా కేటాయించేలా ప్రత్యేక జీవో తెచ్చేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో 37వ హైదరాబాద్ పుస్తక ప్రదర్శన లోగో ఆవిష్కరణ సోమవారం జరిగింది. తమ సొసైటీకి దిశానిర్దేశం చేసేందుకు సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, సామాజికవేత్త ప్రొ. రమా మెల్కొటే, సీనియర్ జర్నలిస్టు కె. రామచంద్రమూర్తి గౌరవ సలహాదారులుగా వ్యవహరించనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఆర్. వాసు తెలిపారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ ఈ ఏడాది పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కవులు, రచయితలు, పాఠకులు, ప్రచురణ కర్తలందరినీ ఒకచోట కలిపే ఈ పుస్తకాల పండుగను డిసెంబరు 19 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు యాకూబ్ ప్రకటించారు. ఈ ఏడాది 350కిపైగా స్టాళ్లు కొలువుదీరనున్నాయని, ప్రింట్ మీడియాతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాకూ ప్రత్యేక స్టాళ్లు కేటాయిస్తున్నట్లు వివరించారు.

హైదరాబాద్‌లో ఆగిన మెట్రో పరుగు

- ఉదయం ఆఫీసు వేళల్లో పలుమార్లు నిలిచిన రైలు
- బేగంపేట్-అమీర్‌పేట్ మార్గంలో 15 నిమిషాలు బ్రేక్
- అంతకు ముందే పరేడ్ గ్రౌండ్ వద్ద ఆగిపోయిన రైలు
- మలక్‌పేట్, మూసారంబాగ్‌లోనూ ఇదే తరహా సమస్య
- స్టేషన్లలో డోర్లు తెరచుకోక ప్రయాణికులకు ఇబ్బంది



మూసారాంబాగ్ స్టేషన్‌లో నిలిచిన రైలులో ప్రయాణికులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉరుకులు పరుగులతో సోమవారం ఉదయం ఆఫీసులకు బయలుదేరిన హైదరాబాద్ వాసులకు మెట్రో రైలు షాకిచ్చింది. సాంకేతిక లోపంతో పలు మార్గాల్లో రైలు నిలిచిపోవడం, స్టేషన్లలో డోర్లు తెరచుకోకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బ్లూలైన్‌లోని నాగోల్-రాయదుర్గం కారిడార్‌లో సోమవారం ఉదయం 9.55 నిమిషాలకు బేగంపేట్ నుంచి అమీర్‌పేట్‌కు బయలుదేరిన రైలు మధ్యలో ఆగిపోయింది. దాదాపు 15 నిమిషాల పాటు పట్టాలపై నిలిచిపోవడంతో అంతా పరేషాన్ అయ్యారు. సమాచారం అందుకున్న అధికారులు సమస్యను సకాలంలో పరిష్కరించడంతో ఊపిరి పీల్చుకున్నారు. అంతకు ముందు ఇదే రైలు పరేడ్ గ్రౌండ్ స్టేషన్ వచ్చే ముందు 15 నిమిషాలు ఆగిపోయినట్లు ప్రయాణికులు తెలిపారు. బేగంపేటలో మళ్లీ రైలు నిలిచిపోవడంతో కంగారు పడ్డామని చెప్పారు. కాగా, విద్యుత్ ఫీడర్ ఛానల్‌లో సాంకేతిక సమస్య వల్లే బేగంపేట వద్ద రైలు ఆగిందని అధికారులు తెలిపారు.

రెడ్ లైన్‌లోనూ సమస్య..

పరేడ్‌గ్రౌండ్, బేగంపేట్-అమీర్‌పేట్ స్టేషన్ల మధ్య రైలు ఆగిపోవడంతో ఇటు నాగోలు-రాయదుర్గం (బ్లూలైన్), అటు మియాపూర్- ఎల్‌బీనగర్ (రెడ్‌లైన్) కారిడార్లలో బయలుదేరిన రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఉదయం 10 నుంచి 10.30 గంటల పాటు పలు రైళ్లు స్టేషన్లలో ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. కాగా, మియాపూర్ నుంచి ఎల్‌బీనగర్‌కు వెళ్తున్న మెట్రో రైలు మూసారంబాగ్ స్టేషన్‌కు వచ్చిన కొద్ది సేపటికి సాంకేతిక సమస్యతో స్టేషన్‌లోనే నిలిచిపోయింది. మూసారంబాగ్ నుంచి బయలుదేరేందుకు సిద్ధమైన రైలు తలుపులు మూతపడిన కొద్ది సేపటికి స్టేషన్‌లోనే నిలిచిపోయింది. సాంకేతిక సమస్యల వల్ల రైలు నిలిచిపోయిందని, అందుకు చింతిస్తున్నామని వాయిస్ మెసేజ్ రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. తర్వాత 2 నిమిషాలకు రైలు కదిలింది. కాగా, ఇదే రైలు మలక్‌పేట్ స్టేషన్‌కు చేరుకున్న తర్వాత కూడా నిలిచిపోయింది. 11.30 గంటల సమయంలో ఇక్కడ రైలు ఆగినట్లు ప్రయాణికులు తెలిపారు. కాగా, రైళ్లు ఆగిపోవడంతో ఎల్‌బీనగర్, నాగోల్, ఉప్పల్, బేగంపేట్, అమీర్‌పేట్, పెద్దమ్మగుడి, జేఎన్‌టీయూ, హైటెక్ సిటీ, మియాపూర్ స్టేషన్లలో వేలాది మంది ప్లాట్‌ఫాంలపై నిరీక్షించారు. అమీర్‌పేట్ స్టేషన్‌లో రద్దీ ఎక్కువ కావడంతో ప్లాట్‌ఫాంల పైకి చాలా మందిని అనుమతించలేదని తెలిసింది. బేగంపేట్, అమీర్‌పేట్, మూసారాంబాగ్, మలక్‌పేట్ తదితర స్టేషన్లకు రైలు వచ్చిన నిమిషం వరకు డోర్లు తెరుచుకోకపోవడంతో ఆందోళనకు గురయ్యామని కొంత మంది ప్రయాణికులు తెలిపారు.

సమస్యను పరిష్కరించాం : ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ

బేగంపేట-రాయదుర్గం మార్గంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అమీర్‌పేట్, మియాపూర్, నాగోల్ రూట్‌లో మెట్రో రైళ్లు నిలిచిపోయాయి. దాదాపు 15 నిమిషాలపాటు రైళ్లు ఆగిపోయాయి. సమస్యను పరిష్కరించి రైళ్లను పునరుద్ధరించాం.

మృత్యువులా మీద పడిన పాఠశాల గేటు

- వెల్డింగ్ ఊడి గేటు మీదపడడంతో 1వ తరగతి విద్యార్థి మృతి
- మరో విద్యార్థికి గాయాలు
- హాయత్‌నగర్ మండల పరిషత్ పాఠశాలలో ఘటన



విద్యార్థి మీదపడిన గేటు, అజయ్ (ఫైల్)

హయత్‌నగర్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్లారు ముద్దుగా చూసుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడు ప్రమాదవశాత్తు ప్రభుత్వ పాఠశాల గేటు మీద పడి మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. జ్వరం వచ్చిన కొడుకును ఉదయమే ఆస్పత్రికి తీసుకెళ్లి మందులు ఇప్పించామని అంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లాడని కన్నీరు మున్నీరుగా రోదించారు. ఈ ఘటన హయత్‌నగర్ డివిజన్‌లో సోమవారం జరిగింది. ముదిరాజ్‌కాలనీలో నివాసం ఉంటున్న అలకంటి చందు, సరోజ దంపతుల కుమారుడు అజయ్ (6). సమీపంలోని హయత్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. అజయ్ తండ్రి చెత్త ఆటో నడిపిస్తుండగా తల్లి కూలీ పనులు చేస్తుంది. సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన అజయ్.. సాయంత్రం బడి నుంచి తిరిగి వస్తున్న క్రమంలో తోటి స్నేహితులతో కలిసి తుప్పు పట్టిన పాఠశాల గేటు పైకి ఎక్కి ఆడుకున్నాడు. పదుల సంఖ్యలో విద్యార్థులు గేటు ఎక్కడంతో వెల్డింగ్ ఊడిపోయి ఒక్కసారిగా అజయ్ మీద పడింది. దీంతో బాలుడు అక్కడికక్కడే చనిపోయాడు. మరో విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. పేదరికం కారణంగా కొడుకును ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే కొడుకే లేకుండా అయ్యాడని ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని అజయ్ తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

రేషన్‌కార్డు లేకపోయినా ఇందిరమ్మ ఇల్లు

- మొదటివిడతలో ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం
- పేద, నిరుపేద విభాగాల వారీగా ఎంపిక : పొంగులేటి



కూసుమంచి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు లేకపోయినా మొదటివిడతలోనే అర్హులకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం తిరుమలాయపాలెం మండల ప్రజాప్రతినిధులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులకు పేద, నిరుపేద అనే విభాగాల వారీగా దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. ఎటువంటి రాజకీయాలకు తావులేకుండా పారదర్శకంగా ఇళ్లు ఇస్తామన్నారు. మొదటివిడతలో రేషన్ కార్డులు లేకపోయినా అర్హులందరికీ ఇల్లు ఇస్తామని చెప్పారు. త్వరలోనే రేషన్‌కార్డుల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, రెండోవిడతలో రేషన్‌కార్డు ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లకు అర్హులవుతారని మంత్రి తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉండాలని ఆదేశించారు. అర్హులైన వికలాంగులను, వృద్ధులను, వితంతువులను గుర్తించాలన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను పూర్తిచేయాలని ఆదేశించారు.

మానవత్వమున్న వారు 'మూసీ'ని అడ్డుకోరు

- నల్లగొండ ప్రజలు ఇంకెన్నాళ్లు బాధ పడాలి: కోమటిరెడ్డి



హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మానవత్వం ఉన్నవారెవరూ మూసీ ప్రాజెక్టును అడ్డుకోబోరని, అయినా నల్లగొండ జిల్లా ప్రజలు ఇంకా మూసీ బాధలు ఎన్నాళ్లు పడాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మూసీ శుద్ధీకరణ అవశ్యకతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈనెల 8న సీఎం రేవంత్‌రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ఆ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. మూసీ శుద్ధీకరణపై ప్రతిపక్షాలు ప్రజల్లో సృష్టిస్తున్న గందరగోళానికి తెరదించాల్సిన అవసరముందన్నారు. దశాబ్దాలుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు, కాళ్లు చేతులు వంకరలు, క్యాన్సర్ వంటి జబ్బులతో మరణిస్తున్నా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీలు మూసీ బాధితులను రెచ్చగొట్టి రాజకీయంగా ఇబ్బందులు పెట్టాలని ప్రయత్నిస్తున్నాయని, ఆ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ క్యాడర్‌ను అప్రమత్తం చేయాలన్నారు. సీఎం పర్యటనలో మల్లన్నసాగర్ నుంచి యాదాద్రి జిల్లాకు అందించే మంచినీటి సరఫరా పనులకు రూ.210 కోట్లతో శంకుస్థాపన చేస్తారని, ఏర్పాట్లు ఘనంగా చేయాలని సూచించారు.

ప్రముఖ ఆలయాల్లో ప్రతి సోమవారం దీపోత్సవం

- మంత్రి కొండా సురేఖ వెల్లడి



కీసరగుట్టలో దీపం వెలిగిస్తున్న మంత్రి కొండా సురేఖ

కీసర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో ప్రతి సోమవారం దీపోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఇందులో భాగంగా మేడ్చల్ జిల్లాలోని కీసరగుట్టలో జరిగిన దీపోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. దీపోత్సవం సందర్భంగా మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్ పీస్‌తో కూడిన కిట్‌ను అందజేస్తున్నామని చెప్పారు. ప్రముఖ ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని, యాదగిరి గుట్ట ఆలయ గోపురానికి 63 కిలోల బంగారు తాపడం చేయిస్తామన్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర గల కీసరగుట్ట ఆలయ అభివృద్ధిపై కూడా డీపీఆర్ సిద్ధం చేసినట్లు చెప్పారు.

అసంక్రమిత వ్యాధులకు ప్రత్యేక క్లినిక్‌లు

- మాతాశిశు సంక్షేమ కేంద్రాల మాదిరిగా ఏర్పాటు: మంత్రి దామోదర



హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏటా పెరుగుతున్న అసంక్రమిత వ్యాధుల(నాన్-కమ్యూనికెబుల్ డిసీజెస్-ఎన్‌సీడీ) నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. ఈ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని, చికిత్సకు ప్రత్యేక క్లినిక్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. మాతా-శిశు సంక్షేమ(ఎంసీహెచ్) కేంద్రాల మాదిరిగా.. ఎన్‌సీడీ క్లినిక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. సోమవారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన సమీక్షలో మంత్రి ఈ మేరకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు మాట్లాడుతూ.. రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధుల బారిన పడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోందని వివరించారు. ప్రస్తుతం మొత్తం అనారోగ్య సమస్యల్లో 60% ఎన్‌సీడీతో ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. ఎన్‌సీడీ చికిత్సకు అన్ని బోధనాస్పత్రుల్లో ప్రత్యేక క్లినిక్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆ తర్వాత దశలవారీగా జిల్లా, ఏరియా ఆస్పత్రులకు వీటి సేవలను విస్తరించాలన్నారు. ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, చికిత్స కోసం ప్రజలు ఎలాంటి ఇబ్బందులను ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అంగన్‌వాడీలకు సంక్రాంతి సారె

- అద్దె అంగన్‌వాడీ సెంటర్లకు కొత్త భవనాలు: సీతక్క
- 'క్రష్' కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 35,700 అంగన్‌వాడీ సెంటర్లలో పనిచేసే టీచర్లు, హెల్పర్లకు ప్రభుత్వం సంక్రాంతి సారెను అందించనుంది. ఒక్కొక్కరికీ రెండు చీరెలను అందించాలని నిర్ణయించింది. సోమవారం సచివాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో మంత్రి సీతక్క, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద, శాఖ డైరెక్టర్ కాంతివెస్లీతో కలిసి భేటీ అయ్యారు. టీచర్లు, హెల్పర్ల సూచనలకు అనుగుణంగా డిజైన్, రంగుల్లో మార్పులు చేసి, సంక్రాంతికి వారికి అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త భవనాలను నిర్మిస్తామని, ఉచిత విద్యుత్‌ను అందిస్తామన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి అందించే రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంశం సాంకేతిక కారణంతో ఆలస్యమవుతోందని, పది రోజుల్లో దీనిపై ఉత్తర్వులు వెలువడుతాయన్నారు. కాగా, రాష్ట్రంలో 'క్రష్' కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రెండున్నరేళ్లలోపు పిల్లలను ఈ క్రష్ కేంద్రాల్లో చేర్చుకుంటారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రెండున్నరేళ్లలోపు పిల్లలున్న తల్లులు పనికి వెళ్లేందుకు అవకాశం ఉండదు. దాంతో వారు ఉపాధి కోల్పోతున్నారని ప్రభుత్వం ఈ పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. ఈ కేంద్రాల్లో పిల్లల ఆలనాపాలనా చూసుకోవడం, సమయానికి వారికి భోజనం అందించడం, నిద్రపుచ్చడం లాంటి కార్యకలాపాలను నిర్వహిస్తారు. వీటికోసం అంగన్‌వాడీల తరహాలోనే ఇద్దరు సిబ్బందిని కూడా నియమించనున్నారు.

గిరిజన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

గిరిజనుల విద్య, సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క అన్నారు. బంజరాహిల్స్‌లోని ఆదివాసీ భవన్‌లో ఐఐటీలు, ఎన్ఐటీల్లో సీట్లు సాధించిన 180మంది గిరిజన గురుకుల విద్యార్థులకు ఆమె ల్యాప్‌టాప్‌లను అందించారు. విద్యార్థుల రోజువారీ ఆరోగ్య స్థితిగతులను తెలుసుకునేందుకు రూపొందించిన 'హెల్త్ యాప్'ను ఆవిష్కరించారు.

నేడు రాహుల్‌గాంధీ రాక

- కులగణనపై జరగనున్న సదస్సులో మేధావులు, పౌరహక్కుల నేతలతో చర్చ
- హాజరుకానున్న సీఎం, మంత్రులు



గాంధీభవన్‌లో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ నేతలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ గౌడ్. పక్కన పొన్నం, వీహెచ్

హైదరాబాద్/బోయిన్‌పల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ మంగళవారం హైదరాబాద్‌కు రానున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కులగణనకు సంబంధించి మేధావులు, పౌరహక్కుల, ప్రజాసంఘాల నాయకులు, కులసంఘాలతో బోయిన్ పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో జరగనున్న సదస్సులో పాల్గొననున్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో తలమునకలుగా ఉన్న రాహుల్.. అంత బిజీ షెడ్యూల్ లోనూ కులగణన కార్యక్రమానికి సమయం కేటాయించారు. మంగళవారం సాయంత్రం 4.45 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్న రాహుల్.. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో బోయిన్‌పల్లిలోని గాంధీ నాలెడ్జ్ సెంటర్‌కు చేరుకుంటారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు జరగనున్న సదస్సులో పాల్గొని నేతలతో చర్చిస్తారు. కులగణనపై వారి అభిప్రాయాలు తీసుకుంటారు. కులగణన ద్వారా బలహీన వర్గాలకు కలిగే ప్రయోజనాలు వివరిస్తారు. సదస్సు ముగిసిన అనంతరం తిరిగి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. ఈ సదస్సులో మేధావులు, పౌరహక్కుల సంఘాలు, ప్రజా, విద్యార్థి, కుల సంఘాల నేతలతో పాటు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు తదితరులు 400 మంది వరకూ పాల్గొననున్నారు. కాగా, టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా రాహుల్ గాంధీ హైదరాబాద్‌కు వస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు.. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నేతలతో సంప్రదింపులు, సమావేశాలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మరోవైపు సదస్సు నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

8న మూసీ బాట

(మొదటిపేజీ తరువాయి)

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకోనున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అభివృద్ధి పనులనూ ఆయన సమీక్షించనున్నారు. దీంతోపాటు మిషన్ భగీరథ పథకంలో భాగంగా మల్లన్నసాగర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాకు 200 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్ నిర్మాణానికి పైలాన్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారు.

మూసీ కాలుష్య బాధితులతో మాటా-ముచ్చట

యాదాద్రి భువనగిరి జిల్లా పర్యటనలో మూసీ కాలుష్య బాధితులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించనున్న మాటా-ముచ్చట కార్యక్రమం ప్రత్యేకంగా నిలవనుంది. ఈ జిల్లాలో ముఖ్యంగా నాగారం నుంచి ఇంద్రపాలనగరం వరకు మూసీ నది పరిసర ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు, రైతులు మూసీ కాలుష్యంతో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్నారు. ఆరోగ్యం, పంటల పరంగా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. వీరితో పాటు సంగెం నుంచి బొల్లంపల్లి వరకు కూడా మూసీ నది పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రాంతాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించి.. దశాబ్దాలుగా అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న బాధలను అడిగి తెలుసుకోనున్నారు. అదే సమయంలో మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు.. వారి కష్టాలను ఎలా తీరుస్తుందన్నదీ వివరించనున్నారు. తద్వారా మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టుకు ప్రజల మద్దతును కూడగట్టనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పాదయాత్ర చేపట్టే అవకాశం కూడా ఉందని పేర్కొన్నాయి.

ఒకటి, రెండు రోజుల్లో ఖరారు..

వాస్తవానికి మూసీ కాలుష్యంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పరివాహక గ్రామాల ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను వెలుగులోకి తేవడానికి అక్టోబరు 26న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రజా చైతన్యయాత్ర చేపట్టారు. ఈ క్రమంలో భువనగిరి పర్యటనకు వచ్చినప్పుడు మూసీ కాలుష్య బాధిత ప్రజలు, రైతులను కలవాల్సిందిగా సీఎం రేవంత్‌ను ఎమ్మెల్యే కోరారు. దీంతో తన పుట్టినరోజు సందర్భంగా యాదాద్రికి వస్తున్న నేపథ్యంలో అనిల్‌కుమార్‌రెడ్డి కోరిక మేరకు బాధితులను కలవాలని సీఎం నిర్ణయించారు. అయితే నాగారం నుంచి ఇంద్రపాలనగరం మధ్యలోనిగ్రామాల ప్రజలతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలా? లేక సంగెం నుంచి బొల్లంపల్లి వరకు చేపట్టాలా? అన్నదానిపై ఇంకా నిర్ణయానికి రాలేదు. ఏది ఎంచుకున్నా 6-7 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు పాదయాత్ర చేసేందుకే సీఎం ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. సీఎం యాత్ర ఎక్కడ చేపట్టాలన్నది నిర్ణయించేందుకు జిల్లా కాంగ్రెస్ నేతలు మంగళ లేదా బుధవారం భేటీ కానున్నారని, ఒకట్రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. యాదాద్రి జిల్లాలో సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హనుమంత్‌రావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, యాదగిరిగుట్ట ఆలయ ఈవో భాస్కర్‌రావు, అధికారులు.. కొండపైన ప్రెసిడెన్షియల్ సూట్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే వలిగొండ మం డలంలోని సంగెం వద్ద గల మూసీ నది బ్రిడ్జినీ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లకు సంబంధించి భువనగిరి జోన్ డీసీపీ రాజేశ్‌చంద్ర ఇంద్రపాలనగరం గ్రామాన్ని సందర్శించారు.



ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో దానం నాగేందర్, బీసీ సంక్షేమ సంఘం నేతలు

ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసిన సీఎంకు కృతజ్ఞతలు

కులగణనలో బీసీలంతా పాల్గొనాలి: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్/బర్కత్‌పుర, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సమగ్ర కులగణన కోసం సర్కారు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు మార్గం సుగమమైందని బీసీ సంక్షేమ సంఘం నేత, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని కాచిగూడ అభినందన్ గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 6 నుంచి 21వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కులగణనలో బీసీలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కులం పేరు చెప్పుకోవడానికి ఎవరూ మొహమాట పడొద్దని సూచించారు. ఈ నేపథ్యంలోనే.. సీఎం రేవంత్‌ను జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కృష్ణయ్య కలిశారు. ప్రత్యేక కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్యను రేవంత్ శాలువాతో సన్మానించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, మత్స్య కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్, బీసీ సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు!

రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సమర్థంగా అమలుచేసేందుకు ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం ప్రతి ఉమ్మడి జిల్లాకొక ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించింది. రైతులకు ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలని, ఏవైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని, కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేయాలని సీఎం సూచించారు.

ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేక అధికారులు

01. ఆదిలాబాద్- కృష్ణ ఆదిత్య
02. కరీంనగర్- ఆర్‌వీ కర్ణన్
03. నల్లగొండ- అనితా రాంచంద్రన్
04. నిజామాబాద్- ఎ. శరత్
05. రంగారెడ్డి - డి. దివ్య
06. మహబూబ్‌నగర్- రవి
07. వరంగల్- వినయ్ కృష్ణారెడ్డి
08. మెదక్- దాసరి హరిచందన
09. ఖమ్మం- కె. సురేంద్రమోహన్

సంక్రాంతి నుంచి సన్నబియ్యం

- ధాన్యం కొనుగోళ్ల కోసం రూ.20వేల కోట్లు సిద్ధం: మంత్రి ఉత్తమ్



సూర్యాపేట(కలెక్టరేట్), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నుంచి రాష్ట్రంలోని 2.80కోట్ల మందికి రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం అందిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సూర్యాపేటలో నిర్మించిన డీఎస్పీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎంఆర్ మిల్లింగ్ చార్జీలను సన్న బియ్యానికి ప్రస్తుతం ఉన్న రూ.10నుంచి రూ.50, దొడ్డు రకానికి రూ.10నుంచి రూ.40కి పెంచినట్లు తెలిపారు. ధాన్యం సేకరణపై రాజకీయం చేసేందుకే ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, బీఆర్ఎస్ హయాంలో కంటే మెరుగ్గా ధాన్యం సేకరిస్తున్నామన్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రభుత్వం రూ.20వేల కోట్లను సిద్ధం చేసిందన్నారు. ధాన్యం కొనుగోళ్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 7,500 కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేశామన్నారు. సన్నరకానికి క్వింటాకు మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇస్తున్నట్లు వివరించారు.

మీ సేవ నిర్వాహకుల కమీషన్ పెంచేందుకు సిద్ధం

- జనవరి నుంచి పెంచిన కమీషన్ అమలు
- త్వరలో మీసేవ ఫెడరేషన్ ప్రతినిధులతో చర్చలు
- ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాంనగర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మీ సేవ నిర్వాహకుల కమీషన్‌ను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఐటీ శాఖమంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. త్వరలోనే తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఎంతమేరకు కమీషన్ పెంచాలనే విషయాన్ని చర్చించి జనవరి నుంచి అమలు చేస్తామని తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో తెలంగాణ మీ సేవ ఫెడరేషన్ 14వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీ సేవలో నూతనంగా అందించే సేవలకు సంబంధించిన బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ప్రభుత్వ సర్వీసులను ఒకే గొడుగు కిందకు తీసుకురావలన్న సంకల్పంతో 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం మీ సేవను ప్రారంభించిందని మంత్రి గుర్తు చేశారు. మీ సేవల ద్వారా దళారుల ఆట కట్టించామన్నారు. మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు హెల్త్ కార్డులతోపాటు ఇతర పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మీ సేవా నిర్వాహకులకు కనీస వేతనాలు వచ్చే విధంగా కమీషన్‌ను నిర్ణయిస్తామని మంత్రి తెలిపారు.

రాజకీయ పార్టీల రెచ్చగొట్టే ప్రకటనలు నమ్మొద్దు

- విద్యార్థులు, నిరుద్యోగులూ.. పోటీ పరీక్షలకు సిద్ధం కండి
- విద్యార్థులకు చదువుతోపాటు.. సామాజిక స్పృహ కూడా ముఖ్యమే
- విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి
- సీఎంను కలిసిన కేజీబీవీ విద్యార్థులు

హైదరాబాద్/మంచిర్యాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలు చేసే రెచ్చగొట్టే ప్రకటనలను విద్యార్థులు, నిరుద్యోగులు నమ్మవద్దని, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకుని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అయితే విద్యార్థులకు చదువు, సామాజిక స్పృహ.. రెండూ ముఖ్యమేనని సీఎం అభిప్రాయపడ్డారు.చదువుకున్నవారు ప్రయోజకులు అవుతారని, సామాజిక స్పృహతో సమాజానికి సేవ చేస్తే హీరోలవుతారని చెప్పారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో సీఎంని జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వసతి గృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినందుకు సీఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు. తమ పాఠశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో స్థానిక అధికారులతో స్థల సేకరణ చేయించిన వెంటనే సొంత హాస్టల్ భవనం మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో రాష్ట్రంలో విద్యావ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యావ్యవస్థలో సమూల మార్పులు తెస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలకు, కళాశాలలకు ఉచిత విద్యుత్తు ఇస్తున్నామని, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. దీంతోపాటు ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని, త్వరలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. స్కూళ్లు, కాలేజీల్లో డ్రాపవుట్‌లను తగ్గించాల్సిన అవసరం ఉందని, ఇది యువతరంపై ఉన్న అతిపెద్ద బాధ్యత అని గుర్తు చేశారు. యువత విద్యను నిర్లక్ష్యం చేయొద్దని, సమాజానికి అత్యంత ప్రమాదకరంగా మారిన గంజాయి, డ్రగ్స్ లాంటి వ్యసనాల బారిన పడొద్దని సూచించారు. పాఠశాలల్లో విద్యతో పాటు సామాజిక అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించాలని అన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల కోసం.. ప్రత్యేక కమిషన్ నియామకం

- ఛైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ బూసాని
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- నెల రోజుల్లో నివేదిక అందించాలన్న సర్కారు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక(డెడికేటెడ్) కమిషన్‌ను నియమించింది. కమిషన్ ఛైర్మన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావును నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిషన్ సిబ్బంది, వేతనాలకు సంబంధించి ప్రత్యేకంగా ఉత్తర్వులను జారీ చేయనున్నట్లు తెలిపింది. నెల రోజుల్లో సమగ్ర నివేదికను అందించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. హైకోర్టు ఆదేశాల మేరకే ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. కాగా, బీసీ గురుకులాల కార్యదర్శిగా ఉన్న బి.సైదులును కమిషన్‌కు కార్యదర్శిగా నియమించింది. సమాచారం, గణాంకాల కోసం వివిధ సంస్థలు, వ్యక్తుల సహాయాన్ని ఈ కమిషన్ తీసుకోవచ్చని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి డేటాను సేకరించవచ్చని పేర్కొంది. నిపుణులు, పరిశోధకులతో సమావేశాలు నిర్వహించడంతో పాటు, అవసరమైతే అధ్యయనానికి పర్యటనలు చేయొచ్చని వివరించింది. ఇదే ఉత్తర్వుల్లో.. ప్రత్యేక కమిషన్‌కు సంబంధించి గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన ఆదేశాలు, కె.కృష్ణమూర్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా(2010), వికాస్‌కిషన్ రావు గవాలీ కేసు(2021)ని ప్రభుత్వం ఉటంకించింది.రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించే రిజర్వేషన్లను నిర్ణయించే క్రమంలో ప్రభుత్వం కులగణనకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే..! బుధవారం నుంచి తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల ప్రాతిపదికన సర్వే ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు కల్పించే రిజర్వేషన్ల ఖరారుకు బీసీ కమిషన్ సూచనలు కాకుండా.. ప్రత్యేక కమిషన్ ఉండాలని, లేకపోతే.. ఆయా రిజర్వేషన్లు న్యాయపరంగా నిలబడవని పేర్కొంటూ రాజ్యసభ మాజీ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు సంబంధించి సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలు కూడా ఉండడంతో.. హైకోర్టు ఈ పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వ వైఖరేంటన్నది ఈ నెల 21లోపు తెలియ జేయాలని ఆదేశించింది. దీంతో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి పలువురు మంత్రులతో భేటీ సందర్భంగా జారీ చేసిన ఆదేశాల మేరకు.. సోమవారం ప్రత్యేక కమిషన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ట్రిపుల్-టీలో ఒకటి పూర్తి..

వేర్వేరు కేసుల విషయంలో సుప్రీంకోర్టు 'ట్రిపుల్-టీ(ట్రిపుల్ టెస్ట్)' పేరుతో మార్గదర్శకాలిచ్చింది. మొదటిది స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాల అధ్యయనానికి ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయడం. రెండోది.. కమిషన్ సిఫార్సుల మేరకు స్థానిక సంస్థల వారీగా రిజర్వేషన్ల నిష్పత్తిని నిర్దేశించడం. మూడోది.. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు 50శాతానికి మించకూడదు. గతంలో ట్రిపుల్-టీ మార్గదర్శకాలను పాటించని రాష్ట్రాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను సుప్రీం కోర్టు రద్దు చేసిన దాఖలాలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి, మొదటి-టీని పూర్తిచేసిన ప్రభుత్వం.. కులగణన తర్వాత మిగతా రెండు మార్గదర్శకాలపై నిర్ణయం తీసుకోనుంది.

పట్టు పరిశ్రమ పునరుజ్జీవానికి చర్యలు

- అందులో తక్కువ పెట్టుబడితో ఎక్కువ రాబడి
- ఆ పరిశ్రమను ప్రోత్సహించాలని తుమ్మల ఆదేశాలు
- ఒక్కరోజే 3,400 టన్నుల పత్తి కొన్నామని వెల్లడి



హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమలో తక్కువ పెట్టుబడితో అధిక రాబడి ఉందని, గ్రామీణ పేదలకు అనుకూలంగా స్థిరమైన వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పట్టు పరిశ్రమను మరింత ప్రోత్సహించే దిశగా ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టు పరిశ్రమ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. రైతులు రెండెకరాల్లో మల్బరీ మొక్కలను నాటితే ఐదుగురి వరకు ఉపాధి దొరుకుతుందని, ఏడాదికి సగటున 2 నుంచి 3 లక్షల ఆదాయం వస్తుందన్నారు. పట్టు పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రాయితీలు ప్రకటిస్తున్నాయని, రైతులు పంట మార్పిడిలో భాగంగా మల్బరీ సాగు, పట్టు పురుగుల పెంపకం చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ఉన్న ఆటోమేటిక్ రీలింగ్ యూనిట్లకు సరిపడే నాణ్యమైన పట్టు గూళ్ల ఉత్పత్తికి అవసరమైన సాంకేతిక సలహాలను జిల్లాల వారీగా రైతు సదస్సులు ఏర్పాటు చేసి రైతు రాబడిని పెంచాలని సూచించారు. పోచంపల్లి ఇక్కత్, గద్వాల, నారాయణపేట చీరలకు ముడి సరుకును ఇక్కడే ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కారు రాష్ట్ర వాటా నిధులు కేటాయించకపోవడంతో పట్టు పరిశ్రమకు అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 2024-25 సంవత్సరానికి రూ.16 కోట్ల మ్యాచింగ్ గ్రాంటును రాష్ట్ర వాటా కింద జమ చేసిందని తెలిపారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయన్నారు. సీసీఐ 105 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, సోమవారం ఒక్కరోజే 1,474 మంది రైతుల నుంచి 3,400 టన్నుల పత్తిని కొనుగోలు చేశామని వెల్లడించారు.

10న ల్యాబ్ టెక్నీషియన్ రాత పరీక్ష

నిమిషం ఆలస్యమైన అనుమతించబోమన్న మెడికల్ బోర్డు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ (ఎల్టీ) నియామక పరీక్ష ఈ నెల 10న జరగనుంది. కంప్యూటర్ ఆధారితంగా మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.20 గంటల వరకు ఈ పరీక్ష జరుగుతుందని మెడికల్ బోర్డు కార్యదర్శి గోపికాంత్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. మొత్తం 22 వేల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. అభ్యర్థులు పరీక్ష హాల్‌లోకి రిపోర్టు చేసే సమయం మధ్యాహ్నం 1.30 గంటలు కాగా, 2.45 గంటలకు గేటు మూసివేస్తామని బోర్డు కార్యదర్శి స్పష్టం చేశారు. నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించబోమన్నారు.

ప్రత్యక్ష పద్ధతిలో సచివాలయ సంఘం ఎన్నికలు

హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సచివాలయ సంఘం(టీఎస్ఏ) ఎన్నికలు ఈసారి ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు మాధవరం నరేందర్ రావు తెలిపారు. సోమవారం జరిగిన సచివాలయ సంఘం ఉద్యోగుల సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరం అయితే వందమెట్లు దిగివచ్చి అయినా సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. ఉద్యోగుల అభిప్రాయం ప్రకారం ప్రస్తుతం ఉన్న నిబంధనావళిని(బైలా) మార్చి ఈసారి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని తీర్మానించామని తెలిపారు. డిసెంబరులో ప్రస్తుత కమిటీ గడువు ముగుస్తున్నందున ఆలోపు సంఘం బైలాస్ సవరణ పూర్తి చేయాలని ఉద్యోగులు అభిప్రాయపడ్డారని చెప్పారు. తెలంగాణ సచివాలయ అధికారుల సంఘం, సెక్షన్ అధికారుల సంఘం, అసిస్టెంట్ సెక్షన్ అధికారుల సంఘం, మహిళా ఉద్యోగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఇథనాల్' ఉద్యమానికి మద్దతు.. టీచర్‌పై వేటు

దిలావర్‌పూర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇథనాల్ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు ఇస్తున్నారని నిర్మల్ పట్టణంలోని బాగులవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి విజయ్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు కొంతకాలంగా ఉద్యమం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఉద్యమానికి పరోక్షంగా, ప్రత్యక్షంగా విజయ్‌కుమార్ మద్దతు ఇస్తున్నట్లు ఆరోపణలున్న నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేస్తూ డీఈవో రవీందర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. విజయ్‌కుమార్‌పై సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని దిలావర్‌పూర్ ఇథనాల్ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు కూడా ప్రజలలో ఒకరని, వారికి కూడా సామాజిక బాధ్యత ఉంటుందని అన్నారు. అలాగే ఇథనాల్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని వారు కోరారు.

జీవన్‌దాన్ నోడల్ ఆఫీసర్‌గా శ్రీభూషణ్ రాజు



హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవన్‌దాన్ నోడల్ అధికారిగా డాక్టర్ శ్రీ భూషణ్ రాజు నియమితులయ్యారు. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శ్రీ భూషణ్‌రాజు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో నెఫ్రాలజీ ప్రొఫెసర్‌గా వైద్య సేవలందిస్తున్నారు. నిమ్స్‌లోనే పనిచేస్తున్న డాక్టర్ స్వర్ణలత జీవన్‌దాన్ ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు నోడల్ అధికారిగా ఉన్నారు. ఇటీవల జీవన్‌దాన్ ద్వారా అవయవదాన కేటాయింపుల్లో కార్పొరేట్ ఆస్పత్రులకే మేలు చేశారన్న ఆరోపణలు వినిపించాయి. దీనిపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆడిట్‌కు ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే డాక్టర్ స్వర్ణలతను తప్పించి.. శ్రీభూషణ్ రాజును సర్కారు నియమించింది.

ఓటుకు నోటు కేసు విచారణ నుంచి తప్పుకొన్న జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ

న్యూఢిల్లీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసు విచారణ నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ తప్పుకొన్నారు. ఓటుకు నోటు కేసు నుంచి తనను తప్పించాలని, తాను నిర్దోషినని పేర్కొంటూ జెరూసలేం మత్తయ్య తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. గతంలోనే న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. అయితే, ఆ కేసు నుంచి మత్తయ్య పేరును క్వాష్ చేయడాన్ని (తొలగించడాన్ని) 2016 జూలై 6న తెలంగాణ అవినీతి నిరోధక శాఖ సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ బేలా ఎమ్. త్రివేది, జస్టిస్ సతీష్ చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే.. తాను గతంలో తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పని చేసినందున... ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నానని సతీశ్ చంద్ర శర్మ తెలిపారు. కాగా, ఈ నెల 12న మరో ధర్మాసనం ముందుకు ఈ కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది. అమికస్ క్యూరీ స్థానంలో మత్తయ్య మరో న్యాయవాదిని నియమించుకున్నారు. ఈ విషయాన్ని మత్తయ్య తరఫున న్యాయవాది ధర్మాసనానికి తెలియజేశారు.

యువతిపై కత్తిదూసిన ప్రేమోన్మాది

- ప్రేమించనన్నందుకు కోపంతోనే దుశ్చర్య
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో యువతి.. మెదక్‌లో ఘటన

మెదక్ అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తనను ప్రేమించడం లేదన్న ఆగ్రహం, అక్కసుతో ఓ యువకుడు ప్రేమోన్మాదిగా మారి యువతిపై దాడికి తెగబడ్డాడు. కత్తితో చేయి కోసి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో ఆమె ఆస్పత్రి పాలైంది. ఈ ఘటన మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని అవుసులపల్లికి చెందిన యువతి స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డిగ్రీ బీఏ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఆమె సోమవారం సెకండ్ సెమిస్టర్ చివరి పరీక్ష కోసం ఉదయం కళాశాలకు చేరుకుంది. అదే సమయంలో అక్కడి వచ్చిన చేతన్ అలియాస్ కిరణ్ అనే యువకుడు కళాశాల గేట్ ఎదుట ఆమెతో వాగ్వాదానికి దిగాడు. 'నేను నిన్ను ప్రేమిస్తున్నా.. నన్ను ప్రేమిస్తున్నావా లేదా' అని ప్రశ్నించగా అందుకు ఆమె నిరాకరించింది. దాంతో చేతన్ తీవ్ర ఆగ్రహంతో వెంట తెచ్చుకున్న కత్తితో విద్యార్థిని చేయి కోసి అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయాలైన యువతిని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. తాను ప్రేమ ప్రతిపాదనను తిరస్కరించినందుకే చేతన్ తనపై కత్తితో దాడి చేశాడని బాధిత యువతి పోలీసులకు తెలిపింది.

క్రికెట్ ఆడుకుంటామన్న విద్యార్థులపై కర్కశం

- ఒకరిని చితకబాదిన టీచర్లు.. గదిలో ఆరుగురి నిర్బంధం

మూడుచింతలపల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తోటి విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడుకుంటామని అడిగినందుకు ఉపాధ్యాయులు, స్కూల్ చైర్మన్ కుమారుడు కలిసి ఓ విద్యార్థిపై తమ ప్రతాపం చూపించారు. వాతలు వచ్చేలా చితకబాదారు. మరో ఆరుగురు విద్యార్థులను గదిలో నిర్బంధించారు. ఈ ఘటన శామీర్‌పేట మండల కేంద్రంలోని సెయింట్ పాల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగింది. గత నెలలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఘనపురం గ్రామానికి చెందిన ఓ విద్యార్థి తండ్రి అక్టోబరులో పేరెంట్స్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు స్కూల్‌కు వచ్చారు. తన కుమారుడు దిగాలుగా ఉండడాన్ని గమనించిన ఆయన కుమారుడిని ఏం జరిగిందని ప్రశ్నించగా విలపిస్తూ స్కూల్ యాజమాన్యం చేసిన ఘాతుకాన్ని వివరించాడు. మీటింగ్‌కు రెండు రోజుల ముందు స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుకుంటామని ప్రిన్సిపాల్‌ను అడిగినందుకు ఉపాధ్యాయులు, చైర్మన్ కొడుకు అభిలాష్‌లు విచక్షణా రహితంగా వీపుపై, వీపుకింద భాగంలో చేసిన చితకబాదారని ఒంటిపై పడిన వాతలను చూపించాడు. తనతో పాటు మరో ఆరుగురిని గదిలో బంధించారని తెలిపాడు. దీంతో అక్టోబరు 31న బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు శామీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో సోమవారం బాధిత విద్యార్థుల తల్లిదండ్రులంతా కలిసి శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. కాగా, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి టెట్ దరఖాస్తులు

(మొదటి పేజీ తరువాయి)




ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కంప్యూటర్ ఆధారితంగా ఈ పరీక్షలను వచ్చే జనవరి 1 నుంచి 20 వరకు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నారు. టెట్ నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. https://schooledu.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో అభ్యర్థులు టెట్ నోటి ఫికేషన్ వివరాలను పరిశీలించవచ్చు.

టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలు (శాతాల్లో)..

ఏడాది	పేపర్-1	పేపర్-2
2011	44.20	49.68
2012	44.43	47.02
2014	61.86	28.56
2016	54.45	25.04
2017	57.37	19.51
2022	32.68	49.64
2023	36.89	15.30
2024	67.12	34.18

సర్టిఫికెట్లలో పేరు మార్పునకు తొలగిన ఇక్కట్లు

మార్చి కొత్తవి ఇస్తామని హైకోర్టులో సర్కారు అంగీకారం



హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిన్నతనంలో పెట్టిన పేర్లు ఆధునికంగా లేవని భావించి గెజిట్ నోటిఫికేషన్ ద్వారా మార్చుకున్న వారికి హైకోర్టులో ఊరట లభించింది. మార్చిన పేర్లతో కొత్తగా ధ్రువపత్రాలు జారీ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. పేర్లు మార్చుకున్నప్పటికీ ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్లలో పాత పేర్లు మార్చి కొత్తగా సర్టిఫికెట్లు జారీచేయడాన్ని నిషేధిస్తూ 1961లో జీవో నెంబరు 1263 జారీ అయింది. దీనిని సవాలు చేస్తూ వి. మధుసూదన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ జీవోలోని సెక్షన్ (సీ) రూల్ 1, 2, 3లను కొట్టేయాలని కోరారు. దీనిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుల ధర్మాసనం విచారణ చేపట్టింది. చట్టబద్ధంగా పేరు మార్చుకున్న తర్వాత కొత్త సర్టిఫికెట్లు జారీచేయడానికి ఇబ్బంది ఏమిటని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ సందర్భంగా 'జిగ్యా యాదవ్ వర్సెస్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉదహరించింది. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది ఎస్.రాహుల్‌రెడ్డి సమాధానం ఇస్తూ సుప్రీంకోర్టు తీర్పునకు కట్టుబడి ఉంటామని తెలిపారు. నిబంధనల ప్రకారం పేరు మార్చి కొత్త సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు.

విచ్చలవిడిగా గర్భవిచ్ఛిత్తి!

(మొదటి పేజీ తరువాయి)

ఇద్దరు, సిద్దిపేట జిల్లాలో ఒక మహిళ.. అబార్షన్ కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ఆర్ఎంపీలను సంప్రదించి, మందుల దుకాణాల్లో అడిగి నకిలీ మాత్రలు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకున్న ఘటనలే ఇందుకు నిదర్శనం. వాస్తవానికి.. కడుపులో పెరిగే శిశువు వల్ల తల్లికి ప్రాణానికి అపాయం ఉన్నప్పుడు, బిడ్డ ఎదుగుదల సరిగ్గా లేనప్పుడు, ఇద్దరు బిడ్డలున్న తల్లి మూడో కాన్పు వద్దనుకున్నప్పుడు.. గైనకాలజిస్టు అనుమతితో భర్త అంగీకారంతో అబార్షన్ చేయాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొంటున్నారు. అబార్షన్ చేసే సమయంలో కుటుంబ సభ్యుల్లో ఒకరు తప్పని సరిగ్గా ఆ మహిళ వెంట ఉండాలి. తల్లి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకోవడానికి వైద్య పరీక్షలు కూడా చేయించాలి. రక్తం తక్కువగా ఉన్నప్పుడు గర్భస్రావం చేస్తే.. తల్లి ప్రాణాలకే ముప్పు. ఇన్ని నిబంధనలు ఉంటాయి కాబట్టే.. చాలామంది మహిళలు గర్భస్రావం కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లేందుకు మొహమాటం పడుతున్నారు. గుట్టుగా ఆర్ఎంపీలను సంప్రదించి కడుపులో పిండాన్ని తొలగించుకునేందుకే మొగ్గు చూపి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వారి అవసరాన్ని ఆర్ఎంపీలు సొమ్ము చేసుకుంటున్నారు. మహిళల ఆర్థిక పరిస్థితులను బట్టి గర్భ విచ్ఛిత్తికి ధర నిర్ణయించి భారీగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం.. ఏడు వారాలు దాటిన గర్భిణికి గర్భస్రావం చేయాలంటే స్కానింగ్ తప్పనిసరి. కానీ, కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు ఎలాంటి పరీక్షలూ లేకుండానే గర్భ విచ్ఛిత్తి మాత్రలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అవి వికటించడంతో చాలా మంది మహిళలు ప్రాణాపాయ స్థితికి చేరుకుంటున్నారు. గర్భవిచ్ఛిత్తికి సంబంధించి వైద్యులు ఇచ్చే రెండు ఔషధాలూ షెడ్యూల్ హెచ్ డ్రగ్స్ కిందికి వస్తాయి. వాటిని ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎట్టిపరిస్థితుల్లోనూ అమ్మకూడదు. ఏ డిస్ట్రిబ్యూటర్ వద్ద కొన్నామో, ఎవరికి అమ్ముతున్నామో అనే వివరాలు విధిగా నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ.. అత్యధిక మందుల దుకాణాలు ఈ నిబంధనను పట్టించుకోవట్లేదు. అయినా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రికార్డులు ఉండట్లే!

గర్భస్రావం చేసే నర్సింగ్‌హోమ్‌లు.. 'మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ), 1971' చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి. అబార్షన్ చేసిన వారి వివరాలు పూర్తి సమాచారంతో రికార్డులో నమోదు చేసి ఉండాలి. భర్త, భార్య సంతకాలు ఉండాలి. ఎందుకు అబార్షన్ చేయాల్సి వస్తోందో అందులో వివరించాలి. కానీ చాలా నర్సింగ్‌హోములు ఇలాంటి రికార్డులను నిర్వహించడం లేదు. అలాగే.. గర్భస్రావం చేయాలంటే ఆధునాతన సదుపాయాలు, పరికరాలు, ఐసీయూ వంటివి ఉండాలి. ఐసీయూ సదుపాయం లేకపోతే గర్భిణికి ప్రాణాపాయం ఏర్పడినప్పుడు ఉరుకులు పరుగుల మీద మరో ఆస్పత్రికి పరుగులు తీయాల్సి వస్తుంది. అలాగే.. ఆపరేషన్ థియేటర్‌లోకి ఎవరు పడితే వారు వెళ్లకూడదు. నర్సింగ్ స్టాఫ్ ఆ సమయంలో ధరించాల్సిన దుస్తులు, మాస్క్‌లు ధరించాలి. కానీ చాలా ఆస్పత్రుల్లో ఈ నిబంధనలేవీ పాటించట్లేదు సరికదా.. ఆపరేషన్ థియేటర్‌లోకి ఎప్పుడు పడితే అప్పుడు నర్సింగ్ స్టాఫ్ తిరుగుతునే ఉంటారు. ఇలా చేయడం వల్ల ఆపరేషన్ థియేటర్‌లో శస్త్రచికిత్సలకు కావాల్సిన వాతావరణం ఉండదని వైద్యులు తెలిపారు.

పరారీలో ఆర్ఎంపీ

వరంగల్ మెడికల్: ములుగు జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన గర్భిణికి అబార్షన్ మాత్రలు ఇచ్చిన ఆర్ఎంపీని... మంగపేటకు చెందిన రాముగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. అయితే.. అతడు ఇంటికి తాళం వేసి పరారైనట్టు తెలిసింది. దీంతో ఆ ఆర్ఎంపీ కోసం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వెతుకుతున్నారు.

పిల్స్.. ఎలా పడితే అలా వద్దు



గర్భవిచ్ఛిత్తికి సంబంధించిన మాత్రలను ఎలా పడితే అలా వేసుకోకూడదు. కేవలం వైద్యుల పర్యవేక్షణలో మాత్రమే వేసుకోవాలి. గర్భం ఎన్ని వారాలు ఉంది? గర్భిణి పూర్వచరిత్ర ఏమిటి? ఇలా చాలా విషయాలను పరిశీలించి.. అసలు గర్భస్రావం చేయాలా వద్దా? చేస్తే ఎలా చేయాలి? అనే నిర్ణయాలను వైద్యులు తీసుకుంటారు. పిల్స్ వేయలేని వారిని ఆస్పత్రిలో ఉంచి డి అండ్ సీ విధానంలో అబార్షన్ చేయాల్సి ఉంటుంది. ఏడు వారాల లోపు గర్భం ఉన్నప్పుడే మాత్రల గురించి ఆలోచిస్తారు. 9 వారాలు దాటితే సర్జికల్ ప్రక్రియ చేయాలా? మెడికల్ మేనేజ్‌మెంట్ చేయాలా అనే విషయంపై డాక్టర్ నిర్ణయం తీసుకుంటారు. అలాగే.. కొంత మందికి గర్భసంచిలో కాకుండా గర్భాశయ నాళాల్లో పిండం ఏర్పడుతుంది. ఆ పిండాన్నితొలగించడానికి పిల్స్ పనిచేయవు. ఒక వేళ వేసుకుంటే ట్యూబ్‌లో ఉన్న పిండం బయటకు రాకుండా, లోపల ఉండకుండా చిట్లిపోయి రక్తస్రావం అవుతుంది. రిజిస్ట్రేషన్ లేని వైద్యులు పిల్స్‌ను యాంటిబయాటిక్ మెడిసిన్ మాదిరిగా ఇస్తున్నారు. దీంతో ఓవర్ బ్లీడింగ్ జరిగి ప్రాణాల మీదకు వస్తుంది. ఆ మాత్రలను కూడా.. సరైన మోతాదు, నిర్దేత పద్ధతి ప్రకారం ఇవ్వాలి. కొంతమంది.. ఒకసారి వేసుకున్న మాత్రలు పనిచేయకపోతే రెండు, మూడు పిల్స్ వేసుకుంటున్నారు. అలా వేసుకోవడం మరింత ప్రమాదం.

\- డాక్టర్ హవ్య పోలవరపు, సీనియర్ గైనకాలజిస్టు, కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రి

వైద్య నిపుణుల సలహా తప్పనిసరి



గర్భవిచ్ఛిత్తి మాత్రలను గైనకాలజిస్టు సలహా లేకుండా ఎట్టి పరిస్థితుల్లో వాడకూడదు. ఆ మాత్రల వల్ల అధిక రక్తస్రావం కావడంతోపాటు.. పిండ కణజాలం లోపలే కొంతమేర మిగిలి ఉండే అవకాశం ఉంటుంది. దాన్ని తొలగించకపోతే ఇన్ఫెక్షన్ వ్యాప్తి చెంది గర్భిణి ఇతర అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. తద్వారా శరీరం మొత్తం విషతుల్యమై ప్రాణాపాయం సంభవించే ప్రమాదం పొంచి ఉంది. కాబట్టి.. ఆర్ఎంపీలు, పీఎంపీల సలహాలు పాటించి ప్రాణం మీదికి తెచ్చుకోవద్దు. నిపుణులైన వైద్యుల సలహా ప్రకారం నడుచుకోవాలి.

\- డాక్టర్ నరేశ్ కుమార్ వేములపల్లి, వైర్మన్ పబ్లిక్ రిలేషన్ కమిటీ, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ హైదరాబాద్

మూడో నెల దాటితే పిల్స్‌తో మరింత ముప్పు



గర్భస్రావం చేయించుకోవాలంటే.. త్వరగా నిర్ణయం తీసుకోవాలి. ఏడు వారాల లోపలే చేయించుకోవడం మంచిది. ఆ తర్వాత పిల్స్ వేసుకుంటే పూర్తిస్థాయిలో అబార్షన్ జరగకపోవచ్చు. కొన్ని పిండం ముక్కలు గర్భంలోపలే ఉండే ప్రమాదం ఉంది. మరికొన్ని గర్భసంచి ముఖ ద్వారం వద్ద వచ్చి ఆగిపోతాయి. దాన్ని అసంపూర్తి గర్భస్రావంగా పరిగణిస్తాం. వాటిని పూర్తిగా తొలగించేంత వరకు అవి బయటకు రావు.

ఇక.. మూడో నెల దాటితే పిల్స్ వేసుకోవడం మరింత ప్రమాదం. అప్పటికే గర్భస్థ శిశువుకు అవయవాలు ఏర్పడుతాయి. మాత్రల వల్ల కొన్ని పిండం ముక్కలు లోపలే ఉండిపోతే.. ఎక్కువ రక్తస్రావం జరుగుతుంది. బిడ్డ, తల్లి.. ఇద్దరికీ తీవ్ర ఇబ్బందులు వస్తాయి.

\- డాక్టర్ పూజిత దేవి, సురనేని, సీనియర్ గైనకాలజిస్టు, రెయిన్‌బో ఆస్పత్రి

కృష్ణా ప్రాజెక్టులపై తెలుగు రాష్ట్రాల పిటిషన్లను కలిపే విచారిస్తాం

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రాజెక్టులకు సంబంధించి తెలుగు రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లను కలిపే విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కృష్ణా బేసిన్‌పై ఉన్న శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులను కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి తెస్తూ 2021లో కేంద్రం గెజిట్ విడుదల చేసింది. కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న విద్యుత్కేంద్రాలను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం 2021జూలై 14న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. తెలంగాణ ప్రభుత్వ తీరుతో ప్రాజెక్టుల్లోని నీటి వాటాల వినియోగంలో వ్యత్యాసాలు వస్తున్నాయని పేర్కొంది. ఆ పిటిషన్‌పై విచారణ జరుగుతుండగానే.. కేంద్రం తెచ్చిన గెజిట్‌ను రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరులో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సోమవారం ఈ రెండు పిటిషన్లు వేర్వేరు ధర్మాసనాల ముందుకు విచారణకు వచ్చాయి. తెలంగాణ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. సుదీర్ఘ వాదనలు వినాల్సిన అవసరం ఉందంటూ కేసు విచారణను వాయిదా వేసింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ దాఖలు చేసిన పిటిషన్ జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. "కేఆర్ఎంబీ పరిధికి సంబంధించిన అంశంపైనే తెలంగాణ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ రోజు విచారణలో వాదనలు జరగలేదు. ఆ కేసు ఈ నెల 7కు వాయిదా పడింది" అని ఏపీ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. రెండు రాష్ట్రాల పిటిషన్లను కలిపి విచారిస్తే సరిపోతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్ పిటిషన్‌ను తెలంగాణ వ్యాజ్యాన్ని విచారిస్తున్న ధర్మాసనానికి బదిలీ చేయాలని రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. రెండు పిటిషన్లు.. గురువారం(7న) విచారణకు వచ్చే అవకాశం ఉంది.

హామీల అమలు ఎప్పుడు?

- 6 గ్యారెంటీలు ఏమయ్యాయి
- రాహుల్ జవాబు చెప్పాలి: కిషన్‌రెడ్డి
- సమగ్ర సర్వే నివేదిక ఏమైంది?
- కులగణన పేరిట హడావుడి: సంజయ్






హైదరాబాద్/సిరిసిల్ల/కరీంనగర్ టౌన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): "అసెంబ్లీ ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించిన డిక్లరేషన్లు.. ఆరు గ్యారెంటీలు.. 400 హామీలు ఏమయ్యాయి..? ఎన్నికల ముందు మీరు స్వయంగా ప్రకటించిన రైతు భరోసా, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డలకు తులం బంగారం, 17 పంటలకు బోనస్ ఎప్పుడు ఇస్తారు..? దళితబంధు ఉందా..? లేదా..? బీసీలు, గిరిజనులకు మీరిచ్చిన హామీలు ఏమయ్యాయి..? వాటిని ఎప్పటి నుంచి అమలు చేస్తారు..? స్పష్టమైన ప్రకటన చేయాలి" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు.. కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ ఆర్థికంగా దివాళా తీశాయని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంపై పునరాలోచన చేస్తామని కర్ణాటక సీఎం ప్రకటించారని చెప్పారు. కర్ణాటక, హిమాచల్‌తో పోలిస్తే తెలంగాణ పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో రూ.7లక్షల కోట్లు అప్పు చేస్తే.. ఏడాది తిరక్కుండానే కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.లక్ష కోట్ల అప్పు చేసిందని తెలిపారు. ఇంకా ఎక్కడి నుంచి అప్పులు తీసుకోవాలన్న విషయమై ఏకంగా టాస్క్‌ఫోర్స్ విభాగాన్నే ఏర్పాటు చేసిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ హామీకి సంబంధించి ధైర్యముంటే హైకోర్టు సిటింగ్ జడ్జికి నివేదిక ఇవ్వాలని కిషన్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. 'రైతు సంఘాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలో 38.63 లక్షల మంది రైతులకు రూ.33,265 కోట్లు రుణమాఫీ జరగాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెట్టిన నిబంధనల ప్రకారం 22.23 లక్షల మంది రైతులకు రూ.17,869 కోట్లు మాత్రమే రుణమాఫీ జరిగింది. రాహుల్ గాంధీ మాత్రం, తెలంగాణలో రూ.31వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు సిగ్గులేకుండా ప్రచారం చేస్తున్నారు" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. కాగా, మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలుచుకోలేని కేటీఆర్ కూడా ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యంపై మహారాష్ట్ర ఓటర్లకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు సరికాదు: సంజయ్

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే నివేదిక ఏమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు బయటపెట్టడం లేదో చెప్పాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వర్దవెల్లి గ్రామం విఎడ్మానేరు బ్యాక్‌వాటర్‌లో ముంపునకు గురైంది. అక్కడ గుట్టపై ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయానికి వెళ్లి నిత్య పూజలు, జయంతి ఉత్సవాలు నిర్వహించేందుకు బండి సంజయ్ బోటు సౌకర్యం కల్పించారు. సోమవారం బోటును ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమగ్ర కుటుంబ సర్వేలో కుటుంబం, మతం, ఆదాయం, ఆస్తుల వివరాలు నమోదు చేశారని.. ఇప్పుడు మళ్లీ కులగణన పేరుతో హడావుడి ఎందుకని అన్నారు. మాజీ సర్పంచ్‌లు రోడ్డెక్కి అడుక్కునే పరిస్థితికి గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ పాలకులేనని బండి సంజయ్ విమర్శించారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని ఆ రెండు పార్టీలు హామీలిచ్చి.. గాలికొదిలేయడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. సోమవారం కరీంనగర్‌లో సంజయ్ మీడియాతో మాట్లాడారు. పెండింగ్ బిల్లుల కోసం ఆందోళన చేస్తున్న మాజీ సర్పంచులను పోలీసులు అరెస్టు చేయడాన్ని ఖండించారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని సంజయ్ మండిపడ్డారు. వడ్లకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని, దీనిపై రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఏడాదిలో వందేళ్ల విధ్వంసం!

- దోచుకుంటున్న సీఎం, మంత్రులు
- కాంగ్రెస్ వైఫల్యాలు చిత్రగుప్తుడి చిట్టా అంత ఉన్నాయ్
- రాహుల్‌కి నిరుద్యోగుల వద్దకు వెళ్లే దమ్ముందా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ వందేళ్ల విధ్వంసానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి, గద్దెనెక్కిన తర్వాత ప్రజల గొంతు కోశారని ధ్వజమెత్తారు. తెలంగాణకు వస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇక్కడి పరిస్థితులు తెలుసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, పోలీసులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఆటోడ్రైవర్లు, చేనేత కార్మికులు, మూసీ, హైడ్రా బాధితులు.. ఇలా సమాజంలో అన్ని వర్గాలను వంచించారని ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలంటూ ఊదరగొట్టి.. వాటిని అమలు చేయలేక చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. ఏడాదిలో కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యాలు చిత్రగుప్తుడి చిట్టా అంత ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ట్విటర్‌లో మాత్రం పూర్తిగా రుణమాఫీ చేశామంటూ సిగ్గులేకుండా అబద్ధాలను ప్రచారం చేసుకుంటోందని, కనీసం రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేయలేని దద్దమ్మల్లా తయారయ్యారని దుయ్యబట్టారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా పోలీసులను పోలీసులతోనే కొట్టించిన ఘనత కాంగ్రెస్ సర్కారుకే దక్కుతుందన్నారు. 'మూసీ, హైడ్రా పేరుతో మీ సీఎం పేద, మధ్య తరగతి ప్రజల పొట్ట కొడుతున్నారు. తెలంగాణలో చిన్నపిల్లాడు పిలిచినా వస్తానంటూ బీరాలు పలికిన మీరు (రాహుల్) ఇన్నాళ్లు ఎక్కడ దాక్కున్నారు? స్వయంగా అశోక్‌నగర్‌కు వచ్చి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలకు నాది భరోసా అన్నావ్. ఆ నిరుద్యోగులను మోసం చేస్తున్నందుకు సిగ్గనిపించడం లేదా? ఇప్పుడు ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, నిరుద్యోగులు, హైడ్రా బాధితుల వద్దకు వెళ్లే దమ్ముందా?' అని రాహుల్‌ని నిలదీశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి మించి హామీలిస్తే దివాలా తీస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేనే చెబుతున్నారని.. అధికారమే పరమావధిగా అనేక హామీలు గుప్పించిన పాపంలో ప్రధాన భాగస్వాములైన రాహుల్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం, మంత్రులు తెలంగాణను అడ్డగోలుగా దోచుకునే కార్యక్రమం పెట్టుకున్నారని, ఎవరి ట్యాక్స్ వాళ్లకు కట్టే పరిస్థితి తెచ్చారని కేటీఆర్ ఆరోపించారు. సీఎం బహిరంగంగానే ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. ఇది చాలదన్నట్లుగా రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారని.. ఈ సొమ్ములో ఢిల్లీ వాటా ఎంతో రాహుల్ చెప్పాలని నిలదీశారు. పార్టీ ఫిరాయింపులతో తెలంగాణలో రాజ్యాంగ ఉల్లంఘనలు జరుగుతుంటే మాట్లాడరెందుకని ప్రశ్నించారు. కాగా, రాష్ట్రవ్యాప్తంగా మాజీ సర్పంచుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని కేటీఆర్ ట్వీట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పనిచేయని ప్రభుత్వాన్ని చూస్తుంటే..

అమెరికాకు చెందిన టెస్లా కార్ల తయారీ ప్లాంట్‌ను రాష్ట్రానికి రప్పించడంలో ఏమాత్రం ప్రయత్నం చేయని ప్రభుత్వాన్ని చూస్తుంటే తీవ్ర ఆవేదన కలుగుతోందని కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ విషయంలో అమెరికా సహా విదేశీ పర్యటనలు చేస్తున్న సీఎం, మంత్రులు ఏం చేస్తున్నారని నిలదీశారు. టెస్లా భారత్‌లో యూనిట్‌ను నెలకొల్పనుందని; అందుకోసం గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలను పరిశీలిస్తోందనే వార్తల నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. ఈ రాష్ట్రాల జాబితాలో తెలంగాణను పరిగణనలోకి కూడా తీసుకోకపోవడం విచారకరమన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.